www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


ఆదివారం | 5-10-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 187 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి మ.3.04 తదుపరి చతుర్దశి; నక్షత్రం: శతభిషం ఉ.8.01 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: మ.1.57-3.26; దుర్ముహూర్తం: సా.4.22-5.10; అమృతఘడియలు: రా.10.51-12.20; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.57 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జో....ష్!

స్థానిక ఎన్నికలు జరుగుతాయా? లేదా?

ఖర్చుపై ఆశావహుల డైలమా



- అత్యధిక చోట్ల దసరా దావత్‌లకూ దూరమే
- కొన్నిచోట్ల కోర్టు తీర్పు తర్వాత ఇస్తామని హామీ
- కోర్టుల్లో పిటిషన్లు దాఖలు కావడమే కారణం
- ఏం జరుగుతుందో తెలియక ఆచితూచి అడుగులు
- షెడ్యూలు వచ్చినా కనిపించని 'లోకల్ జోష్'
- మరోవైపు.. సిద్ధమవుతున్న అభ్యర్థుల జాబితాలు
- ఏకగ్రీవం చేసుకునేందుకు కొన్నిచోట్ల యత్నాలు

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ వచ్చిందంటే చాలు.. గ్రామాల్లో ఆ జోషే వేరు! అప్పటి వరకూ ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతుంది. ప్రజలు కూడా పార్టీల వారీగా గ్రూపులు కడతారు! ఖర్చు విషయంలో ఆశావహులు తగ్గేదే లేదన్నట్టు పెడుతుంటారు. షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల తంతు పూర్తయ్యే వరకు అస్సలు వెనుకాడరు. కానీ, ఈసారి పరిస్థితులు ఇందుకు కొంత భిన్నంగా ఉన్నాయి. ఆశావహులు.. తమకే టికెట్ వస్తుందని అనుకుంటున్నవారు.. అభ్యర్థి తానేనని కొంతవరకూ ఖరారైన వారిలోనూ ఒక రకమైన డైలమా కనబడుతోంది. ఖర్చు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. నిజానికి, షెడ్యూల్ విడుదలైన తర్వాత దసరా రావడంతో రాజకీయ దావత్‌లు ఎక్కువగా ఉంటాయని అంతా భావించారు. కానీ, ఈసారి కొన్నిచోట్ల దావత్‌లు గట్టిగా జరిగితే.. మరికొన్నిచోట్ల 'ఇంకా సమయం ఉందిగా' అనే మాటతో సరిపెట్టేశారు. ఇందుకు కారణం.. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో రిజర్వేషన్లు మారడం, సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలు కావడం.. రెండు, మూడ్రోజుల్లో వాటిపై విచారణలు ఉండడమే. విచారణల తర్వాత కోర్టులు ఏం తీర్పుని స్తాయో చూసి, ముందుకెళ్తే బాగుంటుందని నాయకులు భావిస్తున్నారు. ఈ కారణంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జోష్ కనబడడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి, రిజర్వేషన్లు మారడంతో తమకే టికెట్ వస్తుందనుకున్న వారికి నిరాశ ఎదురైంది. వాళ్లు చప్పుడు చేయడం లేదు. రిజర్వేషన్ల మార్పుతో టికెట్ తమకే వస్తుందనుకుంటున్న వారు కూడా కోర్టు విచారణల నేపథ్యంలో అడుగు ముందుకు వేయడం లేదు. ఖర్చు పెట్టకపోతే ఓటర్లు ఎటువైపు వెళ్తారోననే ఆందోళన ఒకవైపు.. ఇప్పుడే ఖర్చు చేస్తే కోర్టుల్లో తీర్పు వచ్చాక పరిస్థితి ఏమిటోననే భయం మరోవైపు వెన్నాడుతున్నాయి. ఓటర్లు తమవైపు చూస్తున్నారని, కోర్టు తీర్పుల్లో ఏం జరుగుతుంది? ఖర్చు చేయాలా వద్దా!? అంటూ పార్టీ కార్యాలయాలకు ప్రశ్నలు ఎదురవుతున్నాయని ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడొకరు చెప్పారు. కొన్నిచోట్ల మాత్రం ఓటర్లు చేజారిపోకుండా

మిగతా 13వ పేజీలో...

8న జడ్పీటీసీ అభ్యర్థుల ప్రకటన

- ఒక్కో స్థానానికి 3 పేర్లను పంపాలని జిల్లా కమిటీలకు పీసీసీ ఆదేశం
- నేటి సాయంత్రం అందనున్న జాబితాలు.. రేపు పరిశీలన
- 7న ముఖ్యమంత్రి రేవంత్‌తో భేటీ
- ఏకాభిప్రాయం లేనివి పెండింగ్‌లో..
- నామినేషన్ల చివరి నాటికి ఖరారు
- ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులకు డీసీసీ స్థాయిలోనే అభ్యర్థుల ఎంపిక

13

స్థానికంపై సుప్రీంలో పిటిషన్

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చెల్లదు
- రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ను కొట్టేయండి
- పిటిషన్‌పై రేపు విచారణ జరపనున్న సుప్రీం కోర్టు

13

సినీతారలకు 'ఏఐ' విలన్!

కృత్రిమ మేధతో సెలబ్రిటీల రూపంలో విచ్చలవిడిగా కంటెంట్ తయారీ

- యాడ్స్ నుంచి అశ్లీల కంటెంట్ దాకా రూపొందించి సోషల్ మీడియాలో పెడుతున్న వైనం
- వైరల్ అవుతుండటంతో సెలబ్రిటీలకు తంటాలు
- కోర్టులను ఆశ్రయిస్తున్న నటులు
- ఢిల్లీ హైకోర్టులో నాగార్జున, అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యారాయ్, కరణ్ జోహార్ పిటిషన్లు
- ఈ తరహా కంటెంట్‌ను అడ్డుకోలేని యూట్యూబ్, సోషల్ మీడియా
- అల్గారిథం లోపాల వల్లే: నిపుణులు
- మాన్యువల్ రివ్యూతోనే పరిష్కారం: నల్లమోతు శ్రీధర్



హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సినీతారలకు కృత్రిమ మేధ (ఏఐ) విలన్‌గా మారింది. ఇటీవలి వరకు సినిమాల్లో స్పెషల్ ఎఫెక్టుల కోసం వాడిన సాంకేతికత ఇప్పుడు డిజిటల్ మోసగాళ్ల చేతిలో కొత్త ఆయుధంగా మారింది. ఏఐ సాయంతో సినీ సెలబ్రిటీల రూపంలో తయారవుతున్న చిత్రాలు, వీడియోలు కలకలం రేపుతున్నాయి. సినీతారలు స్వయంగా ప్రమోట్ చేస్తున్నట్టుగా గ్యాంబ్లింగ్, మోసపూరిత యాప్‌ల యాడ్స్‌తోపాటు అభ్యంతరకర, అశ్లీల కంటెంట్ దాకా సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. కొన్ని రోజుల క్రితం సినీ నటి రష్మికను పోలినట్టుగా

మిగతా 10వ పేజీలో...



సిటీ బస్సుల్లో చార్జీల బాదుడు

- గ్రేటర్ హైదరాబాద్‌లో తిరిగే సిటీ బస్సుల టికెట్ల ధరలు పెంపు
- స్టేజీల వారీగా రూ.5 నుంచి రూ.10 మేర మోత
- ఆర్డినరీ, మెట్రో సహా అన్ని రకాల బస్సులకు వర్తింపు
- సిటీ ఆర్డినరీలో ఇకపై కనీస టికెట్ ధర రూ.15
- రేపటి నుంచి అమల్లోకి..

12



పాలే చంద్రశేఖర్ (ఫైల్)

అమెరికాలో కాల్పులు..

హైదరాబాద్ యువకుడి మృతి

- బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం డాలస్‌కు..
- 2 ఏళ్ల క్రితం వెళ్లిన చంద్రశేఖర్
- గ్యాస్ స్టేషన్‌లో పార్ట్ టైం జాబ్
- అక్కడ దుండగులు జరిపిన కాల్పుల్లో మృత్యువాత

10



11న మహబూబ్‌నగర్‌లో మెగా ఉద్యోగమేళా

ఇంటర్, ఐటీఐ, బీఎస్సీ, బీటెక్, ఫార్మసీ పట్టభద్రులకు అవకాశం

10

నటులు కులదైవాలా..!

ఏపీని పట్టిపీడిస్తున్న కులజాడ్యం వల్ల సమస్య కానిది కూడా సమస్యగా మారుతోంది. టీడీపీ సభ్యుడు నందమూరి బాలకృష్ణ నిండు సభలో ప్రవర్తించిన తీరును తప్పుపట్టాలి. బాలకృష్ణ శాసనసభకు ఎన్నికవడం ఇది మొదటిసారి కాదు. మూడో పర్యాయం. సభ మర్యాదల గురించి ఆయనకు తెలియదని అనుకోగలమా? చలువ కళ్లద్దాలను తలపైకి నెట్టి, రెండు జేబులలో చేతులు పెట్టుకొని ఆయన మాట్లాడటం సభా మర్యాదలను ఉల్లంఘించడమే! జగన్మోహన్ రెడ్డిని పరోక్షంగా సైకోగాడు అని వ్యాఖ్యానించారు. నిండు సభలో సహచర సభ్యుడిని సైకోగాడు అనడం కచ్చితంగా అభ్యంతరకరమే.



కొత్త పలుకు

సభా నాయకుడైన సీఎం చంద్రబాబు చొరవ తీసుకొని బాలకృష్ణను సరిదిద్ది ఉండవలసింది. ఇవేమీ జరగకపోగా చిరంజీవిని ఉద్దేశించి బాలకృష్ణ అవమానకరంగా మాట్లాడినట్టుగా ప్రచారం జరిగింది. ఇంకేముందీ, కులాల కుంపట్లు రాజుకున్నాయి. మెగాస్టార్ చిరంజీవికి మద్దతుగా ఆయన అభిమానులు, బాలకృష్ణకు మద్దతుగా ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయారు. కమ్మ-కాపు కులాల మధ్య కుంపట్లు రాజుకోవడంతో ఆ మంటల్లో చలి కాచుకొనే ప్రయత్నాన్ని వైసీపీ వాళ్లు చేశారు.

4

సీఎం కుర్చీకోసం 3 కులాల మధ్య మొదలైన ఆధిపత్య పోరు ఇప్పుడు మూడు కుటుంబాల మధ్య కేంద్రీకృతమైంది. మెజారిటీ రెడ్లు, క్రైస్తవులు, ఎక్కువమంది ముస్లింలు వైఎస్ వారసుడిగా జగన్‌ని మాత్రమే గుర్తించారు. కమ్మవారు చంద్రబాబు కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. కాపులు తమ సామాజిక వర్గానికి ఏకైక ప్రతినిధిగా కొణిదల కుటుంబాన్ని తలకెత్తుకున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నంత మాత్రాన సగటు కమ్మవారికి ఒరిగేదేమిటి? అలాగే జగన్ రెడ్డి సీఎం అయితే రెడ్లు అందరూ లాభపడరు కదా? పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అయితే కాపులలో పేదరికం అమాంతం పోదు కదా? ఈ మూడు కుటుంబాలకు చెందిన వారు ఇతర కులాల మద్దతు లేకుండా అధికారంలోకి రాగలరా? కడుపు నింపని కులం కోసం, ఈ మూడు కుటుంబాల కోసం కొట్టుకోవడాన్ని ఏమనాలి?

నటులను నటులుగానే గుర్తించి గౌరవించి అభిమానిస్తే ఏ తంటా ఉండదు. వారిని కుల దైవాలుగా ఆరాధించడం వల్లనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. నటులు కూడా తమను తాము దైవాంశ సంభూతులుగా భావిస్తున్నారు. ప్రజలలో వారికి ఉన్న క్రేజ్ నటులుగా మాత్రమే అని తెలుసుకోలేకపోతున్నారు. ఎక్కడకు వెళ్లినా జనం మూగుతుండటంతో రాజకీయంగా కూడా విజయం సాధించామన్న భ్రమల్లోకి వెళుతున్నారు. నటులు కూడా తమ పరిమితులు గుర్తించి ఏపీని పీడిస్తున్న కుల జాడ్యాన్ని రూపు మాపడానికి ప్రముఖ సినీ నటులు నడుం బిగిస్తే అప్పుడు వారిని రియల్ హీరోలుగా గుర్తించి సెల్యూట్ చేయవచ్చు.



దామోదర్‌రెడ్డి భౌతికకాయం వద్ద టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి తదితరులు

దామన్న అంత్యక్రియలు పూర్తి

» కన్నీటి వీడ్కోలు పలికిన నేతలు.. పాడె మోసిన పీసీసీ చీఫ్

» అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు సూర్యాపేట పట్టణం నుంచి దామన్న భౌతికకాయాన్ని తుంగతుర్తికి తరలించి ఆయన నివాసంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కడసారి నివాళులర్పించారు. దామోదర్‌రెడ్డి భౌతికకాయంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆ తర్వాత మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ హన్మంతరావు, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం తదితరులు దామన్న పాడెను మోశారు. అనంతరం దామోదర్ రెడ్డి అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించారు. సూర్యాపేట జిల్లా ఏఆర్ పోలీసులు 10 మంది ఒక్కొక్కరు 5 రౌండ్ల చొప్పున గాల్లోకి కాల్పులు జరిపారు. దామన్న కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఆస్తులు కరిగిపోయినా క్యాడర్‌ను కాపాడుకున్నారు

రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దామన్న చేసిన సేవలు ఎనలేనివన్నారు. తన ఆస్తులు కర్పూరంలా కరిగిపోయినా కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. దామన్న ఆశయాలు ముందుకు తీసుకుపోయేందుకు తోటి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి పనిచేస్తామని ఉత్తమ్ వివరించారు.

మందు పాతర అమర్చుతుండగా పేలుడు.. మహిళా మావోయిస్టుకు తీవ్ర గాయాలు

» ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ అడవుల్లో ఘటన

చర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు ఐఈడీ అమర్చుతుండగా అది ఒక్కసారిగా పేలి.. మహిళా మావోయిస్టు గుజ్జా సోది తీవ్రంగా గాయపడ్డ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ అడవుల్లో శనివారం మధ్యాహ్నం జరిగింది. మద్దేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బద్దెపార అడవుల్లో ఐఈడీ అమర్చేందుకు మావోయిస్టులు వచ్చారు. ఈ క్రమంలో మందు పాతరపై అనుకోకుండా ఒక మహిళా మావోయిస్టు కాలు వేయడంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ఘటన తర్వాత మిగిలిన మావోయిస్టులు ఆమెను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆమె కుడి కాలు పూర్తిగా తెగిపోగా.. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మద్దేడు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్న బలగాలు బీజాపూర్ వైద్యశాలకు తరలించారు. ఆమె కొంత కాలంగా మద్దేడు ఏరియా కమిటీ సభ్యురాలిగా పని చేస్తోందని పోలీసులు తెలిపారు.

భూ భారతికి కొత్త సవాళ్లు

వివాదాల పరిష్కారంలో సమస్యలు.. మితిమీరుతున్న రాజకీయ జోక్యం

» ఇతర బాధ్యతల్లో బిజీగా తహసీల్దార్లు

» సమయం లేదనే కారణంతో కాలయాపన

» సాంకేతికతపై అవగాహనలేక ఇబ్బందులు

» తగిన శిక్షణ ఇవ్వాలంటున్న నిపుణులు

» భూముల సర్వేతోనే 95% వివాదాలకు పరిష్కారం లభిస్తుందని సూచనలు

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలను పారదర్శకంగా పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టానికి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. రెవెన్యూ అధికారులకు అనేక ఇతర బాధ్యతలు ఉండడంతో.. ఈ పోర్టల్‌కు వచ్చే దరఖాస్తులను పరిష్కరించేంత సమయం వారికి ఉండడంలేదు. దీనికితోడు భూ వివాదాల్లో రాజకీయ జోక్యం ఉంటుండడంతో అధికారులు నిష్పక్షపాతంగా త్వరితగతిన తీర్పులు ఇచ్చే పరిస్థితులు లేవు. అంతేకాకుండా.. ఎక్కువ మంది అధికారులకు సాంకేతికతపై అవగాహన లేకపోవడం సమస్యగా మారింది. వీటన్నింటినీ అధిగమిస్తే తప్ప.. భూభారతి చట్టం ద్వారా ప్రజలకు న్యాయం జరిగే అవకాశాలు లేవు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి భూ రికార్డుల నిర్వహణ రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆర్ఎస్ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వ్యవస్థ తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. రైతులు తమ భూములు కోల్పోయి, కోర్టుల చుట్టూ, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ భూభారతి' చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా ధరణి లోపాలను సరిచేసి, భూ వివాదాలను సమర్థవంతంగా, పారదర్శకంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ఉంది. వాస్తవానికి భూభారతి చట్టం-2025 ప్రధాన లక్ష్యాల్లో మొదటిది.. ప్రతి అంగుళం భూమికీ చట్టపరమైన హక్కు కల్పించడం. రెండోది మ్యుటేషన్ ప్రక్రియ.. భూమి బదిలీ, వారసత్వ హక్కుల నమోదును సరళీకరించడం. మునుపటి వ్యవస్థల్లో ఈ ప్రక్రియకు వారాలు, నెలల కొద్దీ సమయం పట్టేది. ఇప్పుడు డిజిటల్‌గా వేగంగా పని జరుగుతోంది. అయితే సాంకేతికతపై చాలా మంది తహసీల్దార్లకు అవగాహన లేదనే విమర్శలున్నాయి. దీంతో భూభారతి ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు, రియల్-టైమ్ ట్రాకింగ్ సౌలభ్యాలను అందుబాటులోకి తెచ్చినా.. ప్రజలకు చేరువకావడం లేదు. దీనికితోడు ఎన్నికల నిర్వహణ, విపత్తుల నిర్వహణ, జనగణన, ప్రోటోకాల్ డ్యూటీలు, శాంతి భద్రతలు, పౌరసరఫరాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి కార్యక్రమాలతో రెవెన్యూ అధికారులు సతమతమవుతున్నారు. చాలా చోట్ల న్యాయపరమైన చిక్కులు ఉండటంతో ఇతరత్రా బిజీ పనులు ఉన్నాయనే సాకుతో భూ సమస్యలను తహసీల్దార్లు ముట్టుకోవడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి. దీనికితోడు రాజకీయ జోక్యం పెద్ద సమస్యగా మారింది. భూ వివాదాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, మండల స్థాయి నాయకులు జోక్యం చేసుకుంటారు. దీంతో రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా త్వరితగతిన తీర్పులు చెప్పే పరిస్థితులు లేవు. పైగా చట్టాల పట్ల రెవెన్యూ అధికారులకు అవగాహన కూడా అంతంతమాత్రమే. ఇదంతా ఒక ఎత్తయితే అవినీతి మరో పెద్ద సమస్య. 2020 చట్టం కింద జిల్లా ట్రిబ్యునళ్లు.. పార్టీలు చెప్పేది వినకుండా హడావిడిగా ఆర్డర్లు ఇచ్చి మరిన్ని వివాదాలు సృష్టించాయి. దీంతో జిల్లా స్థాయి అధికారులే అలా చేస్తే.. కిందివారి నుంచి ఏం ఆశించగలమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఉన్న అప్పీల్ వ్యవస్థ సంక్లిష్టంగా ఉందనే విమర్శలున్నాయి.



సర్వేయర్లను నియమిస్తేనే...

రైతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఇప్పటికే 10 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయి, వాటిలో 3.27 లక్షల ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి. దీనిని బట్టి ఈ వ్యవస్థపై ప్రజలు నమ్మకం పెంచుకుంటున్నారని అర్థమవుతుంది. కానీ, ఇది పూర్తిగా విజయవంతమవ్వాలంటే ఆచరణలో అనేక సమస్యలను అధిగమించాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 10,954 మంది గ్రామ పాలనాధికారుల (జీపీవోల)ను నియమించాలని నిర్ణయించి 5,106మందికి సెప్టెంబరు 5న నియామక పత్రాలు అందజేసింది. అంతేకాకుండా.. ప్రతి మండలంలో నాలుగు నుంచి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించడం ద్వారా భూవివాదాల పరిష్కారం వేగవంతమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే 95శాతం భూ వివాదాలు సర్వే లేకుండా పరిష్కారం కావు. భూమి సర్వే లేకుండా రికార్డులు మార్చడం అసాధ్యం. కానీ, ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థపై ఆధారపడుతూ గాలిలో దీపం పెట్టిన చందంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. భూమి సర్వేలు వేగంగా జరిగి.. వివాదాలు తగ్గాలన్నా ప్రభుత్వం రాష్ట్రంలోని 10,500 గ్రామాలకు ఒక్కొక్కరు చొప్పున సర్వేయర్‌ను గానీ, లేదా కనీసం రెండు గ్రామాలకు ఒకరిని గానీ నియమించాలని సర్వే విభాగానికి చెందిన మాజీ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు అభిప్రాయపడ్డారు. గ్రామపరిపాలన అధికారుల సంఖ్యను 5,250కి పరిమితం చేసి 5,250మంది విలేజ్ సర్వేయర్లను నియమిస్తే మంచిదని చెప్పారు. రీ సర్వే జరగాలని, కచ్చితమైన పటాలు అన్ని భూములకూ ఉండాలని పేర్కొన్నారు. దీంతోపాటు రాజకీయ జోక్యాన్ని నివారించాలని, రెవెన్యూ అధికారులకు సరైన శిక్షణ, తగినంత సమయం ఇవ్వాలని అన్నారు.



తిరుమలలో భారీ వర్షం

తిరుమల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వేకువజాము ఐదు నుంచి ఉదయం 8 గంటల వరకు వర్షం పడటంతో శ్రీవారి దర్శనానికి వెళ్లే వారితో పాటు దర్శనం చేసుకుని వెలుపలకు వచ్చిన వారు తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. మరోవైపు తిరుమలలో చలి పెరిగింది. పెరటాశి మాసం మూడో శనివారం కావడంతో తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. కాగా.. తిరుపతిలో వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ మోస్తరు వాన కురిసింది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పక్కనున్న రైల్వే అండర్ పాస్, అలాగే వెస్ట్ చర్చి సమీపంలోని రైల్వే అండర్ పాస్‌లు నీట మునిగి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మీపురం కూడలి నుంచి ఎయిర్ బైపాస్ రోడ్డు వరకూ రోడ్డు జలమయమైంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షాలు కురిశాయి. వెంకటగిరిలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా బాలాయపల్లి మండలం పాకూడి గ్రామంలో తాటిచెట్టు విరిగి విద్యుత్ లైన్లపై పడింది.

తెరపైకి రోజుకో కొత్త పేరు!

జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వం కోసం కాంగ్రెస్‌లో పెరుగుతున్న ఆశావహులు

బహుమతులు, దావత్‌లతో ప్రజలను ఆకట్టుకునే యత్నం.. పార్టీకి తలనొప్పిగా మారిన వైనం

బంజారాహిల్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సామూహిక సీమంతాలు... సామాజిక సేవా కార్యక్రమాలకు ఒకరు శ్రీకారం చుడితే.. మరొకరు బహుమతులతో మహిళలను ఆకట్టుకునే పనిలో ఉన్నారు. బస్తీ నిద్ర పేరిట ఓ నేత హడావుడి చేస్తుంటే.. సీఎం రేవంత్ టీమ్ పేరిట మరో నేత హంగామా సృష్టిస్తున్నారు. ఇక, దసరా నేపథ్యంలో దావత్‌లు, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు సరేసరి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న నేతలు ఎవరికి వారు తమ బలాన్ని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓ వైపు క్షేత్రస్థాయిలో ప్రజలను కలుస్తూ.. అగ్రనేతలకూ టచ్‌లో ఉంటున్నారు. తొలుత ఇద్దరు, ముగ్గురి పేర్లు తెరపైకి రాగా.. క్రమేణా ఆ సంఖ్య పది వరకు చేరడం ఆసక్తికరంగా మారింది.

గెలిచే సత్తా ఉందని...

ఉప ఎన్నిక అంశం తెరమీదకు వచ్చినప్పుడు కాంగ్రెస్‌లో అజారుద్దీన్, నవీన్‌యాదవ్ మధ్యే పోటీ ఉంది. అనూహ్యంగా అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో నవీన్‌కు మార్గం సుగమమైందని అందరూ భావించారు. ఆయన సైతం సామూహిక సీమంతాల పేరిట ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాలు ఆరంభించారు. ఇంతలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ పేరిట నియోజకవర్గంలో భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. మరోవైపు.. సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డ జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సైతం అభ్యర్థిత్వం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గణనీయ సంఖ్యలో ఓట్లు ఉన్న రెండు కులాల అండ తనకు ఉందని, అవకాశం ఇస్తే తప్పకుండా గెలుస్తానని పార్టీ నేతల వద్ద చెబుతున్నారు. అలాగే, మాజీ మంత్రి కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ కోడలు కంజర్ల విజయలక్ష్మి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్లూ వినిపిస్తున్నాయి. మాజీ కార్పొరేటర్ మురళీ గౌడ్ బస్తీ నిద్ర పేరిట ప్రజల వద్దకు వెళ్తుండగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కూడా అభ్యర్థిత్వం ఆశిస్తున్నారు. దసరా నేపథ్యంలో టీమ్ రేవంత్‌రెడ్డి పేరిట మైనంపల్లి హన్మంతరావు అనుచరులు నియోజకవర్గంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. మైనంపల్లికి టికెట్ పక్కా అంటూ ఆయన అనుచరులు ఊదరగొడుతున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం బీసీ కోటాలో బరిలో దిగేందుకు ప్రయత్నిస్తున్నారు. అనర్హత వేటు పడే అవకాశం ఉన్న దృష్ట్యా.. ఉప ఎన్నికలో అవకాశం కల్పిస్తే గెలిచి తీరుతానని చెబుతున్నారు.

హైదరాబాద్‌పై పట్టు సాధించాలని..

గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా హస్తం హవా కనిపించినా.. గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం ఎదురుగాలి వీచింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఇక్కడ విజయం సాధిస్తే.. హైదరాబాద్‌లో పార్టీకి పట్టు పెరుగుతుందన్న సంకేతాలు ఇవ్వడంతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికలకూ కలిసి వస్తుందని భావిస్తోంది. అదే సమయంలో బీఆర్ఎస్‌కు చెక్ పెట్టినట్టవుతుందని అంచనా వేస్తోంది. ఈ క్రమంలో గెలుపు గుర్రాన్ని బరిలో దించాలని భావిస్తోంది. అయితే, ఆశావహులు ఎక్కువగా ఉండడం, అభ్యర్థులు ఎవరికి వారు తానే అభ్యర్థినంటూ ప్రచారం చేసుకుంటుండడం పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది. ఆశావహులు పరస్పర విమర్శలు చేసుకోవడం, ఫ్లెక్సీలపై గొడవలు పెట్టుకోవడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసుకుంటుండడం.. పార్టీకి ప్రతికూలంగా మారుతుందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

ఏడేళ్ల బాలికను చంపిన మేనమామ, అత్త!

» చేతులు కట్టేసి, నోటికి ప్లాస్టర్ వేసి, దుప్పటీ అదిమిపట్టి హత్య.. మాదన్నపేటలో ఘోరం


సుమయ్య(ఫైల్)

సైదాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మేనకోడలిని తన భార్యతో కలిసి దారుణంగా హత్య చేశాడో వ్యక్తి! మాదన్నపేట పరిధిలో ఈ ఘటన వెలుగుచూసింది. డీసీపీ శ్రీకాంత్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్‌లో ఉంటున్న మహ్మద్ అజీం, షబానాబేగం భార్యాభర్తలు వీరికి కూతురు హుమేయని సుమయ్య(7) ఉంది. మాదన్నపేట చావునీలో షబానాబేగం అన్న మీర్ సమీ అలీ, అతడి భార్య యాస్మిన్ బేగం ఉంటున్నారు. షబానాకు అలీ కొంత డబ్బు బాకీ పడ్డాడు. ఆ డబ్బులు ఇవ్వాలని అలీపై షబానా ఒత్తిడి చేస్తోంది. గత ఏడాది నవంబరులో అలీ, యాస్మిన్ దంపతుల కుమార్తె(3) అనారోగ్యంతో మృతిచెందింది. సోదరి షబానా చేతబడి చేయడంతోనే తమ కుమార్తె చనిపోయిందని అలీ, యాస్మిన్ అనుమానించారు. మేనకోడలిని చంపి.. షబానాపై పగ తీర్చుకోవాలని నిర్ణయించారు. షబానా తన కూతురు సమ్మయ్యను వెంటబెట్టుకొని గత నెల 30న మాదన్నపేట చావునీలోని సోదరుడి ఇంటికి వచ్చి కూతురిని ఇంట్లోనే ఉంచి పనిమీద బయటకు వెళ్లింది. చిన్నారి ఇంట్లో ఒంటరిగా దొరకడంతో అలీ, యాస్మిన్.. ఆమెను ఆటలో భాగంగా అని చెబుతూ చేతులను వెనక్కి కట్టేసి.. నోటికి ప్లాస్టిక్ టేపు అతికించారు. అనంతరం దుప్పటితో ఊపిరాడకుండా చేసి చంపారు. బాలిక మృతదేహాన్ని ఇంటిపైన ఉన్న వాటర్ ట్యాంకులో పడేశారు. ఆ రోజు రాత్రి 7.20కి ఇంటికి వచ్చేసరికి కూతురు కనిపించకపోవడంతో షబానా ఆందోళనకు గురైంది. ఇంటి పరిసరాల్లో వెతికింది. అలీ, యాస్మిన్ కూడా చిన్నారి కోసం వెతుకుతున్నట్లుగా నటించారు. అదేరోజు షబానా కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా చిన్నారి ఇంట్లోంచి బయటకు వచ్చినట్లుగా ఎక్కడా కనిపించలేదు. బుధవారం సాయంత్రం ఇంట్లోనే తనిఖీలు చేపట్టారు. మొదటి అంతస్తులోని వాటర్ ట్యాంకులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. అలీ, యాస్మిన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

దూసుకెళ్లిన డీసీఎం.. తల్లీకుమార్తె మృతి

» సిద్దిపేట జిల్లా దేవక్కపల్లి శివారులో ఘటన


వీణారాణి, మనస్విని (ఫైల్)

బెజ్జంకి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ కోసం పుట్టింటికి వచ్చి.. తిరిగి వెళ్తుండగా డీసీఎం రూపంలో తల్లీకుమార్తెలను మృత్యువు కబళించింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లి శివారు రాజీవ్‌రహదారిపై శనివారం ఈ ఘటన జరిగింది. కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన శ్రీరామోజు సుమన్, వీణారాణి (39) దంపతులకు యశస్విని, మనస్విని(6) కుమార్తెలు. దసరా సందర్భంగా వీణారాణి తన తల్లిగారి ఊరైన సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వింజపల్లికి భర్త, ఇద్దరు కుమార్తెలతో కలిసి వచ్చింది. శనివారం వింజపల్లి నుంచి బొమ్మకల్‌కు తిరిగి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. మండలంలోని దేవక్కపల్లి స్టేజీ సమీపంలో రాజీవ్‌రహదారి పక్కన సీతాఫలాలు కొనుగోలు చేసేందుకు ఆగారు. ఈ క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ డీసీఎం వ్యాను ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. అంతటితో ఆగకుండా రోడ్డు పక్కన ఉన్న వీణారాణి కుటుంబంపైకి దూసుకెళ్లింది. దీనితో వీణారాణి, మనస్విని అక్కడికక్కడే మృతి చెందగా, సుమన్, యశస్వినికి తీవ్ర గాయాలయ్యాయి.

బైక్ దొంగపై పెట్రోల్ పోసి నిప్పు!

చేగుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పట్టుకున్న గ్రామస్థులు.. వారికి దేహశుద్ధి చేశారు. ఓ దొంగ జేబులో పెట్రోల్ బాటిల్‌ను గుర్తించి అది అతడిపైనే పోసి నిప్పంటించారు. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని చిన్నశంకరంపేట మండలం జంగారాయికి చెందిన బందెల మోహన్, ఎర్రోళ్ల షైపాల్ వడియారంలో బైక్‌లను చోరీ చేసి తీసుకెళ్తుండగా.. దుర్గాదేవి శోభాయాత్రలో ఉన్న గ్రామస్థులు చూసి పట్టుకున్నారు. దొంగలపై దాడికి పాల్పడ్డారు. బందెల మోహన్ జేబులో పెట్రోల్ బాటిల్ ఉండటంతో కొందరు దాన్ని తీసి అతడిపైనే పోసి నిప్పంటించారు. దీంతో మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి గాయపడిన మోహన్‌ను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. మరో నిందితుడు షైపాల్‌ను అరెస్టు చేశారు. గ్రామస్థులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రేమ, పెళ్లి పేరుతో కానిస్టేబుల్ మోసం!

» పురుగుల మందు తాగి దళిత యువతి బలవన్మరణం

» ఉద్యోగం నుంచి కానిస్టేబుల్ రఘునాథ్ గౌడ్ డిస్మిస్


ప్రియాంక (ఫైల్)

గద్వాల క్రైం/గట్టు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, పెళ్లి అంటూ ఆ కానిస్టేబుల్ నమ్మించి.. మోసం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన దళిత యువతి బలవన్మరణానికి పాల్పడింది. గద్వాల జిల్లాలో ఈ ఘటన జరిగింది. మృతురాలు ప్రియాంక(32) స్వస్థలం కొత్తగూడెం జిల్లా పాల్వంచ. రఘునాథ్ గౌడ్ అనే యువకుడిది గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లి. హైదరాబాద్‌లోని ఓ శిక్షణ కేంద్రంలో ప్రియాంక-రఘునాథ్ మధ్య పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని ప్రియాంకను నమ్మించి.. ఆమెతో సన్నిహితంగా గడిపాడు. కొన్నాళ్లకు రఘునాథ్‌కు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రియాంకతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో ఆమె జూలై 17న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు రఘునాథ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం రఘునాథ్ ఇంటికి వెళ్లిన ప్రియాంక అక్కడే ఉంటోంది. దీంతో రఘునాథ్ కుటుంబసభ్యులు నివాసాన్ని మల్దకల్‌కు మార్చారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రియాంక ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ మొగులయ్య, సీఐ శ్రీను ఆమెను 108లో ఆస్పత్రికి తరలించారు. ఆ రోజు సాయంత్రం వరకు చికిత్స పొందిన ఆమె ఆస్పత్రి నుంచి బయటకొచ్చి మల్దకల్‌లోని రఘునాథ్ గౌడ్ తల్లిదండ్రులు ఉన్న ఇంటికి వెళ్లి వారితో వాగ్వాదానికి దిగింది. చిన్నోనిపల్లికి వెళ్లాలని వారు సూచించారు. చిన్నోనిపల్లికి వెళ్లిన ప్రియాంక అక్కడ కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలుపుకొని తాగింది. సమాచారం అందడంతో డీఎస్పీ ఆమెను 108లో గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందింది. ఆమె మృతికి రఘునాథ్ గౌడ్, అతడి కుటుంబసభ్యులు 22 మంది కారణం అని మృతిరాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ప్రియాంక మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే రఘునాథ్‌గౌడ్‌ను సస్పెండ్ చేశామని, ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటనలో వెల్లడించారు.

భారత్‌కు రానున్న బ్రిటన్ ప్రధాని స్టార్మర్

» ఈ నెల 8, 9 తేదీల్లో భారత్‌లో పర్యటన

న్యూఢిల్లీ, అక్టోబరు4: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఈ నెల 8, 9 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు వస్తున్న ఆయన భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా ముంబైలో జరిగే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి పాల్గొని కీలక ప్రసంగం చేస్తారు. పలువురు పారిశ్రామిక దిగ్గజాలు, విధానకర్తలతో సమావేశమవుతారు. భారత్-యూకే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని రాబోయే పదేళ్లలో మరింత బలోపేతం చేసేందుకు విజన్ 2035 పేరిట చర్చిస్తారు.

ఆస్పత్రులపై రాజకీయాలు దారుణం

పురోగతి లేని 'టిమ్స్' భవనాల నిర్మాణం.. 1400 కోట్ల బకాయిలతో ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

» సిబ్బందికి జీతాల్లేక బస్తీ దవాఖానాల మూత

» కేసీఆర్‌ది ముందుచూపు.. కాంగ్రెస్‌ది మందబుద్ధి

» సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు విమర్శలు


ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హరీష్‌రావు, ఎమ్మెల్యేల బృందం

హైదరాబాద్/దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కరోనా తర్వాత కేసీఆర్ వందేళ్ల ముందుచూపుతో హైదరాబాద్ నాలుగువైపులా నాలుగు టిమ్స్ ఆస్పత్రులను నిర్మించాలని తలపెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ మీద ఉన్న కక్షతో ప్రజల ప్రాణాలను కాపాడే ఆస్పత్రులపై పగ పెంచుకోవడం దారుణమని మండిపడ్డారు. శనివారం హరీశ్‌రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కొత్తపేట టిమ్స్ ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలించారు. ఎల్బీనగర్ టిమ్స్‌లో సెల్లార్‌తో కలిపి 6 అంతస్తుల భవనాన్ని బీఆర్ఎస్ హయాంలో పూర్తిచేస్తే.. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 5 అంతస్తులను మాత్రమే పూర్తిచేసిందని హరీశ్ తెలిపారు. వరంగల్ హెల్త్ సిటీ పనులు కూడా ముందుకు సాగడంలేదన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే దురుద్దేశంతోనే ఆస్పత్రి నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ముందుచూపు లేని మందబుద్ధులని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలను రద్దు చేయడం దుర్మార్గన్నారు. కేసీఆర్ హయాంలో 450 బస్తీ దవాఖానాలను ప్రారంభించారని, ఆరు నెలలుగా వాటి వైద్యులకు, సిబ్బందికి జీతాలు చెల్లించకుండా రేవంత్ రెడ్డి వాటిని మూతపడేలా చేస్తున్నారన్నారు. రూ.1,400కోట్ల బకాయిలు పెట్టి ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు పేరొస్తుందనే అక్కసుతో కంటి వెలుగు పథకాన్ని నిలిపివేశారని, రాజకీయాలు పక్కనపెట్టి ఈ పథకాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వివేకానంద గౌడ్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ యాదిరెడ్డి, చింత ప్రభాకర్ పాల్గొన్నారు.

టిమ్స్ ఆస్పత్రి వద్ద హరీశ్ రావు 'షో' చేశారు

» ఉప ఎన్నిక రావడంతో హరీశ్, కేటీఆర్ కుప్పిగంతులు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): హరీశ్‌రావు విమర్శలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలు రావడంతో హరీశ్, కేటీఆర్ కుప్పిగంతులు వేస్తున్నారని, అయినా ప్రజలు వారిని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కొత్తపేట టిమ్స్ ఆస్పత్రి దగ్గర హరీశ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి 'షో' చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఎందుకు నిర్మించలేదో హరీశ్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అధికారం పోవడానికి ఏడాది ముందు టిమ్స్ ఆస్పత్రులకు టెండర్లు పిలిచారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించారని, దీంతో 90 శాతం నిర్మాణం పూర్తయిందన్నారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లను నిర్మిస్తున్నామని, విదేశాల నుంచి వైద్య పరికరాలు రావాల్సి ఉండటంతో ప్రారంభోత్సవానికి కొంత సమయం పడుతుందదన్నారు. పేరుకోసం ఆదరాబాదరాగా ఆస్పత్రులను ప్రారంభించాలనుకోవడం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలోఉన్నా.. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులను గాలికి వదిలేసిందని, ఉస్మానియా వరదల్లో మునిగిపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి గోషామహల్‌లో అత్యాధునిక సౌకర్యాలతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, కాంట్రాక్టు సంస్థ ఇప్పటికే నిర్మాణ పనులు మొదలుపెట్టిందని పేర్కొన్నారు. వరంగల్‌లో ఎంజీఎం ఆస్పత్రి నిర్మాణ పనులను రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారని, త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, సీఎంఆర్ఎఫ్ కింద కోట్లాది రూపాయల నిధులను పేదలకు ఇస్తున్నట్లు చెప్పారు.

లొంగిపోతే రెడ్‌కార్పెట్.. లేదంటే ఎన్‌కౌంటరే

» మావోయిస్టులతో చర్చలుండవు

» ఛత్తీస్‌గఢ్ పర్యటనలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా


మాట్లాడుతున్న అమిత్‌షా

చర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ లొంగిపోవాలని.. తుపాకీ వీడితే రెడ్ కార్పెట్ వేస్తామని, లేదంటే ఎన్‌కౌంటర్లు తప్పవని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్‌లో బస్తర్ దసరా లోకోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన ఓ సమావేశంలో అమిత్‌షా మాట్లాడారు. మావోయిస్టులు శాంతి చర్చలు అంటూ లేఖలు విడుదల చేస్తున్నారని.. ఇంకా మాట్లాడేందుకు ఏముందని ప్రశ్నించారు. జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. 2026 లక్ష్యంగా బలగాలు కదులుతున్నాయని వచ్చే మార్చి 31నాటికి దేశంలో మావోయిస్టులు అనేవారు ఉండరన్నారు. ఇంకా బస్తర్‌లో శాంతికి విఘాతం కలిగిస్తే భద్రతాదళాలు ఆయుధాలతో సమాధానం ఇస్తాయని హెచ్చరించారు. దంతేశ్వరి మాతకు కూడా మొక్కుకున్నానని, మావోయిస్టుల నుంచి బస్తర్‌ను విముక్తి చేసేందుకు బలగాలకు బలం చేకూర్చాలని కోరుకున్నానని తెలిపారు. కొంత కాలంగా ఢిల్లీలో చాలామంది నక్సలిజం పుట్టుక అభివృద్ధి కోసమేనని తప్పుడు ప్రచారం చేశారని, బస్తర్ మొత్తం అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. నేడు బస్తర్‌లో రోడ్లు, మొబైల్ టవర్లు, విద్య, వైద్యం కల్పించడంతోపాటు పేదలకు రూ.25 లక్షల వరకు బీమా, 5 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో రూ.4 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, వచ్చే మార్చి 31 తరువాత ఈ రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ఇక్కడ జరిగే దసరా పండుగ దేశంలో 75 రోజులు జరిగే అతిపెద్ద పండుగని అమిత్‌షా కొనియాడారు.

మొక్కజొన్న రైతు పరేషాన్

» జగిత్యాల జిల్లాలో మార్కెట్‌కు చేరుతున్న మక్కలు

» ఇంకా తెరుచుకోని మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు

» ఇదే అదనుగా క్వింటాకు రూ.400 వరకు ధర తగ్గిస్తున్న దళారులు

» కనీస మద్దతు ధర కూడా దక్కని వైనం


జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట శివారులో ఆరబోసిన మొక్కజొన్న(ఫైల్)

జగిత్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించిన తర్వాత చేతికొచ్చిన పంటను విక్రయించేందుకు మొక్కజొన్న రైతులు అవస్థలు పడుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. ప్రస్తుతం మక్కలకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400గా ఉంది. అయితే, మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో జగిత్యాల జిల్లాలోని వ్యాపారులు క్వింటాలుకు రూ.2,000 నుంచి రూ.2,100 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. తరుగు పేరిట క్వింటాలుకు నాలుగు కిలోల వరకు, క్యాష్ కటింగ్ పేరిట రెండు శాతం కోతలు పెడుతున్నారు. తూకాల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 6.09 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట వేశారు. జగిత్యాల జిల్లాలో 32,805 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు ఉండగా సుమారు 15.83 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, కథలాపూర్, మల్లాపూర్, మెట్‌పల్లి, మేడిపల్లి మండలాల్లో అధికంగా మొక్కజొన్న సాగవుతోంది. జిల్లాలో ఇప్పుడిప్పుడే మక్కలు మార్కెట్‌కు వస్తుండగా, వారం పది రోజుల్లో అధిక మొత్తంలో మార్కెట్‌కు చేరే అవకాశముంది.

ధరల కోత..

జగిత్యాల జిల్లాలో వారం, పది రోజుల క్రితం వరకు మొక్కజొన్న క్వింటాలు రూ.2,300 వరకు పలికింది. పంట చేతికొచ్చే తరుణంలో ప్రస్తుతం ధర పతనమవుతోంది. మార్క్‌ఫెడ్ కేంద్రాలు ప్రారంభం కాకపోవడం వల్లే వ్యాపారులు, దళారులు కలిసి ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర చెల్లిస్తున్నారని వాపోతున్నారు. ఇదే తీరు కొనసాగితే జిల్లాలోని మొక్కజొన్న రైతులు భారీగా నష్టపోయే ముప్పు ఉంది. ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ చేపట్టడంపై స్పష్టత రావడం లేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోవడంతో మార్క్‌ఫెడ్ కేంద్రాలను తెరిచే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుత సీజన్‌లో అధిక వర్షాలతో కష్టాల్లో ఉన్న రైతులకు ఈ పరిణామం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు జరిపించాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ విషయమై ఇటీవల పలువురు రైతులు జగిత్యాల అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ కూడా ఇచ్చారు. దీంతో ప్రభుత్వ స్పందన కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవాలి



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పండించిన మొక్కజొన్నను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కేంద్రాలు తెరవాలి. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. మార్కెట్‌లో దళారులు ధరలు తగ్గించడంతోపాటు క్యాష్ కటింగ్, తేమ పేరుతో ధర తగ్గింపు, తూకంలో హెచ్చుతగ్గులు వంటి అవకతవకలకు పాల్పడుతున్నారు.

-పన్నాల తిరుపతిరెడ్డి,
రైతు ఐక్య వేదిక నాయకుడు, జగిత్యాల జిల్లా

అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణానికి పాక్ ప్రయత్నాలు!

» అమెరికా ముందు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, అక్టోబరు 4: అరేబియా సముద్రంలో ఓ ఓడరేవును నిర్మించి.. నిర్వహించాలనే ప్రతిపాదనను పాకిస్థాన్ అమెరికా ముందుంచినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ ఓడరేవు ద్వారా పాస్నీలో లభించే కీలక ఖనిజాలను రవాణా చేయొచ్చని పాక్ యోచిస్తోంది. అఫ్గానిస్థాన్-ఇరాన్ సరిహద్దుల్లో ఉన్న బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో పాస్నీ ఓ ఓడరేవు పట్టణం.. అమెరికా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఇస్లామాబాద్‌తో వాషింగ్టన్ సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా సెప్టెంబరులో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ అగ్ర రాజ్యంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను శ్వేత సౌధంలో కలిసి చర్చలు జరిపారు. ఈ భేటీకి ముందే అరేబియా సముద్రంలో ఓడరేవు నిర్మాణ ప్రతిపాదనను మునీర్ సలహాదారులు అమెరికా అధికారుల ముందుంచినట్లు తెలిసింది. అయితే ఈ ఓడరేవును అమెరికా సైనిక స్థావరాల కోసం వాడుకోవడాన్ని మినహాయించాలని.. పశ్చిమ పాక్‌లోని ఖనిజాలు లభించే ప్రావిన్స్‌లకు టెర్మినల్‌ను అనుసంధానించే రైలు కారిడార్ అభివృద్ధికి నిధులు అందించాలని కోరినట్లు సమాచారం. కాగా, దీనిపై ఇప్పటివరకు ఇరు దేశాల అధికారులు స్పందించలేదు.


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న డా.భాస్కర్‌రావు, డా. బీరప్ప

సూది మందు నొప్పీ తెలియదు!

» పిల్లలకు క్యాన్యులా తేలిగ్గా పెట్టొచ్చు

» డయాలసిస్ బాధనూ అధిగమించొచ్చు

» గచ్చిబౌలి కిమ్స్‌లో ఎక్స్‌ఆర్ హెడ్‌సెట్‌ను ఆవిష్కరించిన సీఎండీ డా. భాస్కర్‌రావు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సూది మందు అంటే చాలామందికి భయం! చిన్నపిల్లల్లో కొందరైతే మరీనూ! ఇలాంటి పిల్లలకు క్యాన్యులా పెట్టడమూ సవాలే! ఇలాంటి వారి కోసమే అన్నట్టుగా వచ్చేసింది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎక్స్‌ఆర్ (ఎక్స్‌టెండెంట్ రియాలిటీ) హెడ్‌సెట్. ఇష్టమైన ప్రదేశాల్లో విహరిస్తున్నట్లు, నచ్చిన పనిని చేస్తున్నట్లుగా ఎక్స్‌ఆర్ హెడ్‌సెట్ ఓ కాల్పానిక లోకంలోకి తీసుకెళ్తుంది కాబట్టి ఇంజెక్షన్లు, క్యాన్యులా అంటే భయపడేవారికి, డయాలసిస్ రోగులకు ఎక్స్‌ఆర్ హెడ్‌సెట్ పెడితే ఆ నొప్పి తెలియదని నిపుణులు అంటున్నారు. ఈ సరికొత్త టెక్నాలజీని గచ్చిబౌలి కిమ్స్ ఆస్పత్రిలో శనివారం ఆ ఆస్పత్రుల ఛైర్మన్, ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ఆవిష్కరించారు. అనంతరం పెయిన్ స్కేప్- 2025 సదస్సులో కిమ్స్ ఆస్పత్రి అసోసియేట్ మెడికల్ డైరెక్టర్, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అంకిత ఆర్.చావ్లా, పెయిన్ మెడిసిన్ డాక్టర్ రణధీర్ అన్నారం మాట్లాడారు. క్యాన్సర్ చికిత్సలో కీమోథెరపీ వల్ల వచ్చే నొప్పి నివారణకు ఒక్కోసారి మార్ఫిన్ లాంటి మందులూ పెద్ద మోతాదులో ఇవ్వాల్సి వస్తుందని, ఈ హెడ్‌సెట్ వల్ల ఈ సవాళ్లను అధిగమించవచ్చని అంకిత ఆర్.చావ్లా చెప్పారు. కార్యక్రమానికి సీఈవో డాక్టర్ అభినయ్, మెడికల్ ఎడ్యుకేషన్, ఎకడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ మణిమాలా రావు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, న్యూఢిల్లీలోని సర్‌గంగారాం ఆస్పత్రి పెయిన్ రిలీఫ్ యూనిట్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్ జైన్, డాక్టర్ మురళీధర్ జోషి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

అక్రమ కంకర తవ్వకాలపై మళ్లీ నిర్ణయం తీసుకోండి

» గనులు, భూగర్భవనరుల శాఖకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు, రవాణా చేస్తున్నారని పేర్కొంటూ రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ పలు ప్రైవేటు సంస్థలు, క్వారీలకు జారీ చేసిన డిమాండ్ నోటీసులను హైకోర్టు ఇటీవల కొట్టేసింది. అక్రమంగా కంకర తవ్వకాలకు సంబంధించిన సర్వే, తనిఖీ నివేదికల కాపీలను సదరు సంస్థలకు ఇచ్చి వారు ఇచ్చే వివరణలను పరిశీలించి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయితే, కంకర తవ్వకాలు అక్రమమా? సక్రమమా ? అనేది నిర్ణయించాల్సింది గనుల శాఖనేనని స్పష్టం చేసింది. అనుమతులు లేకుండా, అక్రమంగా కంకర తవ్వకాలు, రవాణా సాగిస్తున్నారంటూ గనుల శాఖకు చెందిన ఆయా జిల్లాల అసిస్టెంట్ డైరెక్టర్లు పలు ప్రైవేటు సంస్థలు, రియల్‌ఎస్టేట్ కంపెనీలు, క్వారీలకు షోకాజ్ నోటీసులు, అనంతరం డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రాజపుష్ప అసెట్ మేనేజ్‌మెంట్ ఎల్ఎల్‌పీ, జీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ , అర్జున్ కన్‌స్ట్రక్షన్, వినాయక స్టోన్ క్రషర్, శ్రీనివాస స్టోన్ క్రషర్ తదితర సంస్థలు, క్వారీలు, వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టి పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

ట్యునీషియా అధ్యక్షుడిపై ఫేస్‌బుక్‌లో పోస్టులకు మరణశిక్ష విధింపు

» దేశ భద్రతకు ముప్పు అని కోర్టు తీర్పు

ట్యూనిస్, అక్టోబరు 4: ట్యునీషియా అధ్యక్షుడు కయస్ సయీద్‌కు వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టులు హానికరమైనవని, దేశ భద్రతకు ముప్పు కలిగించేవని పేర్కొంటూ ఓ 51 ఏళ్ల వ్యక్తికి న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. ప్రభుత్వాన్ని కూలదోయడం, అధ్యక్షుడిని అగౌరవపరచడం, ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం అన్న కారణాలతో మరణ శిక్ష విధించిందని శుక్రవారం ముద్దాయి తరపు న్యాయవాది తెలిపారు. అతడిని 2024 జనవరి నుంచి జైలులో ఉంచారని చెప్పారు. దొరికినప్పుడు పనిచేసుకునే దినసరి కూలీ అని, పని స్థలంలో ప్రమాదానికి గురికావడంతో అంగవైకల్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. తన బాధలను చెప్పుకోవడానికి పోస్టు పెట్టాడే తప్ప అశాంతిని రెచ్చగొట్టడానికి కాదని తెలిపారు. ఆయన విద్యార్హతలు చాలా తక్కువని, ఆన్‌లైన్‌లో ప్రభావితం చేసే స్థాయి కూడా కాదని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారాన్నే షేర్ చేశాడని, చాలా పోస్టులను ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఈ వాదనతో కోర్టు అంగీకరించలేదు. ప్రజల్లో తిరుగుబాటుకు ప్రయత్నించాడంటూ కఠిన శిక్ష వేసింది. ట్యునీషియా చట్టాల్లో మరణశిక్ష నిబంధన ఉన్నప్పటికీ చాలా అరుదుగా దీన్ని విధిస్తుంటారు. చివరిసారిగా 1991లో సీరియల్ కిల్లర్‌కు ఈ శిక్ష వేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

శాసనసభలో తాను సైకోగాడు అన్న జగన్మోహన్‌రెడ్డి ఒకప్పుడు కడప జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు అన్న విషయం బాలకృష్ణ మర్చిపోయారేమో తెలియదు. బాలకృష్ణ తన మానసిక పరిస్థితి సరిగా లేదని వైద్యుల నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్నారని విమర్శిస్తున్న వైసీపీ నాయకులు, ఒకప్పుడు అదే బాలకృష్ణ అభిమాన సంఘానికి తమ నాయకుడు జగన్ అధ్యక్షుడుగా ఉన్న విషయం తెలుసుకోవాలి కదా? అయితే ఒక విషయం మాత్రం వాస్తవం. కాల్పుల సంఘటనలో బాలకృష్ణను కాపాడింది మాత్రం నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డే. బాలకృష్ణ స్వయంగా కాల్పులు జరిపారని నాటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆర్పీసింగ్ విచారణ నివేదికను ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి అందజేయగా, 'వదిలేయండయ్యా – రాజకీయంగా కక్ష సాధించాలనుకోవడం లేదు. ఎంత కాదనుకున్నా అతను ఎన్టీఆర్ కుమారుడు' అని అప్పుడు పోలీసు అధికారుల వద్ద రాజశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటిలాగా అప్పుడు కులాల కుంపట్లు ఇంతలా లేవు కనుక రాజశేఖరరెడ్డి ఉదారంగా వ్యవహరించగలిగారు.

నటులు కులదైవాలా..!

ఇద్దరు సినిమా వాళ్ల మధ్య ఎప్పటి నుంచో ఉన్న వైషమ్యాల నేపథ్యంలో శాసనసభలో చోటుచేసుకున్న ఒక సంఘటన... ఆంధ్రప్రదేశ్‌లో మరో సమస్యే లేనట్టుగా అదే ప్రధాన సమస్యగా మారడమేమిటి? శాసనసభలో చోటుచేసుకున్న సంభాషణలను రికార్డుల నుంచి తొలగించినా అదే అంశాన్ని పట్టుకొని వేలాడటమేమిటి? హవ్వ.. నవ్విపోదురుగాక! ఈ ఎపిసోడ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిస్థితి చూస్తే జాలేస్తుంది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా ఆయన నలిగిపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని విడిగా చూడలేం. ఆంధ్రప్రదేశ్‌ను పట్టి పీడిస్తున్న కుల జాడ్యం వల్ల సమస్య కానిది కూడా సమస్యగా మారుతోంది. నిజానికి శాసనసభలో ఆ రోజు తెలుగుదేశం సభ్యుడు నందమూరి బాలకృష్ణ అన్న మాటలను కాదు – నిండు సభలో ఆయన ప్రవర్తించిన తీరును తప్పు పట్టాలి. బాలకృష్ణ శాసనసభకు ఎన్నికవడం ఇది మొదటిసారి కాదు. మూడో పర్యాయం. సభ మర్యాదల గురించి ఆయనకు తెలియదని అనుకోగలమా? చలువ కళ్లద్దాలను తలపైకి నెట్టి, రెండు జేబులలో చేతులు పెట్టుకొని ఆయన మాట్లాడటం సభా మర్యాదలను ఉల్లంఘించడమే! ఒకప్పుడు సభ్యుడు ఎవరైనా ఇలా ప్రవర్తించి ఉంటే సభాపతి తీవ్రంగా మందలించి ఉండేవారు. గతంలో సభ్యులు సభలో వార్తా పత్రికలు చదవడాన్ని కూడా సభాపతులు అనుమతించేవారు కాదు. ఇప్పుడా మర్యాదలు, సంప్రదాయాలు గాలికి పోయాయి. ఎన్టీఆర్ అంతటి వారు కూడా తను వాడిన మాటలకు సభలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. చివరకు శాసనసభను బహిష్కరించాల్సిన తీవ్ర నిర్ణయాన్ని అప్పుడు ఆయన తీసుకున్నారు. ఆ రోజు కాంగ్రెస్ సభ్యురాలు నన్నపనేని రాజకుమారి ఎన్టీఆర్‌ను విమర్శిస్తూ ఒక కాగితం చూపించారు. 1983లో తన పార్టీ తరఫున తొలిసారి నెగ్గి ఎమ్మెల్యే అయిన రాజకుమారి సభలో తనను విమర్శించడాన్ని జీర్ణించుకోలేని ఎన్టీఆర్ 'ఆ కాగితాన్ని మడిచి..' అని ఇంకేదో అన్నారు. అంతే, అధికార కాంగ్రెస్ సభ్యులు ఆయనపై విరుచుకుపడ్డారు. క్షమాపణలు చెప్పాలని కోరారు. దీంతో అహం దెబ్బతిన్న ఎన్టీఆర్ విసవిసా నడుచుకుంటూ సభాపతి స్థానం వద్దకు వెళ్లి తన భుజంపై ఉన్న కండువాను పోడియంపై పెట్టి తన స్థానం వద్దకు వెళ్లి, తనకు జరిగిన అవమానానికి నిరసనగా శాసనసభను బహిష్కరిస్తున్నానని ప్రకటించి సభ నుంచి వెళ్లిపోయారు. నిజానికి ఎన్టీఆర్ అంత తీవ్ర నిర్ణయం తీసుకుంటారని తెలుగుదేశం పార్టీ వారెవరికీ తెలియదు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఎన్టీఆర్ సభకు హాజరు కాకూడదని నిర్ణయించుకోవడంతో చంద్రబాబు నాయుడే ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించారు. ఇది గతం! సభలో పాటించవలసిన నియమాలు, సంప్రదాయాలకు అప్పట్లో అంత విలువ ఉండేది. కాలక్రమంలో సభాపతులు తమ పట్టు కోల్పోతూ వచ్చారు. ముఖ్యమంత్రుల కనుసన్నల్లో పనిచేయడానికి అలవాటుపడ్డారు. ఇప్పుడు అసలు విషయానికి వద్దాం!

ఏమిటీ వివాదం...

నందమూరి బాలకృష్ణ ఆ రోజు చిరంజీవిని ఏమన్నారో స్పష్టత లేదు. కానీ... మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత సభలో సభ్యుడైన జగన్మోహన్‌రెడ్డిని మాత్రం పరోక్షంగా సైకోగాడు అని బాలకృష్ణ వ్యాఖ్యానించారు. నిండు సభలో సహచర సభ్యుడిని సైకోగాడు అనడం, కళ్లజోడును తలపైకి నెట్టుకొని, జేబుల్లో చేతులు పెట్టుకొని మాట్లాడటం కచ్చితంగా అభ్యంతరకరమే. సభాపతి స్థానంలో ఉండిన ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు కూడా దీనిపై అభ్యంతరం చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. సభా నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు అయినా చొరవ తీసుకొని బాలకృష్ణను సరిదిద్ది ఉండవలసింది. ఇవేమీ జరగకపోగా చిరంజీవిని ఉద్దేశించి బాలకృష్ణ అవమానకరంగా మాట్లాడినట్టుగా ప్రచారం జరిగింది. ఇంకేముందీ, కులాల కుంపట్లు రాజుకున్నాయి. మెగాస్టార్ చిరంజీవికి మద్దతుగా ఆయన అభిమానులు, బాలకృష్ణకు మద్దతుగా ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయారు. చిరంజీవి తరఫున మాట్లాడిన కొందరైతే ఆయనను ఏమైనా అంటే చంపేస్తామని హెచ్చరించేదాకా ఆవేశపడిపోయారు. కమ్మ–కాపు కులాల మధ్య కుంపట్లు రాజుకోవడంతో ఆ మంటల్లో చలి కాచుకొనే ప్రయత్నాన్ని వైసీపీ వాళ్లు చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వంలోనూ, కూటమిలోనూ తాము ఆరాధించే పవన్ కల్యాణ్‌ది ప్రధాన పాత్ర అయినందున కాపులు ఆక్రోశపడ్డారు. ప్రతిగా కమ్మవాళ్లు కూడా స్పందించారు. ఈ రెండు కులాలనూ విడదీస్తే రాజకీయంగా లాభిస్తుందని భావించిన వైసీపీ నాయకులు తెర వెనుక నుంచి కాపులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సినిమా వేరు– రాజకీయం వేరు అన్నది మరుగున పడింది. ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలం నుంచి రాజకీయాలు, సినిమా కలగాపులగం అయ్యాయి. అదే సమయంలో అధికారం కోసం, ఆధిపత్యం కోసం మూడు కులాల మధ్య పోరాటం మొదలైంది. రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీపై రెడ్ల పార్టీగా ముద్రపడలేదు. కాకపోతే అధిక శాతం రెడ్లు ఆ పార్టీకి మద్దతు పలికేవారు. జగన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకున్న తర్వాత రెడ్లు ఆయనను సొంతం చేసుకున్నారు. అదే సమయంలో మెజారిటీ క్రైస్తవులు కూడా జగన్‌ను తమ సొంతం అనుకున్నారు. తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించిన నాటి నుంచి కమ్మ వాళ్లు ఆ పార్టీని తమ సొంత పార్టీగా భావించడం మొదలుపెట్టారు. పార్టీ నాయకత్వం చంద్రబాబు నాయుడి చేతుల్లోకి వచ్చిన తర్వాత ఆయన తనపై కుల ముద్ర పడకుండా జాగ్రత్త పడ్డారు. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని ప్రారంభించారు. అనుభవరాహిత్యంతోపాటు ఇతరత్రా కారణాల వల్ల రాజకీయంగా ఆయన విఫలమయ్యారు. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి క్రమంగా రాజకీయాలకు దూరం జరిగారు. కమ్మ, రెడ్లతో పోల్చితే సంఖ్యా బలం అధికంగా ఉన్న కాపులను ఈ పరిణామం నిరాశపరిచింది. తమ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడమేమిటి? అని మదనపడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ జనసేన పార్టీని ప్రారంభించారు. దీంతో కాపులలో మళ్లీ ఆశలు చిగురించాయి. పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలన్న కాంక్ష వారిలో మళ్లీ చిగురించింది. అయితే 2019 ఎన్నికల్లో సొంతంగా పోటీకి దిగిన జనసేన పార్టీకి కేవలం ఒక్క సీటే లభించింది. రెండు స్థానాల్లో పోటీ చేసిన పవన్ కల్యాణ్ సైతం రెండు చోట్లా ఓడిపోయారు. అయినా ఆయన నిరాశ చెందకుండా పార్టీని కొనసాగించారు. దురదృష్టవశాత్తు ఆయన అభిమానుల వ్యాఖ్యలు, ప్రవర్తన కారణంగా జనసేన అంటే కాపుల పార్టీగా ముద్రపడింది. అదే సమయంలో ముఖ్యమంత్రిగా ఉండిన జగన్మోహన్‌రెడ్డి కమ్మ కులస్తులను ద్వేషించడంతోపాటు ఆ కులానికి చెందిన ప్రముఖులను వేధించడంతో ఆ సామాజిక వర్గం వారంతా గంపగుత్తగా తెలుగుదేశం పార్టీకి జైకొట్టారు. తన బలం–బలహీనత గుర్తించిన పవన్ కల్యాణ్ తెలుగుదేశం పార్టీతో జతకట్టారు. చంద్రబాబుకు కూడా ఈ పొత్తు అనివార్యం అయింది. భారతీయ జనతా పార్టీ కూడా చేతులు కలపడంతో మూడు పార్టీలూ ఎన్డీయే కూటమిగా ఎన్నికలకు వెళ్లాయి. ఆ తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరస్పరం గౌరవించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఒకరకంగా వారిరువురికీ ఇది ఒక రాజకీయ అనివార్యత. ఈ తరుణంలో బాలకృష్ణ వ్యాఖ్యలు సరికొత్త వివాదాన్ని తెరమీదకు తెచ్చాయి. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి సినిమా పరిశ్రమలో కష్టపడి పైకి వచ్చిన చిరంజీవిని అవమానించారని పవన్ కల్యాణ్ సైతం ఎన్నో సందర్భాలలో అన్నారు. ఇప్పుడు ఏర్పడిన తాజా వివాదంతో.. 'ఆ రోజు ఏమీ జరగలేదు. జగన్‌రెడ్డి మమ్మల్ని బాగా చూసుకున్నారు' అని కొంత మంది జగన్ తరఫున వకల్తా పుచ్చుకొని మాట్లాడారు. అప్పట్లో జగన్‌రెడ్డి తన పట్ల అమర్యాదగా ప్రవర్తించి ఉండకపోతే కనీసం చిరంజీవి అయినా అప్పుడే స్పష్టం చేసి ఉండాల్సింది. అదేమీ జరగకపోవడంతో చిరంజీవికి అవమానం జరిగిందనే అందరూ భావించారు.

కుటుంబాలు... కులాల కుంపట్లు...

ఈ విషయం అలా ఉంచితే, ముఖ్యమంత్రి కుర్చీకోసం మూడు కులాల మధ్య మొదలైన ఆధిపత్య పోరు ఇప్పుడు మూడు కుటుంబాల మధ్య కేంద్రీకృతం అయింది. మెజారిటీ రెడ్లు, క్రైస్తవులు, ఎక్కువ మంది ముస్లింలు వైఎస్ రాజశేఖరరెడ్డి వారసుడిగా జగన్మోహన్‌రెడ్డిని మాత్రమే గుర్తించారు. రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిలను కూడా వారు ఆయన రాజకీయ వారసురాలిగా గుర్తించడం లేదు. ప్రతిగా కమ్మవారు నారా చంద్రబాబు కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. కాపులు తమ సామాజిక వర్గానికి ఏకైక ప్రతినిధిగా కొణిదల కుటుంబాన్ని తలకెత్తుకున్నారు. నిజానికి ఈ మూడు సామాజిక వర్గాలలో రాజకీయంగా ఎందరో ఉద్దండులు ఉండేవారు. ఉన్నారు కూడా! రెడ్లలో నాయకులకు కొదవ లేదు. అయినా జగన్‌రెడ్డి రంగప్రవేశంతో వారంతా ద్వితీయ శ్రేణి నాయకులుగానే ఉండిపోవాల్సిన పరిస్థితి. కాపుల విషయంలో కూడా ఇదే జరిగింది. నిజానికి కొణిదల కుటుంబంలో ఎవరికీ రాజకీయ అనుభవం లేదు. రాజకీయంగా మూడు నాలుగు దశాబ్దాల అనుభవం కలిగిన నాయకులు ఎందరో కాపుల్లో ఉన్నారు. అయితే చిరంజీవి కుటుంబ రంగప్రవేశంతో వారంతా వెనుకబడిపోయారు. కాపులు తమ నాయకుడిగా పవన్ కల్యాణ్‌ను మాత్రమే చూసుకోవడంతో చేసేదేమీ లేక ద్వితీయ స్థాయి నాయకులుగా ఉండిపోవడానికి వారంతా సిద్ధపడ్డారు. అధికారం కోసం ఈ మూడు కుటుంబాల మధ్య మొదలైన పోరు కులాల కుంపట్లను రాజేస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత మాత్రాన సగటు కమ్మవారికి ఒరిగేదేమిటి? అలాగే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే రెడ్లు అందరూ లాభపడరు కదా? పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అయితే కాపులలో పేదరికం అమాంతం పోదు కదా? ఈ విజ్ఞత లేకపోవడంతో ప్రతిదీ వివాదమవుతోంది. సామాజిక కోణంలో సమస్య అవుతోంది. విచిత్రం ఏమిటంటే, ఈ మూడు సామాజిక వర్గాలలో కులాంతర వివాహాలు జరుగుతుంటాయి. కాపులు రెడ్డి–కమ్మలను పెళ్లి చేసుకుంటున్నారు. కమ్మ వాళ్లు రెడ్డి–కాపులను చేసుకుంటున్నారు. రెడ్లు కూడా అంతే. వియ్యం అందుకోవడానికి లేని అభ్యంతరం కలసి మెలసి సాగిపోవడానికి ఎందుకో అర్థం కాని విషయం. ఈ మూడు కుటుంబాలకు చెందినవారు ఇతర కులాల మద్దతు లేకుండా అధికారంలోకి రాగలరా? కడుపు నింపని కులం కోసం, ఈ మూడు కుటుంబాల కోసం కొట్టుకోవడాన్ని ఏమనాలి?

అనవసరమైన వివాదం...

బాలకృష్ణకు సందర్భ శుద్ధి తక్కువని పలువురు అభిప్రాయ పడుతుంటారు. ఆయన ఎప్పుడు ఏం మాట్లాడతారో ఊహించడం కష్టం. ఆయన వ్యాఖ్యలు తన అభిమానులకు నచ్చవచ్చునుగానీ ఇతరులకు ఎందుకు నచ్చుతాయి? కూటమి నుంచి జన సేనానిని విడదీయాలని వైసీపీ ప్రయత్నిస్తున్న విషయం తెలిసి కూడా బాలకృష్ణ వివాదానికి తావిచ్చి ఉండవలసింది కాదు. చిరంజీవి అయినా, బాలకృష్ణ అయినా ప్రజలు వారిని అభిమానించేది సినిమా నటులుగానే. అంతకు మించి మహా నాయకులు అని కాదు. 2014 ఎన్నికల్లో చిరంజీవి స్వయంగా ప్రచారం చేసినా ఆయనను చూడ్డానికి ప్రజలు ఆసక్తి కూడా చూపలేదు. తెలుగుదేశం పార్టీ లేకుండా బాలకృష్ణ సైతం సొంతంగా పోటీ చేసి గెలవలేరు. ఇలాంటి పరిమితుల గురించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు బాగా తెలుసు. అందుకే వారు సంయమనం పాటిస్తున్నారు. చిరంజీవి అభిమానులు విమర్శలు చేస్తున్నప్పటికీ పవన్ కల్యాణ్ నోరు విప్పకపోవడానికి కారణం అదే కావొచ్చు. వంశాల గురించి, కుటుంబాల గురించి అభిమానులనేవారు మాట్లాడటం సమర్థనీయం కాదు. అభిమానులను ఉత్సాహపరిచేందుకు మాటల రచయితలు ఆయా నటులకు అనుగుణంగా కొన్ని డైలాగులు రాస్తుంటారు. అవే నిజమనుకుంటే ఎలా? ఎన్టీఆర్ కష్టపడి చిత్రసీమలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఎన్టీఆర్‌కు పూర్వం నందమూరి వంశం గురించి చెప్పమంటే ఏం చెప్పగలరు? అక్కినేని నాగేశ్వరరావు కూడా కష్టపడే సినిమా రంగంలో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకున్నారు. ఆయనకంటే ముందు అక్కినేని వంశం ఏమిటి? ఇక చిరంజీవి విషయానికి వస్తే, సినిమా రంగంలో కమ్మ సామాజిక వర్గం ఆధిపత్యం ఉన్న రోజుల్లోనే ఆయన నిలదొక్కుకున్నారు. కఠోర శ్రమకు అల్లు రామలింగయ్య కుటుంబ సహాయ సహకారాలు తోడవడంతో చిత్రపరిశ్రమలో ఆయన తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎన్టీఆర్, ఏఎన్ఆర్ పరమపదించిన తర్వాత, ముఖ్యంగా దాసరి నారాయణరావు మరణం తర్వాత చిరంజీవి సినిమా పరిశ్రమకు పెద్దగా ఎదిగారు. ఇదంతా ఆయన స్వయంకృషి అని చెప్పవచ్చు. అంతకు ముందు కొణిదల వంశం చరిత్ర ఏమిటి? చిరంజీవి పుణ్యమా అని ఆయన కుటుంబానికి చెందిన పలువురు సినిమా రంగంలో నిలదొక్కుకున్నారు. కేవలం తమ కులం వారి మద్దతుతోనే ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి గానీ మరొకరు గానీ ఆ స్థాయికి ఎదగరు. ప్రేక్షకులు వారిని అందరివారిగానే చూసి ఆదరించారు. అప్పట్లో లేని గొడవలు ఇప్పుడు ఎందుకు? సినిమా బాగా లేకపోతే కులపోళ్లు మాత్రమే సదరు సినిమాను ఆడించలేరు కదా? ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, బాలకృష్ణకు ఎన్ని ఫెయిల్యూర్స్ లేవు? పవన్ కల్యాణ్ సినిమాలు సైతం ఎన్ని ఫెయిల్ కాలేదు? ఇక్కడొక విషయం చెప్పుకోవాలి. శాసనసభలో తాను సైకోగాడు అన్న జగన్మోహన్‌రెడ్డి ఒకప్పుడు కడప జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు అన్న విషయం బాలకృష్ణ మర్చిపోయారేమో తెలియదు. బాలకృష్ణ తన మానసిక పరిస్థితి సరిగా లేదని వైద్యుల నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్నారని విమర్శిస్తున్న వైసీపీ నాయకులు, ఒకప్పుడు అదే బాలకృష్ణ అభిమాన సంఘానికి తమ నాయకుడు జగన్ అధ్యక్షుడుగా ఉన్న విషయం తెలుసుకోవాలి కదా? అయితే ఒక విషయం మాత్రం వాస్తవం. కాల్పుల సంఘటనలో బాలకృష్ణను కాపాడింది మాత్రం నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డే. బాలకృష్ణ స్వయంగా కాల్పులు జరిపారని నాటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆర్పీసింగ్ విచారణ నివేదికను ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి అందజేయగా, 'వదిలేయండయ్యా – రాజకీయంగా కక్ష సాధించాలనుకోవడం లేదు. ఎంత కాదనుకున్నా అతను ఎన్టీఆర్ కుమారుడు' అని అప్పుడు పోలీసు అధికారుల వద్ద రాజశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటిలాగా అప్పుడు కులాల కుంపట్లు ఇంతలా లేవు కనుక రాజశేఖరరెడ్డి ఉదారంగా వ్యవహరించగలిగారు. బాలకృష్ణను మాత్రమే కాదు– ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న మాజీ ఎంపీ కే.కేశవరావు కుమారుడు కాల్పులకు తెగబడిన సందర్భంలో కూడా రాజశేఖరరెడ్డే రక్షించారు. నేరం చేశారని తెలిసి కూడా వదిలేయడం మంచిదా? కాదా? అన్నది వేరే విషయం.

> **చట్టాలు మాత్రమే ప్రామాణికం... కులాలు కాదు. మహా అయితే రిజర్వేషన్లు పొందడం వరకే ఈ వెసులుబాట్లు. రిజర్వేషన్ ప్రకారం లబ్ధి పొందిన వారికి ఆ తర్వాత మినహాయింపులు ఉండవు. ఎవరికి వారు తమ మనోభావాలు దెబ్బతిన్నాయని యాగీ చేస్తే ఆ మాటున నేరస్తులు తప్పించుకోరా? అదే జరిగితే సమాజం మనోభావాల పరిస్థితి ఏమిటి?**



> **అన్ని విధాలా అధోగతి పాలైన రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అవసరానికి మించి కేంద్రం వద్ద వినయ విధేయతలు ప్రదర్శిస్తూ రాష్ట్రానికి మేలు చేసే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబుకు బాలకృష్ణ వంటి వారు అనవసర వివాదాలను తలకు చుడుతున్నారు. సొంత పార్టీ నాయకులతో పాటు కూటమికి చెందిన వారి వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను చల్లార్చేందుకు ఆయన ఫైర్ ఫైటర్ పాత్ర పోషించవలసి వస్తోంది. బాలకృష్ణ వల్ల తలెత్తిన వివాదం రాజుకోకుండా ఉండేందుకు జ్వరంతో బాధపడుతున్న పవన్ కల్యాణ్ ఇంటికి పరామర్శ పేరుతో చంద్రబాబు వెళ్లి గంటకు పైగా గడిపారని ప్రచారంలో ఉంది. కాగా, ఆయన చిరంజీవికి కూడా ఫోన్ చేసి సముదాయించి ఉంటారన్న ప్రచారం కూడా జరుగుతోంది. మాట తూలే ముందు సంయమనం పాటిస్తే బాలకృష్ణకే గౌరవం పెరుగుతుంది. శాసనసభలో ఏక వచనంతో ఎవరినీ సంబోధించకూడదు. అది తెలుసో లేదో తెలియదుగానీ బాలకృష్ణ 'వాడు వీడు' అన్న పదాలను వాడారు. ఇది తప్పు అని ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా స్పీకర్ అయ్యన్నపాత్రుడైనా బాలకృష్ణకు చెప్పాలి. నటుడిగా బాలకృష్ణ వ్యవహార శైలి వల్ల లాభమైనా నష్టమైనా ఆయన మాత్రమే అనుభవిస్తారు. శాసనసభ్యుడిగా ఉన్నంత కాలం నా ఇష్టం అంటే కుదరదు. సభా సంప్రదాయాలకు, విలువలకు ఆయన కట్టుబడి ఉండాల్సిందే.**

మారిన రాజకీయాలు...

రాజకీయాల్లో కక్ష సాధింపులు ఉండకూడదని అప్పట్లో అనుకొనేవారు. ఇప్పుడు కక్ష సాధింపు రాజకీయాలే ప్రథమ ప్రాధాన్యం అవుతున్నాయి. ఈ క్రమంలోనే కులతత్వం పెచ్చరిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇవాళ పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య ఈ కుల తత్వమే. ఇది ఎంత దూరం వెళుతోందంటే, తప్పు చేసినవాళ్లు తమ కులపోళ్లు అయితే చాలు, వారికి అండగా ఆయా కులాలు నిలబడుతున్నాయి. అలాంటప్పుడు చట్టాలు ఎందుకు? చట్టం దృష్టిలో ఏ కులం వారికి కూడా మినహాయింపు ఉండదు కదా? ఉండాలి అనుకోవడమే నేటి వింత ధోరణి. మంత్రి నారాయణ, ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి సంబంధించిన ఒక వార్తను ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. వారు ఇరువురూ కాపులు కనుక తమ కులం వారి మనోభావాలు దెబ్బతిన్నాయని ఆ కులానికి చెందిన కొందరు నాయకులు ప్రకటనలు జారీ చేశారు. ఇదే శ్రీలక్ష్మి వాడే విగ్గులు, కట్టుకొనే చీరల గురించి మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి అనేక విమర్శలు చేశారు. అప్పుడు కాపుల మనోభావాలు ఎందుకు గాయపడలేదో? శ్రీలక్ష్మి కాపు కులానికి చెందినవారు కాబట్టి ఆమెను ఐఏఎస్‌కు ఎంపిక చేయలేదు. ప్రతిభ ఆధారంగా ఆమె ఎంపికయ్యారు. తప్పొప్పులకు ఆమె చట్ట ప్రకారం బాధ్యత వహించాలి. అలాగే మంత్రి నారాయణ విషయమే తీసుకుందాం! నెల్లూరు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఆయన గెలుపొందారు. కాపులు మాత్రమే ఓటేసి నన్ను గెలిపించండి అని ఆయన ఎన్నికల సందర్భంగా కోరలేదు కదా? అన్ని వర్గాల వారు ఓటు వేస్తేనే కదా ఆయన ఎన్నికైంది! సామాజిక న్యాయం పాటించడం వేరు. కులాలను అడ్డుపెట్టి తప్పుచేసిన వారిని కాపాడాలనుకోవడం వేరు. సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఉండకూడదనే మన పెద్దలు రాజ్యాంగ పరంగా, చట్టపరంగా వెసులుబాటు కల్పించారు. ఈ వెసులుబాటు తప్పు చేసి తప్పించుకోవడానికి కాదు. కులాలను ముందు పెట్టి తప్పు చేసిన వారిని సమర్థించే ప్రయత్నం చేస్తున్నవారు ఈ వాస్తవాన్ని తెలుసుకోవాలి. చట్టాలు మాత్రమే ప్రామాణికం... కులాలు కాదు. మహా అయితే రిజర్వేషన్లు పొందడం వరకే ఈ వెసులుబాట్లు. రిజర్వేషన్ ప్రకారం లబ్ధి పొందిన వారికి ఆ తర్వాత మినహాయింపులు ఉండవు. ఎవరికి వారు తమ మనోభావాలు దెబ్బతిన్నాయని యాగీ చేస్తే ఆ మాటున నేరస్తులు తప్పించుకోరా? అదే జరిగితే సమాజం మనోభావాల పరిస్థితి ఏమిటి? చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి, పవన్ కల్యాణ్ – వీరిలో ఎవరైనా తమ కులం వారి ఓట్లతో మాత్రమే గెలిచి రాజకీయాలు చేయగలరా? ప్రజారాజ్యం స్థాపించిన చిరంజీవి 2009లో పాలకొల్లు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో పాలకొల్లులో ఉన్నంత సంఖ్యలో కాపులు మరే నియోజకవర్గంలోనూ లేరు. అయినా చిరంజీవి ఎందుకు ఓడిపోయారు? కులాల పేరు చెప్పి కొంత వరకు ప్రయోజనం పొందగలరు కానీ అంతిమ లక్ష్యం నెరవేర్చుకోలేరు. అన్ని వర్గాల మద్దతు చూరగొన్న వాళ్లే రాజకీయాలలో అయినా సినిమా రంగంలో అయినా సక్సెస్ అవుతారు.

ఆయనకు చెప్పాలి...

తాజా ఎపిసోడ్ చూస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్ల జాలి కలగక మానదు. అన్ని విధాలా అధోగతి పాలైన రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అవసరానికి మించి కేంద్రం వద్ద వినయ విధేయతలు ప్రదర్శిస్తూ రాష్ట్రానికి మేలు చేసే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబుకు బాలకృష్ణ వంటి వారు అనవసర వివాదాలను తలకు చుడుతున్నారు. సొంత పార్టీ నాయకులతో పాటు కూటమికి చెందిన వారి వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను చల్లార్చేందుకు ఆయన ఫైర్ ఫైటర్ పాత్ర పోషించవలసి వస్తోంది. బాలకృష్ణ వల్ల తలెత్తిన వివాదం రాజుకోకుండా ఉండేందుకు జ్వరంతో బాధపడుతున్న పవన్ కల్యాణ్ ఇంటికి పరామర్శ పేరుతో చంద్రబాబు వెళ్లి గంటకు పైగా గడిపారని ప్రచారంలో ఉంది. కాగా, ఆయన చిరంజీవికి కూడా ఫోన్ చేసి సముదాయించి ఉంటారన్న ప్రచారం కూడా జరుగుతోంది. మాట తూలే ముందు సంయమనం పాటిస్తే బాలకృష్ణకే గౌరవం పెరుగుతుంది. శాసనసభలో ఏక వచనంతో ఎవరినీ సంబోధించకూడదు. అది తెలుసో లేదో తెలియదు గానీ బాలకృష్ణ 'వాడు వీడు' అన్న పదాలను వాడారు. ఇది తప్పు అని ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా స్పీకర్ అయ్యన్నపాత్రుడైనా బాలకృష్ణకు చెప్పాలి. నటుడిగా బాలకృష్ణ వ్యవహార శైలి వల్ల లాభమైనా నష్టమైనా ఆయన మాత్రమే అనుభవిస్తారు. శాసనసభ్యుడిగా ఉన్నంత కాలం నా ఇష్టం అంటే కుదరదు. సభా సంప్రదాయాలకు, విలువలకు ఆయన కట్టుబడి ఉండాల్సిందే. అయినా గాలికి పోయే కంపను నెత్తిన వేసుకొనే వారికి ఏం చెబుతాం? ప్రజలే చూసుకుంటారు. నటులను నటులుగానే గుర్తించి గౌరవించి అభిమానిస్తే ఏ తంటా ఉండదు. వారిని కుల దైవాలుగా ఆరాధించడం వల్లనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. నటులు కూడా తమను తాము దైవాంశ సంభూతులుగా భావిస్తున్నారు. ప్రజలలో వారికి ఉన్న క్రేజ్ నటులుగా మాత్రమే అని తెలుసుకోలేకపోతున్నారు. ఎక్కడకు వెళ్లినా జనం మూగుతుండటంతో రాజకీయంగా కూడా విజయం సాధించామన్న భ్రమల్లోకి వెళుతున్నారు. అలా రాజకీయాల్లోకి వెళ్లినవారు తిరుగుటపాలా వెనుతిరగాల్సి వచ్చింది. సినీ నటులు ప్రచారం చేసినంత మాత్రాన ఎన్నికల్లో ప్రజల తీర్పుపై ఏ మాత్రం ప్రభావం ఉండదని పలు సందర్భాలలో రుజువైంది. కాబట్టి నటులు కూడా తమ పరిమితులు గుర్తించి కులాభిమానంతో హద్దు మీరే వారిని అదుపు చేస్తే సమాజానికి మేలు చేసినవారవుతారు. ఆంధ్రప్రదేశ్‌ను పీడిస్తున్న కుల జాడ్యాన్ని రూపుమాపడానికి ప్రముఖ సినీ నటులు నడుం బిగిస్తే అప్పుడు వారిని రియల్ హీరోలుగా గుర్తించి సెల్యూట్ చేయవచ్చు. కులం కూడు పెట్టదు అని ప్రచార ఉద్యమం చేపట్టడానికి నటులు ముందుకు రావాలని కోరుకుందాం!

వారెక్కడ.. వీరెక్కడ!?

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్), భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రెండు నెలల తేడాలో 1925లో ప్రారంభమయ్యాయి. ఒకటి సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ, రెండవది రాజకీయ పార్టీ. ఆ రెండూ ఈ సంవత్సరం శతసంవత్సరాలు పూర్తి చేసుకున్న వేళ 'వారెక్కడ, మనమెక్కడ' అనే మాట వామపక్ష భావజాలికుల నోటి వెంట వినిపిస్తున్నది. ఈ మాటను విజయవాడ నగరంలో సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో, విప్లవ రచయితల (విరసం) 29వ మహాసభలోనూ విన్నాను. రాజ్యాంగం మీద, ప్రజాస్వామ్యం మీద విశ్వాసం లేక, విప్లవ మార్గమే సరైనదని, ఆయుధ పోరాటాలే ప్రజా సమస్యలకు పరిష్కారం అని నినదించే వారంతా ఆ వేదిక మీద ఉన్నారు. చాలామంది ప్రసంగించారు కానీ, అందులో ఎక్కడా రాజ్యాంగబద్ధ పోరాటం చేద్దామన్న మాట లేదు.

'విరసం' నాకేమీ కొత్త కాదు. 20 ఏళ్ల క్రితం ఇదే వేదిక మీద వారు జరిపిన సమావేశంలోనూ నేను శ్రోతగా ఉన్నాను. నాటికీ నేటికీ వచ్చిన మార్పు–పడికట్టు పదాలు కొత్తవి వినిపించటమే. నాడు కాంగ్రెస్‌ని తిట్టిన నోర్లు నేడు బీజేపీని తిట్టాయి, నాడు ఇందిరను ఫాసిస్ట్ అన్న గొంతుకలు నేడు మోదీని అంటున్నాయి. అవన్నీ పక్కన పెడితే, కొందరు యువ నాయకులు చేసిన ప్రసంగాలు నన్ను ఆకట్టుకున్నాయి. రాంకీ అనే అతను "మనము, వారు 1925లోనే ప్రారంభమయ్యాం. కానీ ఇప్పుడు వారెక్కడ ఉన్నారు, మనమెక్కడ ఉన్నాం" అనే ప్రశ్న వేశాడు. అది కమ్యూనిస్టు, ఆరెస్సెస్‌లను పోల్చి వేసిన ప్రశ్న. ఆయన వేసిన మరో ప్రశ్న "మన భావజాలంతో మన ఇళ్లలోని వారినే ప్రభావితం చేయలేకపోతున్నాం. అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ వేళ ఇంటింటా దీపాలు వెలిగించమని ఆరెస్సెస్ పిలుపునిస్తే, మా ఇంటిలోనూ వెలిగించారు. వెలిగించవద్దు అంటే.. 'దీపాలు వెలిగిస్తే తప్పేమిటి? రోజూ వెలిగిస్తూనే ఉన్నాం కదా! ఈ రోజు కొంచెం ఎక్కువ దీపాలు వెలిగిస్తాం... అంతేకదా' అని మా ఆడవారి నుంచి ప్రశ్న వచ్చింది. మన దగ్గర సమాధానం ఉందా?" అన్నది ఆయన ప్రశ్న. తమ సాటి సభ్యుడు లేవనెత్తిన ప్రశ్న మీద ఆ సంస్థలో చర్చ జరిగిందని అనుకోలేం. పడికట్టు నినాదాలైన 'కార్పొరేట్ హిందుత్వ ఫాసిజాన్ని ఓడిద్దాం', 'ఆదివాసులపై హిందుత్వ ఫాసిస్టుల వైమానిక దాడులను ఖండిద్దాం' అనేవి మాత్రం ఎప్పటిలాగానే వినిపించారు. ఆ వేదిక మీద నర్మద అనే ఆమె విప్లవోద్యమంలో మహిళలను ఎలా ఉపయోగించుకుంటున్నదీ ఎత్తి చూపింది. మహిళలను అవమానపరుస్తున్నారు..మహిళలను ముందు నిలబెట్టి తమ రక్షణకు వాడుకుంటున్నారు అని ఆరోపించినా, ఆమె ప్రసంగాన్ని మధ్యలో ఆపించారే గాని, అటువంటిదేమీ జరగడం లేదని ఎవరూ అనలేదు.

కమ్యూనిస్టు పార్టీ పిడివాదం తమ తప్పులను అంగీకరించలేని స్థితికి చేర్చింది. ఎర్రజెండా ముఖ్య తప్పిదాలు అంటూ చరిత్రకారుడు రామచంద్ర గుహ, ది టెలిగ్రాఫ్ దినపత్రికలో (12–6–2004) ఒక వ్యాసం రాశాడు. అందులో ఆయన కేవలం ఆరు ముఖ్య తప్పిదాల గురించే ప్రస్తావించినప్పటికీ, అటువంటి తప్పులు అనేకం చేసినందునే ఎర్రజెండాకి ఆదరణ తగ్గింది.



ఒకప్పుడు కార్మికరంగాన్ని, విద్యార్థి రాజకీయాలను ఏలిన కమ్యూనిస్టులు ఇప్పుడు ఎక్కడ? ఆరెస్సెస్ స్థాపించిన కార్మిక సంఘం (బీఎంఎస్) ఇప్పుడు దేశంలో నెంబర్ వన్. ఒక్కొక్క విశ్వవిద్యాలయ ఎన్నికలను వరుసగా ఏబీవీపీ గెలుస్తున్న వార్తలు వస్తున్నాయి. చారిత్రక అంశాలు, మేథోవాదనల్లో ఒకనాడు తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన వామపక్షవాదులు, నేడు వెనుకంజ వేయక తప్పలేదు. ఆరెస్సెస్ పునాది మీద పుట్టిన బీజేపీ రాజకీయ విజయం తర్వాత మిగిలిన విజయాలు వస్తున్నాయని కమ్యూనిస్టులు సర్ది చెప్పుకోవటం సరికాదు. అన్ని రంగాలలో ఆరెస్సెస్ కమ్ముకుని వచ్చినందున బీజేపీకి రాజకీయ విజయం సాధ్యమైంది.

ఒక వార పత్రికలో నేను నిర్వహించే 'చివరి రోజుల్లో' శీర్షిక కోసం ప్రముఖుల వారసులను ఇంటర్వ్యూ చేసేవాడిని. ఆ వరసలో నేను కొన్ని సంవత్సరాల క్రితం చండ్ర రాజేశ్వరరావు కొడుకు ఆజాద్‌ని విజయవాడలోని వారి ఇంట్లో కలిసేవాడిని. తన తల్లిదండ్రులు ఇరువురూ చివరి రోజుల్లో మఖ్దూమ్ భవన్, హైదరాబాద్‌లో గడిపారని చెపుతూ, ఆ రోజుల్లో ఆయన రాసిన పుస్తకం అంటూ ఒక చిన్న నోట్‌బుక్ చూపించారు. అందులోని కొన్ని మాటలు కమ్యూనిస్టులకు చేరాయో లేదో నాకైతే తెలియదు. కానీ అవి వారికి తెలియాలి. అందులో ఒక వాక్యం "ఈ దేశ ప్రజలు ఎక్కువ మంది విశ్వసించే విషయాలను మనం కాదన్నాం, అందుకే ప్రజలు మనల్ని కాదన్నారు" అని ఉంది. ఆ విషయం మీద రాజేశ్వరరావు కొడుకుని వివరణ అడిగినప్పుడు కమ్యూనిస్టులు అనవసరంగా మతం కాదన్నారు, సంస్కృత భాషని వద్దన్నారు, వివేకానందుడిని, చివరికి నేతాజీ సుభాష్ చంద్రబోస్‌నీ తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన చివరి రోజుల్లో తలచుకున్నారని చెప్పారు.

'వారెక్కడ, మనమెక్కడ' అనే ప్రశ్నకు చండ్ర రాజేశ్వరరావు ఎంతో ముందుగానే సమాధానం రాసి ఉంచారు. కమ్యూనిస్టుల బలహీనత రోగానికి కారణాలు తెలిశాయి. కాని వాటికి తగిన ఔషధం అందుకునే ధైర్యం ఉందా?! ఆ పార్టీ పుట్టినప్పటి నుంచి ప్రతి దశాబ్దంలో ఒక పెద్ద తప్పు నిర్ణయం చేసుకుంటూ, చీలికలు పేలికలుగా జెండాను చింపుకుని, భుజాన మోస్తూ ఇంకా మమ్మల్ని ఆదరించండి అంటే... ఎవరు ఆదరిస్తారు?

▪ డా. దుగ్గరాజు శ్రీనివాసరావు



రామన్నపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మేయర్, కమిషనర్

తడి, పొడి చెత్తను వేరుగా అందించాలి

మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బందికి ప్రజలు తడి, పొడి చెత్తను వేరు వేరుగా అందించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటతో పాటు నగరంలోని పలు కాలనీల్లో కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. చెత్తను క్రమశిక్షణ లేకుండా ఎక్కడ పడితే అక్కడ పడేయడం వల్ల పారిశుధ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. చెత్త వాహనాలు ఇండ్ల వద్దకు వచ్చిన సమయంలో తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.



పత్తి రైతుకు గడ్డుకాలం

సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం

పత్తి విక్రయాల సీజన్ మొదలవుతోంది. గిట్టుబాటు ధరపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుందనే భరోసాతో ఉన్నారు. కానీ వాస్తవం వేరుగా ఉంది. గిట్టుబాటు ధర లేక కర్షకులు డీలా పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.8,110 మద్దతు ధర ప్రకటించినప్పటికీ సీసీఐ కొనుగోళ్లు లేకపోవటంతో దళారులకు వరంగా మారింది. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తున్న కొత్తపత్తికి క్వింటాల్‌కు రూ.3వేల నుంచి రూ.7వేలలోపే ధర పలుకుతోంది. తేమ, తాలు, బెండు తదితర వాటి పేరిట దళారులు పత్తి ధరకు కోత పెడుతున్నారు. అకాల వర్షాలతో చేతికి వచ్చిన పత్తిని ఇంట్లో, చేల్లో నిల్వ చేసుకుని పరిస్థితి లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. అక్టోబరు 1వ తేదీ నుంచే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుందని ప్రచారం జరిగినప్పటికీ జిన్నింగ్ మిల్లుల జాబ్‌వర్క్ టెండర్లలో పాల్గొనకపోవటంతో ఇప్పట్లో సీసీఐ కొనుగోళ్లు జరిగేనా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తం అవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పత్తి రైతుకు ధరల టెన్షన్ పట్టుకుంది. యూరియా కొరత, అకాల వర్షాలతో చిత్తైనా అన్నదాతకు గిట్టుబాటు ధర కన్నీళ్లు తెప్పిస్తోంది. ఎన్నిసార్లు నష్టపోయినా.. ఎన్ని అప్పులైనా ఎన్నో ఆత్మహత్యలు జరిగినా.. ఎందుకో రైతుకు పత్తి పంటపైనే మక్కువ. రాష్ట్రంలో అత్యధికంగా ఉమ్మడి జిల్లాలోనే రైతులు పత్తి సాగుచేస్తున్నారు. 2023-24లో ఉమ్మడి జిల్లాలో 5.13లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 2024-25లో 5,13,289 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఈసారి 2025-26లో కూడా 5,14,904 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. గత ఏడాది కంటే స్వల్పంగా పత్తిసాగు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరిగింది. వరుస నష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ రైతులు ఇతర వాణిజ్య పంటలకంటే పత్తి వైపే మొగ్గు చూపుతున్నారు. వరంగల్ జిల్లాలో 1,18,547 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. అలాగే హనుమకొండ జిల్లాలో 74,849 ఎకరాల్లో, మహబూబాబాద్ జిల్లాలో 82,639 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,20,016 ఎకరాల్లో, భూపాలపల్లి జిల్లాలో 98,260 ఎకరాల్లో, ములుగు జిల్లాలో అత్యల్పంగా కేవలం 20,593 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 5,14,904 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తుండగా, 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

- కొత్త నిబంధనలతో జాబ్‌వర్క్ టెండర్లకు దూరంగా జిన్నింగ్ మిల్లులు
- దళారులకు వరంగా మారిన కొత్త పత్తి కొనుగోళ్లు
- క్వింటాల్‌కు రూ.3వేల నుంచి రూ.7వేల వరకే ధర
- తేమ, తాలు, బెండు పేరుతో భారీగా ధరలకు దళారుల కోత
- వర్షాలకు నిల్వ చేసుకునే పరిస్థితి లేక తక్కువ ధరకు అమ్మకాలు
- కేంద్రం ప్రకటించిన రూ. 8,110 మద్దతు ధర ఎక్కడో...
- తెగని సీసీఐ, జిన్నింగ్ మిల్లుల నిబంధనల లొల్లి



సీసీఐ వర్సెస్ జిన్నింగ్ మిల్లర్లు

సీసీఐ కొత్త నిబంధనలు కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2022లో క్వింటాల్ పత్తికి రూ.14వేల ధర ఉండగా, అంతర్జాతీయ పరిణామాలతో పత్తి ధరలు భారీగా పడిపోయాయి. దీంతో రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కోసం సీసీఐపై ఆధారపడుతున్నారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లులను మార్కెటింగ్ శాఖ గుర్తించింది. వీటిలోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. 2023-24లో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా సీసీఐ ద్వారా 22,11,873.78 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, (మిగతా 7వ పేజీలో)



పెట్టుబడి వచ్చేలా లేదు..

రెండు నెలలుగా కురుస్తున్న అకాల వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. తెగుళ్లతో పత్తి పూత, కాత, ఆకులన్నీ రాలిపోతున్నాయి. ఎకరాకు రూ.50వేలకు పైగా పెట్టుబడి పెట్టినప్పటికీ 5క్వింటాల్ పత్తి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. దళారుల చేతిలో పత్తిని పెడితే కనీసం కూలీలకు ఇచ్చిన కూలీ డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం సీసీఐ ద్వారా రూ.8,110మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- ర్యాకం రవీందర్, రైతు చిట్యాల, భూపాలపల్లి జిల్లా



మేడారంలో చెట్లు తొలగిస్తున్న యంత్రం

మేడారంలో విస్తరణ పనులు షురూ

తాడ్వాయి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానం విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. యంత్ర సహాయంతో దేవస్థానం పరిసరాల్లో అడ్డు ఉన్న భారీ వృక్షాలను తొలగించారు. గద్దెల వద్ద ఉన్న క్యూలైన్లను పక్కకు తీశారు. దేవస్థానం విస్తరణలో భాగంగా ముందుగా చుట్టూ ప్రాకారం పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులకు తల్లుల దర్శనాలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అంటున్నారు.

సెప్టెంబరు 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం పర్యటించి దేవస్థాన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వంద రోజుల్లో పనులను పూర్తి చేయాలని అధికారులను సీఎం ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం సెప్టెంబరు 29నపూజారులు దేవస్థానంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. శనివారం అవి ప్రారంభమయ్యాయి.

'అగ్గి'పిడుగు

- వరిపంటను అతలాకుతలం చేస్తున్న తెగులు
- అధిక వర్షాలు, వాతావరణ మార్పులే కారణం
- సరైన సూచనలతో పురుగుమందులు వాడాలంటున్న అధికారులు
- తెగుళ్ల బెడదంతో అన్నదాతల ఆందోళన



అగ్గితెగులు సోకిన వరిసాగు



అగ్గితెగులు సోకిన వరిపై మందులను పిచికారి చేస్తున్న అన్నదాత

లింగాలఘణపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెగుళ్ల బెడద అన్నదాతను అష్టకష్టాలకు గురిచేస్తోంది. కోటి ఆశలతో సేద్యం చేసిన అన్నదాతకు చీడపీడలు ముప్పేట దాడి చేస్తున్నాయి. వరిపంటను అగ్గితెగులు ఆశించి అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల ఈ పరిస్థితి కనిపిస్తోంది. గడిచిన నెల రోజులుగా ఎడతెరిపిలేని వానలు, వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా వరిపంటకు అగ్గితెగులు సోకుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. దీంతో ఎరువుల దుకాణాలకు పరుగులు తీస్తూ మందులను పిచికారి చేస్తున్నారు. పంటలకు చీడపీడలు సోకిన వెంటనే రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించకుండా నేరుగా ఎరువులు, పురుగుమందుల వ్యాపారుల వద్దకు వెళ్లడం రివాజుగా మారింది. దీంతో పురుగుమందు వ్యాపారులు అవసరం లేని మందులను అంటగట్టి రైతుల నుంచి డబ్బులను దండుకుంటున్నారు. ఈ విషయంలో రైతులు అప్రమత్తమై తమ క్లస్టర్ పరిధి వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదిస్తే అవసరమైన మందులను అవసరమైన మోతాదుల్లో సిఫారసు చేయడం వీలవుతుంది. దీంతో రైతులు ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందుతారు.

అగ్గితెగులు..

వరుసగా కురిసిన వర్షాలతో పాటు వాతావరణంలో ఏర్పడ్డ మార్పులతో వరి పంటకు అగ్గితెగులు సోకడానికి కారణంగా మారుతోంది. తెగులు సోకిన పైరుపై ట్రైసైక్లోజోన్ 0.6 గ్రాము లేదా ఐసోప్రోథయోలిన్ 1.5ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు..

రైతులు తమ భూమిలో భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా సిఫారసు చేసిన ఎరువులను మాత్రమే వాడాలి. ఎకరాకు 50 నుంచి 60 కేజీల నత్రజని, 24 కేజీల భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. 16 నుంచి 20 కేజీల నత్రజనిని, 24 కేజీల భాస్వరం, 8 కేజీల పొటాష్‌నిచ్చే ఎరువులను ఆఖరి దమ్ములో వేసుకోవాలి. భాస్వరం ఎరువులను ఎట్టిపరిస్థితుల్లో కాంప్లెక్స్ రూపంలో వేయకూడదు.. అని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నీటి యాజమాన్యం..

వరిలో నీటి యాజమాన్యాన్ని సక్రమంగా చేపడితే పోషకాల వినియోగం ఎక్కువై కలుపు ఉధృతి తగ్గుతుంది. వరి నాట్లు వేసేటప్పుడు 1.2 సెం.మీ. వరకు నీరు పలుచగా ఉంచాలి. నాట్లు వేసిన తర్వాత నీటి మట్టాన్ని 5 సెం.మీ. వరకు పెట్టాలి. నాటు వేసిన పది రోజుల తర్వాత పైరు దుబ్బు చేయడం పూర్తయ్యే వరకు పొలంలో పలుచగా రెండు మూడు సెం.మీ. మాత్రమే ఉండాలి. నీటిని ఆదా చేసేందుకు ఆరుతడి విధానాన్ని అనుసరించాలి.. అని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

మోసాలతో పాలన సాగిస్తున్నారు..

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు
- అందుకే కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మోసాలతోనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో శనివారం కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టనప్పటికీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కల్యాణ లక్ష్మీ పథకం అందులో భాగమని, కానీ కాంగ్రెస్ తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. రైతు భరోసా నిధులు సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. మహిళలకు రూ.2500 అందిస్తామని మరిచిపోయారని, రుణమాఫీ పూర్తి చేయలేదని, వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు పింఛన్లు పెంచుతామని చెప్పి రెండేండ్లు దగ్గరకు వచ్చినా ఇప్పటి వరకు ఆచరణ చేయడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత మాటలను ప్రజలు ఇకపై నమ్మరని తెలిపారు. వీటన్నింటిపై ప్రజల వద్దకే కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే ఉన్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో గులాబీజెండా ఎగురుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సత్తా చాటాలని, కష్టపడి పనిచేస్తే ప్రతి ఒక్కరికి గుర్తింపు దక్కుతుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పట్ల మేధావులు, యువకులు, మహిళలు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. ప్రజాపాలన అంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి పుట్టగ తులుండవని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో రైతులు రాజులుగా తిరిగారని, ఇప్పుడు రోడ్ల పైకి రావాల్సి వస్తోందన్నారు. ఈ దుర్మార్గపు పాలనలో రైతులు అధికారుల కాళ్లు పట్టుకోవాల్సి వస్తోందన్నారు.



ఇల్లందలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎమ్మెల్యే దొంతికి మాతృవియోగం

నర్సంపేట/హనుమకొండ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నేత, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ(88) శనివారం సాయంత్రం కన్నుమూశారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని హనుమకొండలోని ఎమ్మెల్యే మాధవరెడ్డి నివాసానికి తరలించారు. చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌కు చెందిన కాంతమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, వారిలో మాధవరెడ్డి మొదటి కుమారుడు. కాంతమ్మ భర్త నర్సింహారెడ్డి 2011లో చనిపోయారు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఆదివారం మధ్యాహ్నం పద్మాక్షమ్మ గుట్ట సమీపంలోని శివముక్తిధామ్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, కాంతమ్మ మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే శనివారం రాత్రి మంత్రి సీతక్కతో పాటు పలువురు నాయకులు వచ్చి ఎమ్మెల్యేను పరామర్శించారు.



దొంతి కాంతమ్మ (ఫైల్)

పత్తి రైతులకు అండ

టోల్ ఫ్రీ, వాట్సాప్ నెంబర్ల ఏర్పాటు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సీసీఐకి పత్తిని విక్రయించేందుకు రైతులు కాపాస్ కిసాన్ స్లాట్ బుకింగ్ యాప్‌ను వాడుకోవాలని, మరేదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) ఉప్పుల శ్రీనివాస్ సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో పత్తి కొనుగోలు కోసం కొత్తగా తీసుకువచ్చిన కాఎస్ కిసాన్ స్లాట్ బుకింగ్ యాప్ వాడకం పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా జేడీ శ్రీనివాస్ హాజరై యాప్‌కు సంబంధించి వ్యవసాశాఖ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఇంకే ఏమైనాసందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 18005995779లో సంప్రదించాలని, లేదంటే 88972 81111 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, మార్కెట్ కార్యదర్శులు, ఎంఏవోలు, ఏఈఓలు, ఏఈవోలు పాల్గొన్నారు.



బొగత జలహోరు

ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాతం హోరెత్తుతోంది. ఒక వైపు వర్షం కురుస్తుండగా, మరోవైపు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ఉధృతితో శనివారం జలధారలు జోరందుకున్నాయి. వరుస సెలవులు కావడంతో పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భారీ వర్షంలోనూ జలపాతం అందాలను వీక్షించారు. ఈత కొలనులో జలకాలాడుతూ సందడి చేశారు.

-ఆంధ్రజ్యోతి, వాజేడు

జాతీయ స్థాయి పోటీలకు వరుణ్ ఎంపిక



వరుణ్‌ను అభినందిస్తున్న సుమాదేవి

హసన్‌పర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఎంశ్రీ జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థి పి.వరుణ్ జాతీయ స్థాయి టోర్నమెంట్స్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వరుణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించి మాట్లాడారు. సెప్టెంబరు 25, 26, 27 తేదీల్లో మహబూబాబాద్‌లో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి నవంబరు 1వ తేదీ వరకు శ్రీనగర్ జమ్మూకశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. అనంతరం పీఈటీ పార్థసారథితో పాటు పలువురు వరుణ్‌ను అభినందించారు.

హనుమకొండ వాసికి అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న షేక్ వలీ మక్సూద్

బాలసముద్రం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా వాసికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. హరియాణాలో నిర్వహించిన సీపా అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా హనుమకొండకు చెందిన షేక్ వలీ మక్సూద్ వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ అవార్డును అందుకున్నారు. హరియాణా అసెంబ్లీ స్పీకర్ హరివిందర్ కల్యాణ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. సీపా స్వచ్ఛంద సంస్థ ద్వారా రక్తదాన శిబిరాలు, ప్రకృతి పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ భారత్, జాతీయ సమైక్యత, మత సామరస్యం తదితర సామాజిక సేవలను అందించినందుకు షేక్ వలీ మక్సూద్‌కు అవార్డును ప్రదానం చేశారు. తనకు అవార్డు రావడానికి కృషి చేసిన సీపా స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కన్నె యాదరాజుకు షేక్ వలీ మక్సూద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు కార్యాచరణ రూపొందించండి

● విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
● అధికారులకు కలెక్టర్ సత్యశారద ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహిచాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి) కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సమస్యాత్మక, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి లైవ్ వెబ్ కాస్టింగ్, ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అధికారులు సమన్వయంతో రూట్ మ్యాప్‌లు రూపొందించాలని, రాజకీయ పార్టీల ప్రచారాలకు అవసరమైన అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని అన్నారు.

ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, నిబంధనల ఉల్లంఘనలపై నిఘా పెట్టి, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు, విధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ క్రాస్ వద్ద బస్సులకు పార్కింగ్ కల్పించాలి

ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి



ఉప్పల్ క్రాస్ రోడ్డు వద్ద ప్రయాణికుల పార్కింగ్ స్థలం పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, వరంగల్ ఆర్ఎం విజయభాను

హనుమకొండ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఉప్పల్ నుంచి వరంగల్ వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సుల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ సంస్థ ఎం.డి. వై.నాగిరెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ క్రాస్‌రోడ్డు వద్ద బస్సుల పార్కింగ్ స్థలాన్ని వరంగల్ ఆర్ఎం డి.విజయభానుతో కలిసి నాగిరెడ్డి పరిశీలించారు. ఉప్పల్ క్రాస్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలాలను, ప్రయాణికులకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆర్టీసీ ఎం.డీ. పలు సూచనలు చేసినట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. ప్రయాణికులు కూర్చోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆర్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్, ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న, చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ సదయ్య

కుటుంబ వ్యవస్థను కాపాడాలి

క్రైం ఏసీపీ సదయ్య

వరంగల్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మహిళ పోలీస్‌స్టేషన్ అధికారులకు, సిబ్బందికి క్రైం ఏసీపీ సదయ్య సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ మహిళ పోలీస్ స్టేషన్-1ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టుకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. గొడవలు పెట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చే దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారి మధ్య సఖ్యత కుదర్చడమే మహిళ పోలీస్‌స్టేషన్ లక్ష్యమని సూచించారు.

బాధితుడికి ఐ ఫోన్ అప్పగింత

వరంగల్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఐ ఫోన్‌ను బాధితుడు హరికిషన్‌కు శనివారం సీఐ శివకుమార్ అందజేశారు. ఈ ఏడాది జూన్‌లో ములుగు క్రాస్ రోడ్డులో హరికిషన్ ఐ ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నాడు. పోగొట్టుకున్న ఫోన్‌ను హనుమకొండ పోలీస్ స్టేషన్ ఐటీకోర్ టీం రఘుపతి ట్రేస్ చేసి సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో బాధితుడికి అందజేశారు.

అరిష్టం జరగవద్దనే జంతుబలి చేశాం

● ఆ ఘటనతో సీఐకి ఎలాంటి సంబంధం లేదు ● నర్సంపేట గ్రామ పెద్దల వెల్లడి



నర్సంపేట ఏసీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కుల సంఘాల నాయకులు

నర్సంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట పట్టణానికి అరిష్టం జరుగొద్దన్న ఉద్దేశంతో అన్ని కుల సంఘాల పెద్దలు బంతుబలి కార్యక్రమం నిర్వహించామని, ఈ ఘటనతో ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని వివిధ సంఘాలకు చెందిన నల్ల మనోహర్‌రెడ్డి, ఎర్ర యాకూబ్‌రెడ్డి, ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, పాలాయి రవి, పూజారి చిలువేరు కొమ్మాలు అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో కార్యాలయ ఉద్యోగికి, రెవెన్యూ డివిజనల్ కార్యాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో దసరా పండుగ వేడుకలు చేసే స్థలంలో వారం రోజుల కిందట గడి మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేశామన్నారు. గడి మైసమ్మ తిరుగువారం వేడుకతో పాటు దసరా పండగ, గాంధీ జయంతి కలిసి వచ్చాయన్నారు. దసరాతో పాటు గాంధీజయంతి ఒకే రోజు రావడం వల్ల జంతుబలి చేయవద్దని సీఐ చెప్పారని, అయితే స్థానిక కుల సంఘాల పెద్దలు పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తున్న ఆచారం, గ్రామ శ్రేయస్సు కోసం గడి మైసమ్మ విగ్రహం తిరుగువారం వేడుక జరుగనున్నందున పట్టణానికి అరిష్టం జరగకూడదన్న ఉద్దేశంతో జంతుబలి ఇచ్చామని వారు వివరించారు. ఈ ఘటనలో సీఐకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు బండి రమేశ్, దవడోవ రథన్‌కుమార్, బండి ప్రవీణ్, మేరుగు లక్ష్మణ్‌బాబు, కూనలమల్ల పృథ్వీరాజ్, పొదిల రాంచందర్, కొయ్యడి రాజేశ్, గూడూరు సందీప్, గద్ద శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వరంగల్ మహానగర్‌లోని కాజీపేట, భవాని నగర్, విశ్వవిద్యాలయ నగర్, హసన్‌పర్తి నగర్, హనుమకొండ నగర్, కాశిబుగ్గ నగర్, ఖిలానగర్, వరంగల్ నగరాలలో ఆదివారం ఉదయం రూట్ మార్చ్ (పథ సంచలన్) నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ మహానగర సంఘ చాలకుడు డాక్టర్ బందెల మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథ సంచలన్‌లో వేలాది మంది స్వయం సేవకులు పూర్తి గణవేశ (యూనిఫామ్)తో పాల్గొంటారన్నారు. ఈ రూట్‌మార్చ్‌లో ముందు వాహనంపై భరతమాత, డాక్టర్ జీ, గురూజీ చిత్రపటాలతోపాటు భగవద్ ధ్వజం అలంకరింపబడి ఉంటుందన్నారు. మధ్యలో ఘోష్ వాదకులు ఆనక్, వంశీ, పణవ, త్రిభుజ, జల్లరి, శంఖ, శృంగ వాయిద్యాలు వాయిస్తూ రూట్ మార్చ్‌లో పాల్గొంటారు. హిందూ సమాజంలో జాగృతిని కలిగిస్తూ స్ఫూర్తిని నింపడానికి శతజయంతి సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశ వ్యాప్తంగా ఈ రూట్‌మార్చ్‌లను నిర్వహిస్తుందని ఆయన తెలిపారు.

మునిసిపల్ ఎస్ఈగా సత్యనారాయణ బాధ్యతలు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగానికి ఇటీవల ఎస్ఈ పోస్టింగ్‌పై వచ్చిన సీహెచ్ సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌లను కలిశారు. వారికి పూలమొక్కలను అందించారు.

నరకాసుర వధ కార్యక్రమానికి రండి



మేయర్‌కు పూలమొక్కను అందిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా వరంగల్ నగరంలో జరుపుకునే నరకాసురవధ ఉత్సవాలకు రావాలని మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌లను ఉత్సవ కమిటీ నాయకులు కోరారు. శనివారం గ్రేటర్ వరంగల్

మేయర్, కమిషనర్‌కు ఉత్సవ కమిటీ ఆహ్వానం

నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మేయర్, కమిషనర్‌ను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్లి రవి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను ఇచ్చి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మరుపల్లి రవి మాట్లాడుతూ.. దీపావళి రోజున వరంగల్ కుడా ప్రాంగణంలో 58 అడుగుల భారీ నరకాసుర విగ్రహాన్ని దహనం చేయనున్నామన్నారు. కార్యక్రమానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. మేయర్, కమిషనర్‌ను కలిసిన వారిలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మరుపల్లి గౌతం, ఉపాధ్యక్షులు ఆవునూరి రామ్మూర్తి, దూడే బాలకొంరెల్లి, సహాయ కార్యదర్శులు వనం కుమార్, ఆవునూరి రామన్న, శెట్టిమోహన్, కోశాధికారి కొరె సాంబమూర్తి, సాంబమూర్తి, నర్సింహ, రాజు, ఐలేష్‌లు ఉన్నారు.

జంక్షన్ల నిర్వహణ పక్కాగా జరగాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

నగరంలో పలుచోట్ల జంక్షన్ల పరిశీలన



అలంకార్ జంక్షన్ వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో జంక్షన్ల నిర్వహణ పక్కాగా జరగాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శనివారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని అలంకార్, జవహర్‌కాలనీ, వడ్డెపల్లి, పాతిమానగర్ జంక్షన్‌ల వద్ద పూర్తిచేసిన అభివృద్ధి పనుల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జన సంచారం కలిగిన జంక్షన్‌లో పూర్తిచేసిన పనులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతీరోజు పరిశీలించాలన్నారు. శుభ్రత, విద్యుత్ దీపాల నిర్వహణ, మొక్కల సంరక్షణ వంటి అంశాలపై దృష్టిసారించాలన్నారు. కూడళ్ల సుందరీకరణ ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఆకర్షణీయంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రజలు నిత్యం చూస్తూ ఉండే కూడళ్లను సుందరీకరించేందుకు అధికారులతో పాటు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమలో జీడబ్ల్యూఎంసీ ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబుతో పాటు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి రద్దు

● బాధితులు కలెక్టరేట్‌కు రావొద్దు
● హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం రద్దు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి ఉండదని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత యథావిధిగా ప్రతీ సోమవారం ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దు అయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో ఎన్నికల సహాయక కేంద్రం ఏర్పాటు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సహాయక కేంద్రం 24 గంటల పాటు పనిచేస్తుందని తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సహాయక కేంద్రం ఫోన్ నంబర్ :7981975495లో సంప్రదించాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ తెలిపారు.

కాళేశ్వరాలయంలో సీసీఎఫ్ పూజలు

మహదేవపూర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ప్రముఖ దేవస్థానం కాళేశ్వరాలయాన్ని ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ (సీసీఎఫ్) బి.ప్రభాకర్ శనివారం సందర్శించారు. అర్చకులు ఆయన్ను పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీసీ ఎఫ్‌కు తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు.

'జడ్పీటీసీ' పోరుపై పార్టీల చూపు

● ఖానాపురం జడ్పీటీసీగా గెలిస్తే వరంగల్ జడ్పీ పీఠం దక్కే అవకాశం
● బలమైన అభ్యర్థుల వేటలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు



ఖానాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖానాపురం మండల వ్యాప్తంగా జడ్పీటీసీ ఎన్నికపై చర్చ జోరుగా సాగుతున్నది. ఎక్కడ నలుగురు కూడినా.. ఏ పార్టీ నుంచి ఎవరు పోటీలో ఉంటారనే చర్చ నడుస్తున్నది. అందుకు ప్రధాన కారణం వరంగల్ జడ్పీ చైర్మన్ స్థానం ఎస్టీ జనరల్ కావడమే. అదేవిధంగా ఖానాపురం జడ్పీటీసీ స్థానం కూడా ఎస్టీ జనరల్ కావడంతో ఇక్కడ గెలిచిన అభ్యర్థికే జడ్పీ చైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అందరిచూపు ఖానాపురం జడ్పీటీసీ స్థానంపైనే పడింది.

కాంగ్రెస్‌లో..

వరంగల్ జడ్పీ చైర్మన్ గిరిపై కన్నేసిన కాంగ్రెస్ పార్టీ.. ఖానాపురం జడ్పీటీసీ అభ్యర్థిగా బలమైన నేతను బరిలోకి దించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిసింది. స్థానికంగా ఉన్న మాజీ నేతతో పాటు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోటీలో దించాలని చూస్తున్నట్లు తెలిసింది. అలాగే పర్వతగిరి మండలానికి చెందిన నేతను కూడా జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దించాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్‌లో..

బీఆర్ఎస్ పార్టీ నుంచి జడ్పీటీసీగా పోటీ చేయడానికి పలువురు నాయకులు పోటీపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన పలువురు గిరిజన నాయకులు ఉన్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో జడ్పీటీసీకి పోటీ చేసే ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్ పేరు బలంగా వినిపిస్తున్నది. అదేవిధంగా కొందరు మాజీ సర్పంచ్‌ల పేర్లు సైతం ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీటితో పాటు ఓ బీజేపీ నేతను పార్టీలో చేర్చుకుని జడ్పీటీసీగా పోటీచేయించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గెలుపుపై ఆశలు

ఖానాపురం జడ్పీటీసీగా గెలుపుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అధికార పార్టీ కాంగ్రెస్‌కు అవకాశం ఉంటుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తమను గట్టెక్కిస్తాయని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ వచ్చినందున.. జడ్పీటీసీగా తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క బీఆర్ఎస్ నాయకులు గెలుపుపై పక్కా ధీమాతో ఉన్నారు. యూరియా కష్టాలు, ప్రభుత్వ వ్యతిరేకత తమను గెలిపిస్తాయని బలంగా నమ్ముతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఖానాపురం జడ్పీటీసీ ఎన్నిక మాత్రం రసవత్తరంగా నడిచే అవకాశం ఉంది.



రెక్కల విహారి.. పనిలో నేర్పరి..

- రోజురోజుకూ పెరుగుతున్న డ్రోన్ల వినియోగం
- ఎరువుల పిచికారీలో రైతులకు అండ..
- వేడుక ఏదైనా చిత్రీకరణలో మేటి
- క్రమంగా అన్ని రంగాలకు విస్తరణ

మామునూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అన్నీ తానై.. అన్నింటా తానై.. అన్నట్టుగా డ్రోన్ యంత్రాలు ప్రతీ పనిని సులువుగా చేసిపెడుతున్నాయి. అసాధ్యం అనుకున్న పనులను సుసాధ్యం చేస్తున్నాయి. ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతున్నాయి. డ్రోన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పంటల పర్యవేక్షణ, ఎరువులు, పురుగుమందుల పిచికారీ వంటి పనులన్నీ తక్కువ సమయంలో స్వల్ప ఖర్చుతో చేసి పెడుతున్నాయి. కూలీల కొరతకు పరిష్కరం చూపుతున్నాయి. అదేవిధంగా ఫొటోగ్రఫీ, నిఘా, సరుకు రవాణా, మైనింగ్, నిర్మాణ రంగం, జియోమ్యాపింగ్, రక్షణ, మౌలిక సదుపాయాల తనిఖీ వంటి అనేక రంగాలలో డ్రోన్ల వాడకం పెరిగిపోయింది. ప్రభుత్వం కుడా డ్రోన్ టెక్నాలజీని ప్రోత్సహిస్తోంది.

ప్రత్యేక డ్రోన్లు..

డ్రోన్ల అవసరాన్ని బట్టి రెక్కలు, సామర్థ్యం, రేంజ్, పవ ర్ స్సోర్స్ పరికరాలు ఒక్కో సైజులో ఉంటాయి. అరచేతిలో పట్టేం త దాదాపు 50 సెంటీమీటర్లనుంచి 2 మీటర్ల మధ్య ఉం డే చిన్న డ్రోన్లకు రెక్కలు ఫిక్స్‌డ్‌గా ఉంటాయి. వీటిని ఫొటో గ్రఫీ కి వినియోగిస్తారు. 2 మీటర్ల కంటే ఎక్కువ సైజు డ్రోన్లను పారిశ్రామిక అవసరాలకు, వ్యవసాయ రంగాలలో మందుల పిచికారీకి వినియోగిస్తున్నారు. వీటి ధర రూ.20 వేల నుంచి మొదలుకొని రూ.2 లక్షల వరకు ఉన్నాయి.

పెళ్లిళ్ల నుంచి..

సినిమా సన్నివేశాలు, పెళ్లిళ్ల నుంచి రాజకీయ పార్టీ సభలు సమావేశాల చిత్రీకరణకు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. వినియోగదారులకు ఇవి విజువల్స్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తున్నాయి. ప్రీ వెడ్డింగ్ షూట్‌లు, బర్త్‌డే పార్టీలకు వీటిని ఉపయోగించడం సాధారణమైపోయింది. ఒకప్పుడు నేలమీద, పెద్ద పెద్ద స్టాండ్‌లపై దృశ్యాలను కెమెరాలో బంధించే వారు. ఇందులో అనేక ప్రమాదాలు జరిగేవి. డ్రోన్ కెమెరా వచ్చాక ఈ సమస్యలు తగ్గాయి. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ విభాగాల్లో డ్రోన్లు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. డ్రోన్లకు కృత్రిమ మేధతోడైతే మన కళ్లముందు మరెన్నో అద్భుతాలను వీక్షించే అవకాశం లేకపోలేదు.



డ్రోన్లతో వ్యవసాయం

పంటపొలాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీకి ఎవరూ ముందుకురావడం లేదు. దీంతో రైతులు డ్రోన్ టెక్నాలజీని ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామూహికంగా డ్రోన్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పని భారంతో పాటు సమయం, ఖర్చు రెండూ కలిసివస్తున్నాయి. పైగా ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతున్నారు.

ఆపదలో ఆదుకుంటాయి..

అడవుల్లో అగ్ని ప్రమాదాలు, నదుల్లో ప్రమాద పరిస్థితులను పర్యవేక్షించడానికి, ఎత్తైన భవనాల్లో ప్రమాదం సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడానికి, వారికి ఆహార పదార్థలు, మందులు అందించడానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. అభివృద్ధి పనుల పర్యవేక్షణతో పాటు మారుమూల ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహారం అందించేందుకు సైతం వీటిని వినియోగిస్తున్నారు. ఆపద సమయంలో సుదూర గ్రామీణ ప్రాంతాలకు వాక్సీన్, మందులను వీటి ద్వారా సరఫరా చేస్తున్నారు. వర్ష ప్రభావం వల్ల పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఇలా ఒకటేమిటి ప్రతీచోటా, అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిపోయింది. నేడు మనిషి జీవితంలో డ్రోన్లు ఒక భాగమైపోయాయంటే అతిశయోక్తి కాదు.

కెనాల్‌లో కొండచిలువ



దూడ, గొర్రెను బంధించిన వైనం

దంతాలపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి, మండల కేంద్రంలో ఓ కొండచిలువ భయభ్రాంతులకు గురిచేసింది. స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్ శివారు దంతాలపల్లి-సూర్యాపేట ఆర్ అండ్ బీ రోడ్డు సమీపంలో డీబీఎం 60 కెనాల్‌లో కొండ చిలువ కనిపించింది. దూడతో పాటు గొర్రెపోతును చుట్టుకొని కొండ చిలువ మింగేస్తూ కనిపించడంతో స్థానికులు భయాందోళన చెందారు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ ఐనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదు. ఎవరు కూడా ఎస్సారెస్పీ కెనాల్‌లో ఈతకు, ఇతర పనులకు వెళ్లొద్దని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎరక్కపోయి దూరి.. ఇరుక్కొని..



బీరు బాటిల్‌లో తలదూర్చిన పాము

బీరు బాటిల్‌లో తలదూర్చిన పాము వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం తండాలోని ఎస్సారెస్పీ కాలువపై ఓ పాము తాగి పడేసిన బీరుబాటిల్ (టిన్ బీర్)లో తలదూర్చింది. బయటకు వచ్చేందుకు ప్రయత్నించినా రాకపోవడంతో చాలా సేపు తల్లడిల్లింది. అలాగే ముందుకు వెనక్కి వస్తూ తీవ్ర ఇబ్బందులకు గురైంది. శనివారం సాయంత్రం అటుగా గీత కార్మికుడు బండారి కుమారస్వామి వెళ్తుండగా ఈ ఘటన చూసి తన ఫోన్‌లో బంధించాడు. పామును బాటిల్‌లో నుంచి తీసేందుకు ప్రయత్నించినా, జేరుగొడ్డు పాము తోకతో కొడుతుందని భయపడి సాహసం చేయలేదన్నాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద ఘటన



ప్రమాదానికి కారణమైన కార్లు

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన మచ్చ రాకేశ్ అనే యువకుడు తన కారులో వరంగల్‌కు వెళ్తున్నాడు. అప్పటికే తన ముందు మరో కారు ప్రయాణిస్తోంది. దానిని ఓటెక్ చేసి వెళ్లేందుకు రాకేశ్ ప్రయత్నిస్తున్న తరుణంలో తన ముందు కారు ఒక్కసారిగా ఉప్పరపెల్లి గ్రామం వెళ్లేందుకు కారును మళ్లించాడు. దీంతో రాకేశ్ కారు ఢీకొని వాహనాలు ఒక్కసారిగా చుట్టూ చక్కర్లు కొడుతూ తిరిగాయి. అప్పటికే ఉప్పరపెల్లి గ్రామానికి చెందిన జిల్లా హైమ (38) వర్ధన్నపేటకు వెళ్లేందుకు రోడ్డు పక్కన ఆటో కోసం నిల్చుని ఉంది. కార్లు రెండు ఢీకొని వేగంగా పక్కకు రావడంతో రాకేశ్ నడుపుతున్న కారు హైమకు తగిలింది. ఎగిరి దూరంగా పడిన హైమ తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమె కుమార్తె జిల్లా శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు.



మృతి చెందిన జిల్లా హైమ (ఫైల్)

తలకొరివి పెట్టిన కూతురు..

రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన జిల్లా హైమ గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తోంది. భర్త శ్రీనివాస్ కొన్ని సంవత్సరాల కిందట మృతి చెందాడు. ఒక్కగానొక్క కూతురు శ్రీలతను చూసుకుని ఉంటోంది. శ్రీలతకు వివాహం కాగా, కుటుంబ సమస్యలతో తల్లి వద్దే ఉంది. తల్లి మరణంతో శ్రీలత మనోవేదనకు గురవుతోంది. తల్లికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు సైతం చేయడంతో స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

పత్తి రైతుకు గడ్డుకాలం

(5వ పేజీ తరువాయి)

2025-26లో 36,47,617.85క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. గత ఏడాది క్వింటాల్ పత్తికి రూ.7,521లు ఉండగా, ఈ సీజన్‌లో క్వింటాల్ పత్తికి కేంద్ర ప్రభుత్వం రూ.8,110లను ప్రకటించింది. దీంతో రైతులు సీసీఐ కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే జిన్నింగ్ మిల్లుల యాజమానులు, సీసీఐ మధ్య ఏర్పడిన విభేదాలు పత్తి కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మద్దతు ధరతో కొనుగోలు చేసిన పత్తి నుంచి గింజలు తీసి, బేళ్లుగా మార్చి సరఫరా చేయడానికి సీసీఐ టెండర్లు ఆహ్వానించింది. గత ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదు. రెండోసారి సెప్టెంబరు 28వ తేదీ వరకు టెండర్లకు గడువు ఇచ్చినప్పటికీ జిన్నింగ్, ప్రెస్సింగ్ టెండర్లకు కాటన్, జిన్నింగ్ మిల్లుల యాజమానులు దూరంగా ఉంటున్నారు. మార్క్‌ఫెడ్ మినహా ప్రైవేటు వ్యాపారులు టెండర్లు వేయకపోవటంతో సీసీఐ కొనుగోళ్ల ప్రశ్నార్థకంగా మారాయి. అక్టోబరు 1వ తేదీ నుంచే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందని ప్రచారం జరిగింది.

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సీసీఐ నింబంధనలు కఠినంగా ఉండటంతో తమ మిల్లులను సీసీఐకి అద్దెకు ఇవ్వొద్దని నిర్ణయించింది. ప్రధానంగా వంద కిలోల పత్తిలో ఏ నెల ఎంత దూది ఇవ్వాలనే నింబంధన ఉండేది. అయితే దీనిని గతంలో ఉన్న నెలవారి లెక్కలను కొత్త నిబంధనల ప్రకారం 15రోజులకోసారి ఇవ్వాలని పెట్టారు. అలాగే బేలు తయారు చేసే సమయంలో గతంలో లోటు (షార్టేజ్) 3.15శాతం నుంచి 1.90 శాతం ఉండగా, దాన్ని కొత్త నిబంధనలో 1.25శాతం నుంచి 0.75శాతానికి తగ్గించారు. మిల్లుల ఎల్-1, ఎల్-2 విధానాన్ని గతంలో రద్దు చేయగా, ఈసారి ప్రవేశపెడుతున్నారు. వీటితోపాటు నిబంధనలు, బేళ్ల ధర, జిన్నింగ్‌లో సౌకర్యాలు తదితర వాటిపై చర్చించాకు టెండర్లు పిలువాలని మిల్లుల యాజమానులు పేర్కొంటున్నారు. సీసీఐ నిబంధనలు బూచితో జిన్నింగ్ మిల్లుల యాజమానులు పేచీకి దిగుతుండటంతో పత్తి కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం

ఈ ఏడాది వర్షాలు మే మూడో వారంలోనే పడటంతో రైతులు ముందస్తుగా పత్తి సాగు చేశారు. రోహిణి కార్తేలో రోళ్ల పగిలే ఎండలు ఉంటాయంటారు. కానీ, ఏడాది రోహిణి కార్తెలో వర్షాలు కురియటంతో రైతు ముందస్తుగానే పత్తి విత్తనాలు విత్తారు. ఆ తరువాత ఎండలకు పత్తి మొలకలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. యూరియా కొరతతో పాటు వాన ముసుర్లు పంటలను దెబ్బతీశాయి. వేరు తెగుళ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తానికి తొలి పత్తి గత సెప్టెంబరు మూడో వారంలోనే చేతికి వచ్చింది. కానీ, కష్టాల పంటకు గిట్టుబాటు ధర వెక్కిరిస్తుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

అక్టోబరు 1వ తేదీ నుంచే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుందని ప్రచారం జరిగింది. అయితే జిన్నింగ్ మిల్లులు, సీసీఐ మధ్య ఏర్పడిన విభేదాలు రైతులు శాపంగా మారుతోంది. దీంతో చేతికి వస్తున్న పంటను నిల్వ చేసే పరిస్థితి లేదు. వరుసగా కురుస్తున్న వర్షాలకు పంటను ఇంట్లో, చేల్లలో నిల్వ చేయలేని పరిస్థితి. అంతేకాకుండా ముసురుతో పత్తిలో తేమ శాతం తగ్గటం లేదు. ఆర పెట్టేందుకు వాతవారణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో పాటు సీసీఐ కొనుగోళ్ల ప్రారంభించకపోవటంతో గత్యంతరం లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో తక్కువ ధరకు పత్తిని దళారుల చేతిలో పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.8,110ల మద్దతు ధరను ప్రకటించింది.

అయితే నిమ్ము, తేమ, తాలు, బెండ్లు తదితర కారణాలను చూపిస్తు క్వింటాల్ పత్తికి రూ.3వేల నుంచి గరిష్టంగా రూ.7వేల వరకే కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే పత్తిచేతికి వస్తుండటంతో రైతులు మార్కెట్‌కు తీసుకెళ్లిన దళారులదే రాజ్యం కావటంతో అడిగిన ధరకు పత్తిని విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మరోవైపు సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమానుల మధ్య ఎలాంటి చర్చలు జరగకపోవటంతో సమస్య పరిష్కారం అయ్యేదెప్పుడో.. సీసీఐ కొనుగోలు చేసేది ఎప్పుడో.. అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని, సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెప్మా రుణాలపై బ్యాంకర్లు కొత్త మెలిక

- రుణం తీసుకునే ప్రతీ మహిళకు ఉద్యమ్ ఆధార్ తప్పనిసరి
- కార్డు పొందడంలో ఇబ్బందులు పడుతున్న సభ్యులు
- పాన్, ఆధార్‌తో కచ్చితంగా అనుసంధానమై ఉండాలన్న నిబంధన
- ఉమ్మడి జిల్లాలో 4.5 లక్షల మంది సభ్యులు
- రూ.1233 కోట్ల మేరకు రుణ వితరణ ప్రతిపాదన



హనుమకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) లింకేజీ విషయంలో బ్యాంకర్లు కొత్త మెలిక పెట్టారు. రుణం తీసుకునే ప్రతీ మహిళ ఉద్యమ్ ఆధార్ తప్పనిసరిగా కలిగి ఉండాలని చెప్పడంతో వారంతా అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికిప్పుడు ఈ ప్రక్రియ అందరు పూర్తి చేయాలంటే సాధ్యమేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. సాధారణంగా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేవారు తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఉద్యమ్ ఆధార్‌ను తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుందని బ్యాంకర్లు చెబుతున్నారు. అయితే దీన్ని ప్రభుత్వ రుణంతో స్వయం ఉపాధి పొందే సంఘాలకు కూడా వర్తింపజేయడంతోనే చిక్కొచ్చి పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఉద్యమ్ ఆధార్ కార్డు తీసుకోవడం ఇబ్బందిగా మారింది. సంఘం తరఫున కనిష్ఠంగా రూ.లక్ష నుంచి అత్యధికంగా రూ.20 లక్షల వరకు రుణం తీసుకునే వారందరూ ఉద్యమ్ ఆధార్ ధ్రువపత్రం తీసుకోవాలన్న నిబంధన విధించడంతో వారంతా అయోమయంలో పడ్డారు.

ఉద్యమ్ ఆధార్ అంటే ?

ఇది మన దేశంలోని సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఒక ఉచిత, కాగిత రహిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ. ఈ రిజిస్ట్రేషన్ అనంతరం ఒక ప్రత్యేకమైన పన్నెండు అంకెల సంఖ్య లభిస్తుంది. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందడం ద్వారా వ్యాపారాలకు సంబంధించి తక్కువ వడ్డీకి రుణాలు, ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందుతాయి. 2020లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఇప్పటికిప్పుడు చేయించుకోవాలన్నా సుమారు 20 రోజులు పడుతుంది. రూ.1500 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. పాన్, ఆధార్ కార్డుల్లో పేర్లలో ఏ చిన్న తప్పు ఉన్నా మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇదంతా మెప్మా సభ్యులకు భారంగా, కష్టతరంగా మారింది. దీంతో రుణాలను తీసుకునే అవకాశం లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందేమిటంటే ?

ఉద్యమ్ ఆధార్ తీసుకోవాలంటే పాన్‌కార్డుతో పాటు ఆధార్ కార్డు కూడా కలిగి ఉండాలి. పాన్, ఆధార్‌తో కచ్చితంగా అనుసంధానమై ఉండాలి. రుణం తీసుకునేవారు ఏదో ఒక వ్యాపారం నడుపుతున్నట్టుగా ట్రేడ్ లైసెన్సు లాంటి డాక్యుమెంట్లను తీసుకోవాలి. ఇవన్నీ ఉంటేనే ఉద్యమ్ ఆధార్ పత్రాన్ని తీసుకునేందుకు అవకాశముంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలామంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పాన్ కార్డు ఉన్నప్పటికీ ఆధార్‌తో అనుసంధానం కాలేదు.



ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం

ఉద్యమ్ ఆధార్ నమోదు ఇలా..

మొదట అధికారిక ప్రభుత్వ ఉద్యోగం రిజిస్ట్రేషన్ పోర్టల్ https://udyamregistration.gov.in/లోకి వెళ్లాలి. ఎంఎస్ఎంగా ఇంకా నమోదు చేసుకోని కొత్త వ్యవస్థాపకులు లేదా ఈఎం-2 ఉన్నవారి కోసం అనే దానిపై క్లిక్ చేయాలి. ఆధార్ కార్డులో ఉన్న విధంగా ఆధార్ నెంబర్, వ్యవస్థాపకుడి పేరును నమోదు చేయాలి. తర్వాత వాలిడేట్ అండ్ జనరేట్ ఓటీపీపై క్లిక్ చేయాలి. ధ్రువీకరించిన తర్వాత సంస్థ గురించి అవసరమైన సమాచారాన్ని నమోదు చేయాలి. బ్యాంకు ఖాతా నెంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో సహా సంస్థ బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేయాలి. సంస్థ ప్రధాన వ్యాపార కార్యకలాపాల వివరాలను దాని ఎన్ఐసీ కోడ్‌తో సహా నమోదు అందించాలి. సబ్మిట్‌పై క్లిక్ చేసే ముందు నమోదు చేసిన సమాచారం కచ్చితమైనదని, పూర్తిగా ఉందని నిర్ధారించుకోవాలి. జనరేట్ అయిన ఉద్యోగుల రిజిస్ట్రేషన్ (యూఆర్ఎన్) కోసం రిజిస్టర్డ్ ఈ-మెయిల్ చిరునామా, మొబైల్ నెంబర్‌ను తనఖీ చేయాలి. యూఆర్ఎన్‌ను ఉపయోగించి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ నుంచి ఈ-సర్టిఫికెట్ లేదా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

రూ.1233 కోట్ల రుణాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు వీలుగా మెప్మా సభ్యులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1233.84 కోట్ల రుణాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 45,000 మెప్మా సంఘాలు ఉన్నాయి. వీటిలో బ్యాంక్ లింకేజీ ద్వారా అర్హత కలిగిన 7,500 సంఘాలకు ఈ రుణాలను అందజేస్తారు. 42 దివ్యాంగ సభ్యుల సంఘాలు రూ.1.38 కోట్లు, 60 వీధి వ్యాపార సంఘాలకు రూ.1.68కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణాలు తీసుకునే ప్రతీ సభ్యురాలు ఉద్యమ్ ఆధార్ ధ్రువీకరణ పత్రాన్ని కచ్చితంగా పొంది ఉండాలి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 4.50 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరంతా ఉద్యమ్ ఆధార్ పత్రాలను పొందాల్సి ఉంది. ఇంత మంది ఈ పత్రాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సీవోలు, ఆర్పీలు సహాయం చేస్తున్నారు..

రజిత, మెప్మా డీఎంసీ, హనుమకొండ జిల్లా

స్వయం సహాయక సంఘాల సంఘాల్లోని ప్రతీ మహిళ ఉద్యమ్ ఆధార్ కలిగి ఉండడం తప్పనిసరి చేశారు. హనుమకొండ జిల్లాలో సుమారు 5,500 సంఘాలు, 75వేల మంది ఉన్నారు. వీరిలో చాలా మంది ఇప్పటికే ఉద్యమ్ ఆధార్ ధ్రువపత్రాన్ని పొందారు. ఉద్యమ్ ఆధార్ పొందడంతో సభ్యులకు సీవోలు, ఆర్పీఎస్‌లు సహాయం అందిస్తున్నారు. వీరికి శిక్షణ కూడా ఇచ్చాం. కొంచెం ఇబ్బంది అయినా ఉద్యమ్ ఆధార్ పొందడం వల్ల సభ్యులకే లాభం. మెప్మా రుణాలను సులభంగా పొందవచ్చు.

ఆశావహుల్లో జంపింగ్‌లు ఎక్కువ

- తారుమారైన రిజర్వేషన్లు
- ప్రజాసేవ తక్కువ.. సంపాదనపై మక్కువ
- టికెట్ల కోసం పెద్ద సారు చుట్టూ ప్రదక్షిణ

పరకాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా టికెట్లు ఆశించే వారిలో ఇతర పార్టీల నుంచి అధికార పార్టీలోకి వచ్చిన వారే ఎక్కువగా ఉన్నారు. పాత వారిని పక్కన బెట్టి తమకే టికెట్ కావాలంటూ ప్రయత్నాలు సాగిస్తున్నారు. పార్టీ అభివృద్ధి కోసం పైసా ఖర్చు పెట్టకుండా, ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించని వారు తమకు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌తో పాటు పరకాల మునిసిపల్ పరిధిలో రాబోయే కౌన్సిలర్ ఎన్నికలకు కూడా టికెట్లు కావాలని తిరుగుతున్నారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీతో లబ్ధి పొందిన వారు సైతం నేడు అధికారంలో ఉన్న పార్టీలో చేరి ఎంతో కొంత సంపాదించుకోవాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీని పట్టుకొని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసి ఎన్నో సాధకబాధకాలకు ఓర్చిన వారు ప్రస్తుతం పక్కకు జరుగుతున్నారు. తమకు అనుకున్న న్యాయం జరగడం లేదని ఆలోచన చేసి ఎవరికి టికెట్ ఇవ్వాలి.. ఇవ్వకూడదో తప్పనిసరిగా అధిష్ఠానం ఆలోచించాలని పాత క్యాడర్‌కు చెందిన నాయకులు కోరుతున్నారు.



టికెట్ల కోసం పెద్ద సారు చుట్టూ ప్రదక్షిణ

తమకే టికెట్ కేటాయించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చుట్టూ ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల నాయకుల పేర్లను సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఏ కార్యక్రమానికి విచ్చేసినా రోజుల తరబడి తమ పనులు వదులుకొని ఎమ్మెల్యే నిర్వహించే కార్యక్రమాల్లో ఆశావహులు పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే కంటికి కనిపిస్తూ రోజంతా కార్యక్రమాల్లోనే కొనసాగుతున్నారు. టికెట్ ఎవరికి వస్తుందోనని ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. మరికొంత మంది ఇప్పటికే ఎంత ఖర్చు అవుతుంది? ఎన్ని ఓట్లు ఉన్నాయి? మన వారు ఎందరు? ఇతర పార్టీల ఓటర్లు ఎందరు? అని లెక్కలు వేసుకుంటున్నారు. దీంతో ప్రతిరోజూ కూడళ్ల వద్ద ఎన్నికలపైనే ముచ్చట్లు కొనసాగుతున్నాయి. గ్రామంలో సరైన నాయకులు ఎవరున్నారు ? ఎవరు గెలుస్తారు ? ఎవరికి టికెట్ వచ్చే అవకాశం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. ఏది ఏమైనా ఎన్నికల నిర్వహణపై గ్రామాల్లో ఉత్కంఠ నెలకొంది.

పరకాల మండలంలో రిజర్వేషన్లు ..

ప్రస్తుతం పరకాల మండల స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.. లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ బీసీ మహిళ, ఎంపీటీసీ జనరల్ మహిళ, వెంకటాపురం సర్పంచ్ జనరల్, హైబోత్‌పల్లి సర్పంచ్ జనరల్ మహిళ, నాగారం సర్పంచ్ బీసీ జనరల్, ఎంపీటీసీ బీసీ జనరల్, మల్లక్కపేట సర్పంచ్ ఎస్సీ మహిళ, ఎంపీటీసీ ఎస్సీ జనరల్, పైడిపల్లి సర్పంచ్ ఎస్సీ జనరల్, వెల్లంపల్లి సర్పంచ్ ఎస్సీ జనరల్, ఎంపీటీసీ జనరల్, పోచారం బీసీ జనరల్, ఎంపీటీసీ బీసీ మహిళ, అలియాబాద్ సర్పంచ్ జనరల్, కామారెడ్డిపల్లి సర్పంచ్ బీసీ మహిళగా రిజర్వేషన్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులుగా కొనసాగిన వారు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయని తిరిగి పదవులు తమకు ఉంటాయని ఆశించారు.

కానీ, రిజర్వేషన్లు తారుమారు కావడంతో తమ నమ్మిన బంటులను గెలిపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. జడ్పీటీసీ జనరల్, ఎంపీటీసీ జనరల్‌గా కేటాయించారు.

మైనింగ్ లాభాల్లో 30 శాతం ఇవ్వాలి

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సంపత్

కాజీపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్‌లో వచ్చే లాభాల్లో నుంచి వడ్డెర కుటుంబాలకు 30 శాతం ఇవ్వాలని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చొరవ చూపి వడ్డెరలను ఆదుకోవాలని జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు గండికోట సంపత్, సీనియర్ నాయకుడు సమ్మయ్య డిమాండ్ చేశారు. కాజీపేటలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వడ్డెరలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మైనింగ్‌లో వచ్చే లాభాల్లో నుంచి 30 శాతం బెనిఫిట్స్ వడ్డెరలకు అందించేవారన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత వడ్డెరలకు మైనింగ్ నుంచి వచ్చే లాభాలు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని వడ్డెర కుటుంబీకులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు శ్రీనివాస్, కాజీపేట మండల అధ్యక్షుడు కందిరాజు, యువజన నాయకులు వల్లపు నవీన్, గండికోట సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

దామోదర్‌రెడ్డికి ఘన నివాళి

హనుమకొండ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి పట్ల పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శనివారం సూర్యాపేట తుంగతుర్తిలో దామోదర్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటన్నారు. ఆయనతో తనకు ఉన్న అనుబంధాన్ని రాజేందర్‌రెడ్డి నెమరేసుకుంటూ విచారానికి లోనయ్యారు.

ఆర్టీఏ సాధన కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మహేందర్



వడ్డెపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన కందుకూరి మహేందర్ సమాచార హక్కు చట్టం (ఆర్టీఏ) సాధన కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరిగా నియమితులయ్యారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశం మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసే విధంగా కృషి చేస్తానని మహేందర్ పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో చోరీ

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇల్లంద గ్రామ శివారులో ఉన్న రాజరాజేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీలో ఉన్న కానుకలను ఎత్తుకెళ్లారు.

ఉదయం అర్చకులు, సిబ్బంది ఆలయాన్ని తీస్తుండగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై వర్ధన్నపేట అదనపు ఎస్ఐ మేరుగు రాజు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ పాఠశాలలో దొంగల బీభత్సం

నర్సంపేట టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి యత్నించారు. దసరా సెలువులు కావడంతో పాఠశాలకు సెలవులు ప్రకటించారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఈ సెలువు రోజుల్లో ఎప్పుడు చేశారో ఏమో గాని శనివారం పాఠశాల పునః ప్రారంభం కావడంతో సిబ్బంది పాఠశాల తెరవడంతో కిటికీలు డోర్లు పగలగొట్టి దొంగతనానికి విఫలయత్నం చేసినట్టు గుర్తించారు. పెద్ద చెట్టును పెకిలించి కంప్యూటర్‌లు ఉండే పక్క గది తలుపులను పగలగొట్టే ప్రయత్నం చేశారు. తాళాలను బండ రాళ్లతో బలంగా మొదారు. పాఠశాలలో ఏమి చోరీకి గురి కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు స్వరూప పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. గ్రామంలో దొంగతనాలపై పోలీసులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే'

శాయంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని స్థానిక ఎస్సై జక్కుల పరమేశ్వర్ హెచ్చరించారు. మండలంలోని మాం దారిపేట స్టేజి వద్ద శనివారం సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలతోపాటు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడిపిన వారు జైలుకు వెళ్లారన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, సరైన పత్రాలు కలిగి ఉండాలని, మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు.

దివంగత జర్నలిస్టు సుభాష్‌కు నివాళి



సుభాష్ గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

హసన్‌పర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది గుండెపోటుతో కన్నుమూసిన ఆంధ్రజ్యోతి జర్నలిస్టు నాయకపు సుభాష్‌గౌడ్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం శనివారం భీమారం సదానంద కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పలువురు సుభాష్‌గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి తడక రాజనారాయణ, సీనియర్ జర్నలిస్టులు బీఆర్ లెనిన్, చిలుముల్ల సుధాకర్, గడ్డం కేశవమూర్తి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, పొగాకుల అశోక్ గౌడ్, దొంతు నవీన్, జితేందర్, తిరుపతి, పవన్, ఆదర్శ్, రమేష్, బూర విద్యాసాగర్, మార్క విజయ్‌కుమార్, బత్తిని రమేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

మురికికూపంగా మున్సిపల్ గెస్ట్‌హౌస్

- చెత్తతో నిండిపోయిన ఆవరణ
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- శిథిలావస్థలో గెస్ట్‌హౌస్ భవనం

వడ్డెపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ ప్రాంతంలోని మున్సిపల్ గెస్ట్‌హౌస్ మురుగుకూపంగా మారిం ది. గెస్ట్ ఆవరణ చెత్తతో నిండిపోయింది. భవనం శిథిలావస్థలో మగ్గుతోంది. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా నిలుస్తోంది.

శిథిలావస్థలో మున్సిపల్ గెస్ట్‌హౌస్

హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ ప్రాంతంలోని మున్సిపల్ గెస్ట్ హౌస్ అధికారుల ఆలనా పాలన కొరవడింది. సుమారు రెండు దశాబ్దాల కిందట నిర్మించిన భవనం శిథిలావస్థలో మగ్గుతోంది. భవనానికి అమర్చిన కిటికీలు, తలుపులు, వెంటిలేటర్లు పాడయ్యాయి. గెస్ట్ హౌస్ ఆవరణ అంతా చెత్తతో నిండిపోయింది. హనుమకొండ నగరంలోని వివిధ డివిజన్లలో చెట్ల నుంచి తొలగించిన చెట్ల కొమ్మలను, ఇతర వ్యర్థాలను భవనం ఆవరణలో వేయడంతో దుర్గంధభరితంగా మారింది. వర్షపునీరు సైతం నిలవడంతో ఆవరణ బురదతో నిండిపోయింది. ఆవరణలో వ్యర్థాలు యథేచ్ఛగా వేయడం వలన అవి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోందని బాటసారులు సైతం వాపోతున్నారు.



శిథిలావస్థలో ఉన్న మున్సిపల్ గెస్ట్ హౌస్ భవనం

అసాంఘిక పనులకు అడ్డా

మున్సిపల్ గెస్ట్‌హౌస్ ప్రహరీ కూలిపోయింది. రాత్రివేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు గెస్ట్‌హౌస్ ఆవరణ విడిదిగా మారింది. మందుబాబులు విచ్చల విడిగా మద్యం సేవిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గెస్ట్ ఆవరణలో రేయింబవళ్లు పందులు, కుక్కలు, కోతులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయని పలువురు అంటున్నారు.



చెత్త, బురదమయంగా మారిన మున్సిపల్ గెస్ట్ హౌస్ ఆవరణ

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

తాళ్లపెల్లి విజయ్, జై భీమ్ కన్వీనర్, వడ్డెపల్లి



మున్సిపల్ గెస్ట్‌హౌస్ ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి. ఆవరణలో పేరుకుపోయిన చెత్త కొమ్మలను, చెత్తను తొలగించాలి. నూతనంగా ప్రహరీ నిర్మించాలి. గెస్ట్ హౌస్ భవనానికి మరమ్మతులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దాలి.

నేడు వారాల కుల సంఘం జోనల్ స్థాయి ఎన్నికలు

హసన్‌పర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలోని వారాల కుల సంఘం భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వారాల కుల సంఘం వరంగల్ జోనల్ స్థాయి సర్వసభ్య సమావేశం ఉంటుందని, అనంతరం ఎన్నికలు జరుగుతాయని వరంగల్ జోనల్ స్థాయి అధ్యక్ష, కార్యదర్శులు పావుశెట్టి నర్సింహరాములు, కందుకూరి సంజీవ్ తెలిపారు. శనివారం హసన్‌పర్తిలోని సంఘం భవనంలో అధ్యక్షుడు పావుశెట్టి రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో ఎజెండా అంశాలపై చర్చించి ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన బాధ్యతలను గుర్తు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 28 గ్రామాల్లో 877 కుటుంబాలు ఉన్నాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు 1,614 మంది ఉండగా, 814 మంది పురుషులు, 800 మంది స్త్రీలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆదివారం జరిగే వరంగల్ జోనల్ స్థాయి ఎన్నికలకు ప్రతి గ్రామం నుంచి కార్యవర్గ సభ్యులు విధిగా హాజరై సర్వసభ్య సమావేశంలో తమ సలహాలు, సూచనలు అందించి కులాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ వారాల కుల సంఘం రాష్ట్ర నాయకులు పావుశెట్టి వెంకటేశం, గుండమీది రవీందర్, వారాల కుల సంఘం హసన్‌పర్తి ప్రధాన కార్యదర్శి గుండమీది కృష్ణమోహన్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంట నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ వద్ద యువకుడిపై దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

మట్టెవాడ అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మండిబజార్‌లో గల ఖుర్షీద్ బిర్యానీ హోటల్ వద్ద శనివారం తెల్లవారుజామున గొడవ జరిగింది. గిర్మాజీపేటకు చెందిన ఓ యువకుడిపై కొంతమంది యువకులు దాడిచేశారు. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ గిర్మాజీపేటకు చెందిన నీలారపు రణధీర్ తన సోదరుడు సూర్యతో కలిసి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఖుర్షీద్ హోటల్‌కు బిర్యాని తినేందుకు వెళ్లాడు. అదే సమయంలో నితీశ్, తరుణ్, చందూతో పాటు మరి కొంతమంది యువకులు రణధీర్, సూర్యతో గొడవపడి రణధీర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరి చారు. దీంతో బాధితుడు రణధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులతో పాటు ఖుర్షీద్ హోటల్ జజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెల్లవారుజామువరకు హోటల్ నడిపితే సిటీ పోలీస్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ ఎన్.కరుణాకర్‌రావు హెచ్చరించారు. నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లు నిర్ణీత సమయంలో బంద్ చేయాలని సూచించారు.

పల్లెల్లో వేడెక్కిన రాజకీయం

- సోషల్ మీడియాలో జోరుగా చర్చలు

నెక్కొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోసం పలు రాజకీయ పార్టీల నాయకులు ఎంతో కాలంగా ఎదురు చూస్తుండగా అధికారులు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్‌లు ఖరారు చేయడంతో ఒక్కసారిగా పల్లెలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. పండుగల వేళా రిజర్వేషన్‌లు ప్రకటించడంతో పండుగల సందడికి రాజకీయ సందడి తోడవడంతో నలుగురు కలిస్తే చాలు స్థానిక సంస్థల ఎన్నికలపైన చర్చలు జరుగుతుండగా రాజకీయ నేతలు అప్పుడే రిజర్వేషన్‌ల ఆధారంగా గెలుపుఓటమిలపై సమీకరణలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కడుగు ముందుకు వేసిన రెండు రోజుల కిందట సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్న ఆశావాహుల జాబితాలను సిద్ధంచేసి అధిష్టానానికి పంపించారు.

బీసీలకు దక్కనున్న అవకాశాలు

42 శాతం రిజర్వేషన్ పుణ్యమా అంటూ నెక్కొండ జడ్పీటీసీ, ఎంపీపీతో పాటు నెక్కొండ మేజర్ గ్రామ సర్పంచ్‌గా బీసీలకు అవకాశం దక్కింది. ఈ మూడు ముఖ్యమైన స్థానాల్లో అవకాశం రావడం ఇదే తొలిసారి కావడంతో బీసీ నేతలలో ఆనందం ఉప్పొంగుతోంది. అత్యధికంగా సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు బీసీలకు రిజర్వేషన్ కావడంతో బీసీ నేతల్లో పోటీ తీవ్రంగా ఉంది. మండలంలో 39 గ్రామ పంచాయతీలు ఉండగా 11 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలు బీసీలకు, 16 ఎంపీటీసీ స్థానాల్లో 7 ఎంపీటీసీ స్థానాలు బీసీలకు రిజర్వేషన్ అయ్యాయి. రిజరేషన్‌లు బీసీలకు కలసిరావడంతో ఎన్నికల్లో పోటీకి బీసీలు ఉత్సాహం చూపుతున్నారు.

వైభవంగా శోభాయాత్ర

- రంగశాయిపేటలో ఘనంగా అమ్మవారి ఊరేగింపు
- హారతులు పట్టి సాగనంపిన మహిళలు

శంభునిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారిని ఘనంగా గంగమ్మ ఒడికి సాగనంపారు. రంగశాయిపేటలో శనివారం వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక రథాలపై అమ్మవారిని అలంకరించి జైభవానీ, జై దుర్గా అంటూ భక్తులు డోలు వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. దారి పొడువునా భక్తులు అమ్మవారికి హారతులు పట్టారు. రంగశాయిపేట గాంధీ జంక్షన్‌లో వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్‌ను సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. అనంతరం శోభాయాత్ర ప్రారంభించారు. రామాలయంలో మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో, కాశీ విశ్వేశ్వర వీరాంజనేయ ఆలయంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో, జెండా గద్దె వద్ద శివపుత్ర యూత్ ఆధ్వర్యంలో.. విశ్వనాథకాలనీలో లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో, సాయినగర్ కాలనీలో ప్రతిష్ఠించిన అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించి రంగశాయిపేటలోని బెస్తం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో భవానీ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ఓ సిటీలో దుర్గామాత మంటపం వద్ద నిర్వహించిన ఉద్వాసన పూజా కార్యక్రమంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు, బీజేపీ జిల్లా నాయకులు కర్నె రవీందర్, అర్చకులు, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



రంగశాయిపేటలో అమ్మవారు

శ్రీను సేవా మార్గాన్ని అనుసరించాలి

కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శివకుమార్

హసన్‌పర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలు శ్రీను సేవా మార్గాన్ని అనుసరించాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి చౌరస్తాలో బీజేపీ సీనియర్ నాయకుడు గుండమీది శ్రీనివాస్ వర్ధంతి శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి శ్రీను ప్రజలకు, పార్టీకి చేసిన సేవలను గుర్తుచేశారు. సేవా మార్గం పట్ల అంకితభావం కలిగిన వ్యక్తిగా ఇతరులకు సాయం చేయడంలో ఎప్పుడూ ముందుండే నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, వివిధ పార్టీల ప్రముఖులు, కార్యకర్తలు, మిత్రులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ బలరాం నాయక్

వరంగల్ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారిని మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్ శనివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వదిస్తూ అమ్మవారి తీర్థ ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

లాకర్‌కు చేరిన అమ్మవారి నగలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారికి తెలంగాణ ప్రభుత్వం చేయించిన బంగారు నగలు, బంగారు కిరీటాలను బ్యాంకు లాకర్‌లో దేవస్థానం అధికారులు భద్రపర్చారు. నవరాత్రి వేడుకలకు ముందు బ్యాంకు లాకర్ నుంచి నగలను తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు. శనివారం వేడుకలు ముగిసిన నేపథ్యంలో తిరిగి బ్యాంకు లాకర్‌లో భద్రపర్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సీతక్క పరామర్శ



కాంతమ్మ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

నర్సంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ శనివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలిసిన మంత్రి సీతక్క హనుమకొండలోని ఎమ్మెల్యే మాధవరెడ్డి నివాసానికి చేరుకుని కాంతమ్మ పార్థీవదేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించారు.

శిథిల కల్వర్టుతో కష్టాలెన్నో?



జవహర్ కాలనీ, గోపాల్‌పూర్‌ల మధ్య శిథిలమైన కల్వర్టు

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం
- కొత్త కల్వర్టులు నిర్మించాలని జవహర్ కాలనీవాసుల వినతి

వడ్డెపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్, జవహర్ కాలనీల మధ్య ద్వారకా సాయి కాలనీ వద్ద ఉన్న కల్వర్టు శిథిలావస్థలో ఉంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా జీడబ్ల్యూఎంసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతన కల్వర్టును నిర్మించాలని జవహర్ కాలనీ, ద్వారకా సాయి కాలనీలతో పాటు వివిధ కాలనీల ప్రజలు జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగు నెలలుగా నరకయాతన

జవహర్‌కాలనీ, గోపాల్‌పూర్‌ల మధ్య సుమారు 20 ఏళ్ల కిందట నిర్మించిన కల్వర్టు శిథిలమైపోయింది. వర్షాలకు కల్వర్టు పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడి కంకర లేసిపోవడంతో వాహన చోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహన చోదకులు పడుతున్న బాధలు వర్ణణాతీతం. ఈ రోడ్డులోని కల్వర్టు శిథిలమై నాలుగు నెలలు దాటడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గుంతలమయమైన రోడ్డుతోపాటు కల్వర్టు సైతం శిథిలమై ఉండడంతో ప్రమాదాలకు నెలవుగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలు సైతం శిథిలావస్థలోనే మగ్గుతున్నాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుపై నుంచి వెళ్తుంటాయి. జీడబ్ల్యూఎంసీ అధికారులు స్పందించి కొత్త కల్వర్టు నిర్మించాలని వివిధ కాలనీల ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టును వెంటనే నిర్మించాలి



గోపాల్‌పూర్, జవహర్‌కాలనీల మధ్య ద్వారకా సాయి కాలనీ ఫేజ్-1 ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు శిథిలమై పోయింది. గుంతల మయంగా రోడ్డు ఉండడం వలన రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. జీడబ్ల్యూఎంసీ అధికారులు స్పందించి నూతన కల్వర్టును వెంటనే నిర్మించి ప్రమాదాలను అరికట్టాలి.

బండి హరీష్ ముదిరాజ్, జవహర్ కాలనీ

ట్రెండ్



మా జీవితం మా హక్కు

కృత్రిమ మేథస్సు, సామాజిక మాధ్యమాలు విషపూరిత సమ్మేళనంగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు, సంస్థలు పేరు కోసం, విక్రయాల కోసం ప్రముఖుల స్వరాలు, ఆహార్యాలను అనుకరించే పోకడను అనుసరిస్తున్నారు. ఈ పోకడ నెటిజన్లను అలరిస్తున్నా, నటులను మాత్రం ఒకింత అసహనానికి గురి చేస్తోంది. కాబట్టే తాజాగా కొందరు ప్రముఖులు వారి వ్యక్తిగత హోదానూ, హుందాతనాన్నీ పరిరక్షించుకోవడం కోసం కోర్టుల ద్వారా 'పర్సనాలిటీ రైట్స్'ను పొందుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం!

ఐశ్వర్య దంపతులు సైతం

2024 మేలో, కొన్ని సంస్థలు జాకీ ష్రాఫ్ ఫొటోలను వాడుకుంటూ, అనధికారిక వస్తువుల అమ్మకాలు, వక్రీకరించిన వీడియోలతో వాణిజ్య లాభాలను ఆర్జిస్తున్నట్టు గుర్తించిన న్యాయస్థానం బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ వ్యక్తిత్వ హక్కులకు కూడా రక్షణ కల్పించింది. అలాగే అనిల్ కపూర్ పేరు, ఫొటో, స్వరాలతో పాటు ఆయన సుప్రసిద్ధ క్యాచ్‌ఫ్రేజ్ 'ఝకాస్' అనే మాటను కూడా వినియోగించడానికి వీల్లేకుండా వ్యక్తిత్వ హక్కుల రక్షణను అనుమతించింది. అలాగే 2022 నవంబరులో హైకోర్టు అమితాబ్ బచ్చన్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులు ఉల్లంఘనకు లోను కాకుండా రక్షణ కల్పించింది. గత సెప్టెంబరులో ప్రపంచసుందరి, బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లతో పాటు నిర్మాత కరణ్ జోహార్‌ల వ్యక్తిత్వం, ప్రచార హక్కులకు కూడా రక్షణ కల్పించడం విశేషం. కరణ్ జోహార్ విషయంలో, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, పిన్‌ట్రెస్ట్, యూట్యూబ్‌లతో సహా వివిధ సామాజిక మాధ్యమాల వేదికల నుంచి అశ్లీల మీమ్స్, పోస్టులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అటువంటి కంటెంట్‌ను సృష్టించడం కోసం ఒక ప్రముఖుడి వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించడం వల్ల ఆ ప్రముఖుడి పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నట్టు పేర్కొంది.

మధుర గాయని కూడా...



ప్రముఖ హిందీ గాయని ఆశాభోంస్లే, కృత్రిమ మేథస్సు సహాయంతో తన స్వరాన్ని దుర్వినియోగపరుస్తున్న ఎఐ కంపెనీ మింక్ ఇంక్‌తో సహా అనేక సంస్థలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. దాంతో ముందస్తు అనుమతి లేకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేదికలు, ఇ కామర్స్ సైట్‌లు, స్వతంత్ర విక్రేతలు ఆశాభోంస్లే స్వరాన్ని క్లోనింగ్ చేయడం లేదా ఆమె చిత్రాలు, పోలికలు, ఇతర వ్యక్తిత్వ లక్షణాలు దుర్వినియోగం కాకుండా బోంబే హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. డిజిటల్ యుగంలో ప్రముఖుల హక్కులను కాపాడే క్రమంలో న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వు ప్రస్తుతం ఎంతో కీలకంగా మారింది.

నటుడు నాగార్జున కూడా...

పేరు, స్వరం, ఇమేజ్.. ఏ నటుడికైనా ఇవెంతో ముఖ్యం. వీటిని ఏ కారణంగా దుర్వినియోగపరిచినా ఏ నటులూ ఉపేక్షించరు. వెంటనే కోర్టును ఆశ్రయించి, వ్యక్తిత్వ హక్కులను పొందే ప్రయత్నం చేస్తారు. నటుడు నాగార్జున ఇదే చేశారు. తాజాగా తన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పించాలంటూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, అనుమతి పొందారు. అక్రమ వాణిజ్య ప్రయోజనాల కోసం వస్తువులను విక్రయించడం కోసం తన వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు, తన ఫొటోలను అశ్లీల ఫొటోలతో మార్ఫింగ్ చేస్తున్నట్టు, యూట్యూబ్‌లో వీడియోలు సృష్టించడం ద్వారా, కృత్రిమ మేథస్సు సహాయంతో తనను ఉగ్రవాద సంస్థలతో, జూదంతో అనుసంధానిస్తున్నట్టు నాగార్జున తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ వ్యక్తి ఇమేజ్‌ను తప్పుదారి పట్టిస్తూ, అనుచితమైన, అవమానకరమైన మార్గాల్లో వారి ప్రవర్తననూ, ఆహార్యాన్నీ అనుకరిస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగించినప్పుడు, వాళ్ల గుడ్‌విల్ దెబ్బ తింటుందని పేర్కొంటూ, ఢిల్లీ హైకోర్టు, నటుడు అక్కినేని నాగార్జున వ్యక్తిత్వం, ప్రచార హక్కులను కాపాడుతూనే ఆయన ప్రమేయం లేకుండా, పేరునూ, ఇమేజ్‌నూ, స్వరాన్నీ వాణిజ్యపరంగా ఉపయోగించకుండా కట్టడి విధించింది.



సండే సెలబ్రిటీ



దక్షిణాది, హిందీ సినిమాల ద్వారా ప్రేక్షకులపై తనదైన ముద్ర వేసిన హీరోయిన్ రాశీ ఖన్నా, తాజాగా ఆమె నటించిన 'తెలుసు కదా' సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

అలాగైతే పాతబడిపోతాం...

'తెలుసు కదా' టీజర్‌కు మంచి స్పందన వచ్చింది కదా... ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా అనిపిస్తోంది. సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నాం. చాలా కాలం తర్వాత నేను చేస్తున్న తెలుగు సినిమా ఇది. కాబట్టి చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. నాకు హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. వచ్చిపోతూ ఉంటాను. ఇక్కడ షూటింగ్ జరుగుతూ ఉంటే పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తోంది.

మీరు అనర్గళంగా మంచి తెలుగు మాట్లాడుతున్నారు... ప్రాక్టీస్ చేశారా?

చాలాకాలంగా తెలుగు సినిమాలు చేస్తున్నాను కదా! తెలుగు వచ్చేసింది. నాకు తెలుగే కాదు... తమిళం, హిందీ కూడా బాగా వచ్చు. ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ కావటానికి భాష చాలా ప్రముఖమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాదు... ఇది ఆయా భాషల ప్రేక్షకులకు నేను ఇచ్చే కనీస గౌరవం.

> **నా తల్లితండ్రులు, మా అన్నయ్య, ఇద్దరు స్నేహితులు వీరందరూ నాకు మంచి సపోర్ట్. నాకు ఏ చిన్న సమస్య వచ్చినా వాళ్లతో చెబుతా!**

మీరు హిందీ ప్రాజెక్టుల్లో కూడా నటించారు కదా... బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు ఉన్న తేడా ఏమిటి?

టాలీవుడ్‌లో హీరోయిన్లకు చాలా గౌరవం లభిస్తుంది. చాలా ఆదరంగా చూస్తారు. పైగా కాల్షీట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకానే ఉంటుంది. బాలీవుడ్‌లో కానీ, తమిళ పరిశ్రమలో కానీ కాల్షీట్ పన్నెండు గంటలు ఉంటుంది. అందువల్ల ఎక్కువగా అలసిపోతాం. అంతేకాకుండా ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. తెలుగు ప్రేక్షకులకు నా పట్ల అభిమానం ఎక్కువ. నేను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా వారు ఆదరిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు.



> **నేను భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించను. ఎందుకంటే భవిష్యత్తులో ఏం జరుగుతుందో మనకు తెలియదు. చిన్నప్పుడు నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకొనేదాన్ని. అనుకోకుండా హీరోయిన్ అయ్యా. ఇలా మనం అనుకున్నవన్నీ కావు.**

బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్ష ఉందని విమర్శలు వినిపిస్తూ ఉంటాయి...

నాకు అలాంటి ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అంతేకాదు, ఓటీటీ వచ్చిన తరువాత భాషపరమైన సమస్యలు తొలగిపోయాయి. ఇక్కడ హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అక్కడ దక్షిణాది సినిమాలు చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మంచి నటులకు అన్ని భాషల్లోను అవకాశాలు లభిస్తున్నాయి.

నటనపై మీ అభిప్రాయమేమిటి?

నటనను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. నేను సినిమా రంగానికి వచ్చినప్పుడు నాకు ఏదీ తెలియదు. మనసుకు ఎలా అనిపిస్తే అలా నటించేదాన్ని. ఆ తర్వాత నటనకు కొన్ని టెక్నిక్స్ ఉంటాయని తెలిసింది. పుస్తకాలు చదవటం మొదలుపెట్టా. వీడియోలు చూసేదాన్ని. ముంబాయిలో నాటక రంగంలో పనిచేశా. ఎప్పటికప్పుడు నేర్చుకోపోతే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మనం పాతపడిపోతాం!

మీరు స్క్రిప్టులు ఎలా ఎంపిక చేసుకుంటారు?

నేను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. నా పాత్ర ఎలా ఉందనే విషయంపైనే ఎక్కువ దృష్టి పెడతా! కొన్నిసార్లు డైరెక్టర్లు వచ్చి కథలు చెబుతారు. వాళ్ల దగ్గర స్క్రిప్ట్ ఉండదు. అలాంటప్పుడు చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఇతర కారణాల వల్ల కూడా ప్రాజెక్టులు ఓకే చేస్తా. కొందరు డైరెక్టర్లకు మంచి దార్శనికత ఉంటుంది. అలాంటప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. వారు చెప్పినట్లు చేసేస్తాను. కొందరు వచ్చి సలహాలు అడుగుతారు. నాకు తెలిసినంత చెబుతాను.

> **ఒక నటిగా నాకు ఎప్పుడూ అభద్రతా భావం లేదు. నన్ను నేను ఎవరితోను పోల్చుకోను. ప్రతి వ్యక్తికి తనదైన జర్నీ ఉంటుంది.**

మీకు ఏ తరహా పాత్రలు చేయాలని ఉంది?

నాకు హారర్ ఫిల్మ్ చేయాలని ఉంది. ఎందుకంటే నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మైథాలజీ, యాక్షన్ ఫిల్మ్ కూడా చేయాలని ఉంది.

> నాకు ఓషో అన్నా, బ్రహ్మకుమారిల మార్గమన్నా ఇష్టం. ఆధ్యాత్మికతపై నాకు అవగాహన ఉంది. నేను ఈ పరిశ్రమలో నెగ్గుకురావటానికి అది కూడా ఒక కారణం. నేను ఏ పనిచేసినా నిబద్ధతతో చేస్తా. అయితే ఫలితాలు నా చేతిలో ఉండవనే విషయం కూడా నాకు తెలుసు.

మీరు సినిమాలూ చేశారు, వెబ్ సిరీస్‌లూ చేశారు. రెండింటి మధ్యా తేడా ఏమిటి?

కొంత తేడా ఉంది. వెబ్ సిరీస్‌లలో పాత్రల్లో అనేక కోణాలు ఉంటాయి. వాటిని చూపించటానికి ఎక్కువ సమయం ఉంటుంది. సినిమాల్లో అంత సమయం దొరకదు. అయితే నాకు సినిమాలంటేనే ఇష్టం.


• సీవీఎల్ఎన్ ప్రసాద్

అమ్మో ఐ బొమ్మ

ప్రపంచంలో సినిమాను ప్రేమించే ప్రేక్షకులు ఉన్నంత కాలం, పైరసీ అనే భూతం వెంటాడుతూనే ఉంటుంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమను వణికిస్తున్న అలాంటి పైరసీ వెబ్‌సైట్లలో 'ఐ బొమ్మ' ఒకటి. ఈ పేరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొత్త సినిమా థియేటర్లలో విడుదలైన కొద్ది గంటల్లోనే, లేదా ఓటీటీలోకి వచ్చిన మరుక్షణమే హై - క్వాలిటీ ప్రింట్‌తో ఈ సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి వస్తోంది. అయితే ఈ ఉచిత వినోదం తెలుగు సినిమా నిర్మాతలకు రూ. వేల కోట్ల నష్టం తెస్తోంది.

పైరసీ మాఫియా

'మూవీ రూల్స్, ఐ బొమ్మ లాంటి సైట్స్ కేవలం సినిమాలను అప్‌లోడ్ చేసే వేదికలు మాత్రమే కాదు. దీని వెనుక ఒక పకడ్బందీ వ్యవస్థ ఉంది. అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోంద'ని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. పైరసీ వల్ల తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఒక్క 2024లోనే పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ. 3700 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.



చిన్న సినిమాల పాలిట విలన్

భారీ బడ్జెట్ చిత్రాలు, పాన్ ఇండియా చిత్రాలకు ఓటీటీ, శాటిలైట్ హక్కుల ద్వారా కొంతమేర నష్టం తగ్గినా, పైరసీ వల్ల అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం చిన్న సినిమాలే. పలు సందర్భాల్లో చిన్న నిర్మాతలు, దర్శకులు వెలిబుచ్చిన ఆవేదన దీనికి అద్దం పడుతోంది. 'మా కలలను, మా పెట్టుబడినీ పైరసీ చంపేస్తోంది. మా పెట్టుబడిలో ఒక్క పైసా కూడా తిరిగి రావడం లేదు. ఇది ఇలాగే కొనసాగుతూ ఉంటే మరో సినిమా ఎలా తీయగలం' అని చిన్న నిర్మాతలు, దర్శకులు ప్రశ్నిస్తున్నారు. థియేటర్ల ద్వారా పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకోవాలని చూసే చిన్న నిర్మాతల ఆశలపై ఐ బొమ్మ నీళ్లు చల్లుతోందనడంలో సందేహం లేదు. అలాగే పైరసీ అనేది థియేటర్ల ఆదాయంతో పాటు ఓటీటీ రెవెన్యూను సైతం దెబ్బతీస్తోంది. థియేటర్లలో విడుదలతో పాటు ఓటీటీల ఆదాయానికి ఐ బొమ్మ లాంటి సైట్లు గండికొడుతున్నాయి.

పోలీసులకు సవాల్

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐ బొమ్మతో సహా 65కు పైగా పైరసీ వెబ్‌సైట్లపై దర్యాప్తును ముమ్మరం చేశారు. ఐ బొమ్మపై దృష్టి సారించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌లో భాగమైన కొందరు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. దాని నిర్వాహకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పైరసీ రాకెట్ హైదరాబాద్‌తో పాటు దుబాయ్, నెదర్లాండ్ వంటి విదేశీ ప్రాంతాల నుంచి పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పైరసీముఠా కొన్ని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, రికార్డింగ్, ఎడిటింగ్, అప్‌లోడింగ్, మానిటైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఛేజింగ్ గేమ్

ఐ బొమ్మ లాంటి పైరసీ సైట్లు తమ డొమైన్లను తరచూ మార్చడం, సర్వర్లు విదేశాల్లో ఉండడం వల్ల వాటిని శాశ్వతంగా మూసివేయడం పోలీసులకు, పైరసీ సెల్‌లకు పెద్ద సవాల్‌గా మారింది. ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే కొద్ది రోజుల్లోనే అది కొత్త పేరుతో కొత్త లింక్‌తో మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంటర్నెట్ ప్రపంచంలో ఇదొక అంతుచిక్కని 'ఛేజింగ్ గేమ్'గా మారిపోయింది.

పరిష్కారం ప్రేక్షకుల చేతుల్లోనే!

పైరసీని పూర్తిగా రూపుమాపడం కష్టమే అయినా, సినీ పరిశ్రమ, ప్రభుత్వం, ప్రేక్షకులు కలసి పోరాడాల్సిన అవసరం ఉంది. అయితే ముఖ్యంగా మారాల్సింది ప్రేక్షకులే. పైరసీ లింక్‌లను ప్రోత్సహించకుండా, నాణ్యమైన వినోదం కావాలంటే థియేటర్లలో చూడడం, చట్టబద్ధమైన ఓటీటీ వేదికలను ఆదరించడం ఒక్కటే ఈ భూతం నుంచి తెలుగు సినిమాను రక్షించే మార్గం. వేల మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కష్టం, కలలకు ప్రతిరూపమైన సినిమాను పైరసీ కోరల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రూ హంటింగ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 06
వార్ 2	హిందీ చిత్రం	అక్టోబర్ 09
ది ఉమన్ ఇన్ కేబిన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 09
కురుక్షేత్ర	హిందీ సిరీస్	అక్టోబర్ 10
అమెజాన్ ప్రైమ్		
మెయింటనెన్స్ రిక్వైర్డ్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 08
జాన్ కేండీ	డాక్యూ మూవీ	అక్టోబర్ 10
జియో హాట్‌స్టార్		
మిరాయ్	తెలుగు చిత్రం	అక్టోబర్ 10
సెర్చ్: ది నైనా మర్డర్ కేస్	హిందీ సిరీస్	అక్టోబర్ 10

రంగురంగుల గాజులతో రమ్యంగా..

ఆభరణాలన్నింటిలో గాజులకు ప్రత్యేక స్థానం ఇస్తుంటారు మహిళలు. ఎన్ని నగలు పెట్టుకున్నా.. అందమైన గాజులు వేసుకోకపోతే అలంకరణ పూర్తికానట్టే! ఒకప్పుడు.. పెళ్లయిన మహిళలు చేతినిండా మట్టిగాజులు వేసుకునేవారు. యువతులు రంగురంగుల లక్క గాజులు, ప్లాస్టిక్ లేదా నైలాన్ గాజులు వేసుకునేవారు. క్రమంగా బ్లాక్ మెటల్, వైట్ మెటల్ బ్యాంగిల్స్ వచ్చేశాయి. ఇవి కాలేజీ యువతులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇక బంగారు గాజులు ఎప్పటికీ ప్రత్యేకమే. వాటిమీద కెంపులు, పచ్చలు, వజ్రాలు, ముత్యాలు, నీలాలు పొదిగి ఎన్నో అద్భుతమైన డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని కేవలం పండుగలు, వివాహాది శుభకార్యాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు మహిళలు. రోజువారీ వేసుకోవడానికి వీలుగా మారుతున్న పోకడలకు అనుగుణంగా రకరకాల రాళ్ల గాజులు, థ్రెడ్ బ్యాంగిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. సీజెడ్, టోరమలీన్, టోపాజ్ లాంటి మామూలు రాళ్లతో డిజైన్ చేసిన గాజులను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా రంగుల దారాలు చుట్టిన గాజులు కూడా యువతులను ఆకర్షిస్తున్నాయి. కాలేజీకైనా కార్యాలయానికైనా వెళ్లేటప్పుడు చేతికి ఒక్క గాజు వేసుకుంటే చాలనుకుంటున్నారు. అంతలా మహిళల మనసు దోచుకున్న రంగురంగుల గాజులపై ఓ లుక్కేద్దామా...





దారాల గాజులు

ప్లాస్టిక్, లేదా మెటల్ బ్యాంగిల్స్‌కు రంగు రంగుల పట్టుదారాలను ఒక క్రమంలో చుట్టి కొనలను గమ్‌తో అంటిస్తారు. రెండు లేదా మూడు రంగుల దారాలను అందమైన డిజైన్ ప్రకారం చుట్టి తయారుచేసిన గాజులు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటి మీద రంగురంగుల కుందనాలు, రాళ్లు, ముత్యాలు, బీడ్స్ కూడా అతికిస్తుంటారు. మువ్వలు వేలాడదీస్తుంటారు. సన్నగా, వెడల్పుగా లేదంటే లావుగా ఇలా ఏ ఆకారంలో కావాలంటే అలా ఇంట్లోనే దారాల గాజులు తయారు చేసుకోవచ్చు. గోట్స్ సైడ్ బ్యాంగిల్స్ మాదిరిగా డిజైన్ చేసుకుని చేతులకు వేసుకుంటే నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల దారాలతో లావుపాటి గాజులు సిద్ధం చేసుకుంటే రోజువారీ వేసుకోవడానికి బాగుంటాయి.



సీజెడ్ గాజులు

వజ్రాలకు ప్రత్యామ్నాయంగా సీజెడ్స్ ఉపయోగించి తయారుచేసే రాళ్ల గాజులను యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం వివిధ రంగుల్లో సీజెడ్స్ లభ్యమవుతున్నాయి. ఒక గ్రాము బంగారం లేదా వెండి ప్లేటింగ్‌తో పలు డిజైన్లలో రంగురంగుల సీజెడ్‌లను కూర్చి గాజులు రూపొందిస్తున్నారు. సింగిల్ లైన్, మల్టిపుల్ లైన్స్, బ్రేస్‌లెట్ స్టయిల్ గాజులు అందుబాటులో ఉన్నాయి. వజ్రాలను పోలిన కటింగ్‌తో తళతళలాడే సీజెడ్ గాజులు... సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌ల మీద కూడా చక్కగా నప్పుతాయి.



టోరమలీన్ గాజులు

టోరమలీన్ రాళ్లు పొదిగిన గాజులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. విభిన్నమైన కటింగ్ విధానం వల్ల ఈ రాళ్లు నలువైపులా కాంతులు విరజిమ్ముతుంటాయి. గులాబీ, ఎరుపు, ఆకుపచ్చ, నీలం, నలుపు, గోధుమ రంగుల్లో లభించే టోరమలీన్ రాళ్ల గాజులను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పట్టుచీరలు లేదా భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లతో నిండిన లెహంగాల మీద ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రోజువారీ వేసుకోవడానికి కూడా సౌకర్యవంతంగా ఉంటాయి.



టోపాజ్ గాజులు

రంగురంగుల టోపాజ్ రాళ్లను కూర్చి రూపొందించిన గాజులు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. లక్క, ప్లాస్టిక్, మెటల్ గాజుల మీద పలు ఆకారాల్లో ఉన్న టోపాజ్ రాళ్లను అతికిస్తారు. నీలం, గులాబీ, ఆకుపచ్చ, పసుపు రంగుల్లో చిన్న, పెద్ద సైజుల్లో ఉన్న టోపాజ్ రాళ్లతో చాలా రిచ్‌గా కనిపిస్తాయి ఈ గాజులు. వెడల్పుగా గోట్ మాదిరి కనిపించే ఈ గాజులను చేతికి ఒక్కటి వేసుకున్నా గ్రాండ్‌గా ఉంటుంది.

దగ్గు.. వారంలో అదే తగ్గు!

- చిన్నారులకు దగ్గు మందుతో సమస్యలు
- కాంబినేషన్ డ్రగ్‌తో మరింత ప్రమాదం
- పిల్లల అవయవాలపై దుష్ప్రభావాలు..
- మందులు వాడకున్నా వారంలో దగ్గు తగ్గుతుంది: వైద్యులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మీ ఇంట్లో పిల్లలు విపరీతంగా దగ్గుతున్నారా..! ఏమవుతుందోనని.. ఏదో ఒక దగ్గు సిరప్ తెచ్చి ఓ చెంచాడు తాగించేస్తున్నారా..! అయితే కాస్తా ఆగండి.. ఆ దగ్గు మందే పిల్లలకు ప్రాణ సంకటంగా మారవచ్చు. పెద్దలా మాదిరి చిన్నారులకు దగ్గు మందు వేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రెండేళ్ల లోపు పిల్లలకు అసలు దగ్గు మందు వద్దని కేంద్రం కూడా ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేస్తున్నారు. పిల్లలు దగ్గుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాధారణంగా ఆ సమస్య ఆరేడు రోజుల్లో అదే తగ్గిపోతుందని చెబుతున్నారు. అందుకోసం ఏవో మందులు వాడి ఇబ్బందులపాలు కావద్దని సూచిస్తున్నారు. పిల్లలకు సాధారణంగా జలుబు, శ్వాసకోశ సమస్యలతో విపరీతమైన దగ్గు వస్తుందని వైద్యులు చెబుతున్నారు. నవజాత శిశువులు, బడికి వెళ్లే చిన్న పిల్లలకు ఏడాదిలో ఆరేడు సార్లు ఈ సమస్యలు ఉత్పన్నమవుతాయంటున్నారు. దీని వల్ల 2, 3 రోజుల పాటు జ్వరం, దగ్గు, ముక్కు రంధ్రాలు మూసుకుపోవడం, నిద్ర లేకపోవడం, ఆయాస పడడం వంటి అవస్థలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కానీ శరీరంలో ఆ వైరస్, బ్యాక్టీరియాలను ఎదుర్కొని తట్టుకునే శక్తి సాధారణంగా ఉంటుందని.. దీంతో ఆరేడు రోజుల్లో సమస్యలు తగ్గిపోతాయని వైద్యులు వివరిస్తున్నారు. ఇలాంటి సమయంలో పిల్లలకు ఇంటి వైద్యం చేయొచ్చంటున్నారు. అప్పటికీ తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

కాంబినేషన్ డ్రగ్‌తో ముప్పు



పలు రకాల సమస్యల నివారణకు దగ్గు మందులో కాంబినేషన్ డ్రగ్స్ ఉంటాయి. తెలియకుండా వాడితే పిల్లలకు ప్రాణాంతకమవ్వవచ్చు. దగ్గు మందులో జ్వరాన్ని తగ్గించే పారాసిటమాల్ కూడా ఉంటుంది. అయితే పిల్లలకు జ్వరం లేకపోయినా ఈ రకం కాంబినేషన్ సిరప్ ఇస్తే తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. కొన్నిసార్లు అధిక డోసు కారణంగా అవయవాల పనితీరుపై ప్రభావం పడుతుంది. గుండె స్పందనల్లో తేడా వస్తుంది. అందుకే పిల్లలకు నాలుగేళ్ల వరకు ఎలాంటి కాంబినేషన్ డ్రగ్ వాడొద్దు.

- డాక్టర్ అనుపమ యెర్రా, పిల్లల వైద్యురాలు, రెయిన్‌బో ఆస్పత్రి

ఆయాసం వచ్చినా దగ్గు మందేనా..?



పిల్లలకు ఆయాసం వస్తే కూడా కొందరు దగ్గు మందును వాడుతున్నారు. దగ్గు మందులో ఏ ఇన్‌గ్రీడియెన్స్ ముందు తెలుసుకోవాలి. అవి ఎంత మేరకు ప్రమాదమో పరిశీలించాలి. పిల్లలకు దగ్గు మందు వాడొద్దని క్లినిక్ ట్రయల్స్‌లో కూడా నిర్ధారించారు. దగ్గు మందులతో వారి కిడ్నీలపై ప్రభావంపై పడుతుంది. కొన్నిసార్లు డయాలసిస్ చేసే సమయం ఉండదు.

- డాక్టర్ రవి కుమార్, పిల్లల వైద్యుడు, నిలోఫర్ ఆస్పత్రి

కోల్డ్రిఫ్ సిరప్‌పై ప్రజలకు తెలంగాణ సర్కారు అలెర్ట్..

గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో దగ్గు మందు కోల్డ్రిఫ్ సిరప్ వాడటంతో పలువురు చిన్నారులు మృత్యువాత పడిన నేపథ్యంలో తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అప్రమత్తమైంది. కోల్డ్రిఫ్ సిరప్ బ్యాచ్ నంబర్ ఎస్ఆర్-13 వాడకాన్ని నిషేధిస్తున్నామని.. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓ ప్రకటన విడుదల చేసింది.

సినీతారలకు 'ఏఐ' విలన్!

(మొదటి పేజీ తరువాయి)

రూపొందిన ఒక డీప్‌ఫేక్ వీడియో కలకలం సృష్టించింది కూడా. అయితే సినిమాల్లో విలన్లను ఆటాడుకునే తారలు.. ఈ ఏఐ విలన్‌ను మాత్రం తట్టుకోలేకపోతున్నారు. యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఇలాంటి ఏఐ వీడియోలు, చిత్రాలతో తమ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలుగుతోందని, వాటిని తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టులను ఆశ్రయిస్తున్నారు. నటి ఐశ్వర్యారాయ్, ఆమె భర్త అభిషేక్ బచ్చన్, నిర్మాత కరణ్ జోహార్, టాలీవుడ్ సీనియర్ హీరో నాగార్జున ఇటీవల ఢిల్లీ హైకోర్టులో ఇలాంటి పిటిషన్లు వేశారు. కొన్ని సినిమా వెబ్‌సైట్లు, బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, కొన్ని డార్క్ వెబ్‌సైట్లలో తమ చిత్రాలను వాడుతూ అశ్లీల కంటెంట్ అప్‌లోడ్ చేస్తున్నారని.. బెట్టింగ్ యాప్స్‌లోనూ తమ ఏఐ ఆధారిత చిత్రాలు, వీడియోలు వాడుతున్నారని వారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, డీప్‌ఫేక్స్, ఫేస్ మార్ఫింగ్ సాంకేతికతల ద్వారా తమ చిత్రాలను, వీడియోలను రూపొందించి, వాడకుండా నిషేధించాలని కోర్టును కోరారు. తన చిత్రాలను వాడుతూ ఉగ్రవాద సంస్థలతో ముడిపెడుతున్నారని, అశ్లీల వీడియోలు రూపొందించారని నాగార్జున కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తమ చిత్రాలతో కొందరు అశ్లీల వీడియోలను రూపొందించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారని.. తమకు కలిగిన పరువు నష్టానికి యూట్యూబ్, గూగుల్ కంపెనీలు రూ.4కోట్లు పరిహారం ఇచ్చేలా ఆదేశించాలని ఐశ్వర్యరాయ్, అభిషేక్ బచ్చన్ కోర్టును కోరారు.

కోర్టు ఆదేశించినా ఆగేనా?

సినీ సెలబ్రిటీల ఫిర్యాదుతో సదరు వీడియోలను, కంటెంట్‌ను తొలగించాలని యూట్యూబ్, ఇతర సంస్థలకు కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కానీ హైకోర్టు ఆదేశించినా వాటిని అడ్డుకోవడం సాధ్యమేనా అన్న దానిపై సైబర్ నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా వేదికల్లో అప్‌లోడ్ అవుతున్న నకిలీ కంటెంట్‌ను అడ్డుకునే అల్గారిథం ఆయా సంస్థల వద్ద లేదని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు. తప్పుడు, అశ్లీల కంటెంట్‌ను.. వీపీఎన్, ఆనియన్ రూటింగ్ వంటి సాంకేతికతల ద్వారా ఇతర దేశాల ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్) అడ్రస్‌ల నుంచి అప్‌లోడ్ చేస్తున్నారని... వాటిని అడ్డుకోవడం కష్టమని అంటున్నారు. ఇక యూట్యూబ్‌లోని ఏదైనా వీడియోపై అభ్యంతరాలుంటే.. ఆ సంస్థను కోరితే తొలగిస్తుంది. కానీ వందలు, వేల సంఖ్యలో తప్పుడు వీడియోలు ఉన్నప్పుడు.. ఆటోమేటిగ్గా అడ్డుకునే అల్గారిథం (నియమాలతో కూడిన కోడ్) ఉండాలి. కానీ ఇందులో కొన్ని సమస్యలు ఉన్నాయని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు.

మ్యాన్యువల్ రివ్యూ లేకపోవడమే సమస్య: నల్లమోతు శ్రీధర్

ప్రముఖ తారలు, సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను రెండు విధాలుగా విశ్లేషించాల్సి ఉంటుందని సాంకేతిక నిపుణుడు నల్లమోతు శ్రీధర్ చెప్పారు. వాస్తవానికి యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలన్నింటికీ కమ్యూనిటీ గైడ్‌లైన్స్ ఉంటాయని తెలిపారు. అయితే ఇది అభ్యంతరకర కంటెంట్ గుర్తించేందుకే పరిమితమని.. సున్నితమైన అంశాలను యంత్ర మేధ విస్మరిస్తుందని వివరించారు. ఉదాహరణకు అశ్లీలానికి సంబంధించి యూట్యూబ్ కమ్యూనిటీ గైడ్‌లైన్స్ అల్గారిథం కొన్ని శరీరభాగాలపై ఫోకస్ చేస్తుందని.. ఆ భాగాలు తప్పించి మిగతా శరీరమంతా నగ్నంగా చూపించినా అడ్డుకోదని తెలిపారు. ఎవరైనా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా అదే యంత్ర మేధ మరోసారి వీడియోను పరిశీలించి, తమకేమీ తప్పు కనిపించడం లేదని పేర్కొంటుందని వివరించారు. ఇలాంటి సున్నితమైన అంశాల విషయానికి వచ్చినపుడు మ్యాన్యువల్ రివ్యూ జరిగితే సమస్య పరిష్కారం అవుతుందని స్పష్టం చేశారు. కానీ యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటివి మ్యాన్యువల్ రివ్యూకు అనుమతించడం లేదని తెలిపారు. ఎవరైనా వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీసేలా, మతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్న కంటెంట్‌ను యూట్యూబ్ అడ్డుకోగలదని చెప్పారు. అయితే ఈ కమ్యూనిటీ గైడ్‌లైన్స్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న నేరగాళ్లు.. ఆ ఒక్క అంశాన్ని వదిలేసి, మిగతా కంటెంట్ తాము అనుకున్నట్టుగా రూపొందిస్తున్నారని వెల్లడించారు. దీనిని అడ్డుకోవాలంటే కేంద్రమే కఠిన నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని శ్రీధర్ అభిప్రాయపడ్డారు.

అన్ని రంగాలకూ 'ఏఐ' సమస్య!

ప్రముఖ తారలే కాదు రాజకీయ నాయకులు, ఇతర రంగాలకు చెందినవారూ కృత్రిమ మేధ కంటెంట్ సమస్యను ఎదుర్కొంటున్నారని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు తెలిపారు. ఎవరైనా తమ అనుమతి లేకుండా ఫోటోలను, కంటెంట్‌ను రూపొందిస్తున్నారని ఫిర్యాదులు వచ్చినపుడు మాత్రమే తాము చర్యలు తీసుకోగలుగుతున్నామని చెప్పారు. ఇటీవల కొందరు సీఎం రేవంత్, ఆయన కుటుంబానికి పరువు నష్టం కలిగించేలా కొందరు ఏఐ చిత్రాలను రూపొందించారని, ఆ కుట్రను ఛేదించామని వెల్లడించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో ఏఐ చిత్రాలతో సమస్య ఎదురైందని గుర్తు చేశారు.

మహబూబ్‌నగర్‌లో 11న మెగా ఉద్యోగ మేళా

- ఇంటర్, ఐటిఐ, బీఎస్సీ, బీటెక్, ఫార్మసీ పట్టభద్రులకు చాన్స్

హైదరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్, ఐటిఐతోపాటు గత మూడేళ్లలో ఉత్తీర్ణులైన డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ పట్టభద్రులకు ఈనెల 11న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యామండలి తెలిపింది. బల్క్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిడిఎంఏఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మహబూబ్‌నగర్‌లోని పాలమూరు విశ్వవిద్యాలయంలో జరుగుతుందని చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కంపెనీలు ఇందులో పాల్గొంటాయని తెలిపారు. 2021-22 నుంచి ఈ ఏడాది వరకు ఇంటర్, ఐటిఐ, బీఎస్సీ, ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (మైక్రో బయాలజీ), బీటెక్ (మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్), బీఫామ్, ఎంఫామ్ పురుష పట్టభద్రులు ఇందులో పాల్గొనేందుకు అర్హులు అని వివరించారు. ఆసక్తి కలవారు ఈనెల 8లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అర్జున్ కుమార్ 98494 45877ను సంప్రదించాలని కోరారు.

ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంను కలిసిన డీజీపీ

హైదరాబాద్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను డీజీపీ శివధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల డీజీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నూతన డీజీపీకి భట్టివిక్రమార్క అభినందనలు తెలిపారు.

లండన్‌లో గుండెపోటుతో తెలంగాణ యువకుడి మృతి



మహేందర్ రెడ్డి

మేడిపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన జగిత్యాల జిల్లాకు చెందిన ఎన్ను మహేందర్ రెడ్డి (25) అనే యువకుడు శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. మహేందర్ స్వస్థలం మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామం. రెండేళ్ల క్రితం ఎంఎస్ చదవడానికి లండన్ వెళ్లాడు. శుక్రవారం అక్కడ ఉన్న స్నేహితులను కలవడానికి వారి రూమ్‌కు వెళ్లాడు. వారు లేకపోవడంతో కొద్దిసేపు రూమ్‌లో పడుకున్నాడు. స్నేహితులు వచ్చి చూసేసరికి మహేందర్ మృతిచెంది ఉన్నాడు. దాంతో వారు మహేందర్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మహేందర్ మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడారు.

అమెరికాలో దుండగుల కాల్పుల్లో.. హైదరాబాద్ యువకుడి మృతి

- బీడీఎస్ చేసి ఉన్నత చదువులకు డాలస్ వెళ్లిన చంద్రశేఖర్




పోలే చంద్రశేఖర్

వనస్థలిపురం/హైదరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసి.. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న హైదరాబాద్‌కు చెందిన యువకుడు అక్కడ దుండగుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయాడు. అతను ఉన్నతస్థాయికి వెళతాడని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లి.. తన కుమారుడు దుండగుల తూటాలకు బలైపోయాడని తెలిసి తల్లడిల్లిపోతోంది. బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేజ్-2కు చెందిన పోలే చంద్రశేఖర్ (27) కొత్తపేట పాణీనీయా డెంటల్ కళాశాలలో బీడీఎస్ పూర్తి చేశాడు. ఎంఎస్ చేసేందుకు 2023లో అమెరికాలోని డల్లాస్‌కు వెళ్లాడు. ఆరు నెలల క్రితం అతని చదువు పూర్తయింది. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాడు. కొంతకాలంగా అక్కడ ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పార్ట్-టైం ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌పై దాడి చేసి.. విధుల్లో ఉన్న చంద్రశేఖర్‌ను కాల్చి చంపారు. అతని స్నేహితులు శనివారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చంద్రశేఖర్ మరణవార్త విని తల్లి సునీత, ఇద్దరు సోదరులు శోకసంద్రంలో మునిగిపోయారు. అతని తండ్రి జగన్ మోహన్ నాలుగేళ్ల క్రితం మృతిచెందారు. అమెరికాలో దుండగల కాల్పుల్లో చంద్రశేఖర్ మృతిచెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అతని భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని 'ఎక్స్' వేదికగా తెలిపారు. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్థానిక నాయకులు పరామర్శించారు. బంగారు భవిష్యత్తు ఉన్న చంద్రశేఖర్ మృతి కలచివేస్తోందని, అమెరికాలోని గన్ కల్చర్ తరచూ భారతీయులను బలి తీసుకుంటోందని మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తల్లి సునీత, సోదరుడు రాజ్ కిరణ్‌లతో ఫోన్లో మాట్లాడి ఓదార్చారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని హైదరాబాద్ తీసుకొచ్చేందుకు ప్రయత్నాలను ప్రారంభించినట్లు తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ప్రశ్నిస్తున్న గర్ల్ ఫ్రెండ్



రశ్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ద గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. అందరినీ ఆకట్టుకొనే విధంగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రేమకథా చిత్రాన్ని నవంబరు 7న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు శనివారం ప్రకటించారు. తెలుగు సహా తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 'ప్రేమికులుగా మనం ఒకే టైపా.. ఒకరికొకరం ఎంత వరకూ కరెక్ట్.. రకరకాల కారణాలతో కలసే ప్రేమికుల్లో ఎంతమందికి ఈ క్లారిటీ ఉంటుంది.. మీకు ఉందా.. అయితే నవంబరు 7న థియేటర్స్‌కు రండి.. డిస్కస్ చేద్దాం' అంటూ రశ్మిక, దీక్షిత్ ఆహ్వానం పలుకుతూ వచ్చిన రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ వీడియా ఆకట్టుకుంటోంది.

గోపీచంద్ మలినేనితో ఎన్‌బీకే 111



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్రం ఖరారైంది. గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ఎన్‌బీకే 111' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వీరసింహారెడ్డి' చిత్రం ఘన విజయాన్ని అందుకొంది. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలార్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించిన మేకర్స్ ఈ నెల 24న ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. చారిత్రక నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. బాలకృష్ణ ఇప్పటివరకూ పోషించని సరికొత్త పాత్రను ఈ సినిమాలో పోషించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

మహాదేవ నాయుడు పాత్రలో



నటుడు శివాజీ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రేమకు నమస్కారం'. షణ్ముఖ్ జస్వంత్, ఉల్క గుప్తా జంటగా నటిస్తున్నారు. భీమశంకర్ దర్శకత్వంలో అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మహాదేవనాయుడుగా శివాజీ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. తాజాగా చిత్ర బృందం ఆయన పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్, యువతకు మంచి సందేశంతో పాటు వినోదం పంచుతుంది' అని చెప్పారు.

లిటిల్ హార్ట్స్ తరహాలో మిత్రమండలి



ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్ జంటగా నటించిన చిత్రం 'మిత్రమండలి'. వెన్నెల కిశోర్, వీటీవీ గణేశ్ కీలకపాత్రలు పోషించారు. బీవీ వర్క్స్ బేనర్‌తో కలసి బన్నీ వాసు సమర్పిస్తున్నారు. కల్యాణ్ కే, భాను ప్రతాప్, డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విడుదలవుతోంది. చిత్రబృందం విజయవాడలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో బన్నీ వాసు మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' చిత్రం తరహాలోనే ఈ 'మిత్రమండలి' చిత్రం కూడా ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది. ప్రేక్షకులకు చక్కని వినోదం పంచాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాం అన్నారు. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది, ఆద్యంతం నవ్వులు పంచుతుంది అని నిర్మాతలు తెలిపారు. ఇదొక క్లీన్ ఎంటర్‌టైనర్ అని ప్రియదర్శి చెప్పారు.

అశ్లీలతకు తావులేని చిత్రం

- రక్షిత్ అట్లూరి



రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన తెరకెక్కించిన చిత్రం 'శశివదనే'. అహితేజ బెల్లంకొండ, అభిలాశ్ రెడ్డి గోడ నిర్మించారు. సినిమా ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ 'మునుపెన్నడూ చూడని విధంగా తండ్రీ కొడుకుల భావోద్వేగాలను దర్శకుడు చక్కగా ఆవిష్కరించారు. గోదావరి జిల్లాల్ని అద్భుతంగా చూపించారు. అశ్లీలతకు తావులేకుండా నిజాయితీగా ఓ మంచి సినిమా చేశాం' అని అన్నారు. చిత్ర దర్శకుడు సాయి మోహన్ మాట్లాడుతూ 'నేను ఎంత అందంగా కథ రాసుకున్నానో..అంతకు మించి అనేలా కోమలి నటించారు' అని అన్నారు. చిత్ర నిర్మాత అహితేజ మాట్లాడుతూ 'ఈ మూవీ ఏ ఒక్కరినీ నిరాశ పర్చదు' అని అన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ కోమలి ప్రసాద్, కెమెరామెన్ సాయికుమార్, నటి అంబికా మాట్లాడారు.

అందర్నీ అలరించేలా..



నూతన నటుడు పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా వీరు ఉలవల తెరకెక్కిస్తున్న చిత్రం 'పురుష'. ఈ కామెడీ చిత్రాన్ని బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. వెన్నెల కిశోర్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తైంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించేలా రూపొందుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతోందని మేకర్స్ తెలిపారు.

'ఎక్స్' వ్యాఖ్యలపై దుమారం.. రాహుల్ రామకృష్ణ వివరణ



'మనం చాలా భయంకరమైన పరిస్థితుల్లో బతుకుతున్నాం. డంబెల్ డోర్ వచ్చి ఈ పరిస్థితులను చక్కదిద్దాలి' అంటూ నటుడు రాహుల్ రామకృష్ణ ఎక్స్ వేదికగా చేసిన కామెంట్స్ సంచలనం సృష్టించాయి. బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్‌ను ట్యాగ్ చేయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అంతటితో ఆగకుండా 'హైదరాబాద్ మునిగిపోయింది. హామీలన్నీ విఫలమయ్యాయి. వీటన్నింటినీ చక్కదిద్దడానికి ప్రజలు మిమ్మల్ని తిరిగి పిలుస్తున్నారు' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ట్యాగ్ చేస్తూ రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేని నటుడు ఇలా మరో పోస్ట్ పెట్టడం చర్చనీయాంశమైంది. తన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో రాహుల్ రామకృష్ణ దిగి వచ్చి వెంటనే తన ఎక్స్ ఖాతాను తొలగించారు. అయినా సోషల్ మీడియాలో వివాదం సద్దుమణగక పోవడంతో శనివారం మళ్లీ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ఇకపై ట్విట్టర్ యాక్టివిజానికి దూరంగా ఉంటానని, పూర్తిగా సినిమాలపైనే దృష్టిపెడతానని స్పష్టం చేశారు.

సింగరేణి గనుల నేపథ్యంలో..



సాగర్ కథానాయకుడిగా 'జార్జిరెడ్డి' దర్శకుడు జీవన్‌రెడ్డి ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. సింగరేణి గనుల నేపథ్యంలో పాన్ ఇండియా చిత్రంగా ప్లాన్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రం భారతదేశ సినీ ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతని ఇవ్వనుందని పేర్కొన్నారు. నవంబరులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నామని, చిత్రానికి సంబంధించిన ఇతర వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. కాగా, ముఖ్య పాత్రలో మరో స్టార్ హీరోని తీసుకోబోతున్నట్లు సమాచారం. తెలుగు, కన్నడ, తమిళ, హిందీ భాషల్లోని ప్రముఖ నటులు ఈ ప్రాజెక్టులో భాగం కానున్నట్లు తెలిసింది.

శాంతారామ్ సతీమణి కన్నుమూత



ప్రఖ్యాత దర్శకుడు వి.శాంతారామ్ సతీమణి, అలనాటి ప్రముఖ నటి సంధ్య(94) వృద్ధాప్య సమస్యలతో మరణించారు. శాంతారామ్‌కు సంధ్య మూడో భార్య. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆమె శుక్రవారం రాత్రి ముంబైలోని రాజ్‌కమల్ స్టూడియోస్‌లో తుదిశ్వాస విడిచారు. శనివారం ఉదయం శివాజీ పార్క్‌లో కుటుంబ సభ్యులు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. 1950, 60లలో పలు హిందీ, మరాఠీ చిత్రాల్లో సంధ్య నటించారు. 'దో ఆంఖే బారా హాథ్', 'నవ్‌రంగ్', 'జనక్ జనక్ పాయల్ బాజే', 'పింజ్రా' సినిమాలు ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి.

ఈరోజూ మనదే కావాలి!

భారత్, పాక్ పోరు నేడు

మహిళల వన్డే ప్రపంచకప్

మ. 3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో


పాక్ కెప్టెన్ సనా


భారత సారథి హర్మన్‌ప్రీత్

కొలంబో: మరో ఆదివారం..వరుసగా నాలుగోది. మళ్లీ చిరకాల ప్రత్యర్థుల సమరం. ఆసియా కప్‌లో భాగంగా గత మూడు ఆదివారాలు భారత్-పాకిస్థాన్ పురుషుల జట్లు తలపడితే ఈసారి మహిళల వంతు వచ్చింది. వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో భారత్-పాకిస్థాన్ జట్లు ఢీకొననున్నాయి. అయితే పురుషుల క్రికెట్‌లో మాదిరే.. ఈ పోరులో భారత మహిళలే తిరుగులేని ఫేవరెట్లుగా బరిలో దిగుతున్నారు. రికార్డుల పరంగా చూసినా..ఈ మ్యాచ్ ఫలితమేమిటో ఇట్టే అర్థమవుతుంది. మహిళల అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అన్ని ఫార్మాట్లలో కలిపి భారత్-పాక్ జట్లు 27సార్లు తలపడ్డాయి. కానీ 24-3తో భారత మహిళలదే తిరుగులేని ఆధిపత్యం. పాక్ నెగ్గిన మూడు మ్యాచ్‌లు కూడా టీ20లు. వన్డేల్లో అయితే ప్రత్యర్థిపై భారత్ 100 శాతం రికార్డు కలిగి ఉండడం విశేషం. రెండు జట్లు 11 సార్లు ఢీకొంటే అన్నిసార్లు మన జట్టే గెలిచింది. ఈ వన్డే ప్రపంచ కప్‌లో రెండు జట్లు తమ ప్రస్థానాన్ని పరస్పర భిన్నంగా మొదలుపెట్టాయి. భారత్ తొలి మ్యాచ్‌లో 59 రన్స్‌తో శ్రీలంకపై నెగ్గింది. మరోవైపు ఫాతిమా సనా సారథ్యంలోని పాక్ 7 వికెట్లతో బంగ్లా చేతిలో ఓడింది. బంగ్లా పేస్, స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం పాక్ బ్యాటర్ల వల్ల కాకపోవడం గమనార్హం.

శ్రీలంక-ఆస్ట్రేలియా మ్యాచ్ రద్దు: భారీ వర్షంతో శ్రీలంక-ఆస్ట్రేలియా జట్ల నడుమ శనివారం కొలంబోలో జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. దాంతో ఇరుజట్లకు చెరో పాయింట్ లభించింది.

ఏక్తాకు రజతం

- ప్రవీణ్‌కు కాంస్యం
- ప్రపంచ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో శనివారం.. భారత అథ్లెట్లు ఏక్తా భయాన్ రజతం, ప్రవీణ్ కుమార్, సోమన్ రాణా కాంస్య పతకాలు సాధించారు. మహిళల ఎఫ్51 క్లబ్ త్రోలో 19.80 మీ. దూరంతో ఏక్తా రజత పతకం దక్కించుకుంది. పురుషుల హైజంప్ టీ64లో ప్రవీణ్ రెండు మీటర్ల దూరంతో కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల షాట్‌పుట్ ఎఫ్57 విభాగంలో సోమన్ 14.69 మీ.తో కాంస్యం గెలుపొందాడు. ఇప్పటికి భారత్ 6 స్వర్ణాలు, 7 రజతాలు, 5 కాంస్యాలు సహా మొత్తం 18 పతకాలతో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఆదివారం పోటీలకు చివరిరోజు.

ఆసీస్‌దే టీ20 సిరీస్

మౌంట్ మాంగనూయ్: ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ (52 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 103 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగాడు. దీంతో శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో ఆసీస్ 3 వికెట్లతో నెగ్గింది. సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. రెండో మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. ముందుగా కివీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది. ఓపెనర్ సైఫర్ట్ (48) అత్యధిక స్కోరర్. ఎబాట్‌కు మూడు.. బార్లెట్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పేసర్ జేమ్స్ నీషమ్ (4/26) ధాటికి ఆసీస్ తడబడింది. అయితే మార్ష్ అంతా తానై పోరాడడంతో ఆసీస్ 18 ఓవర్లలో 160/7 స్కోరు చేసి గట్టెక్కింది. డఫీకి 2 వికెట్లు లభించాయి.

విదర్భకు ఆధిక్యం

ఇరానీ కప్

నాగ్‌పూర్: రెస్టాఫ్ ఇండియాతో జరుగుతున్న ఇరానీ కప్‌లో రంజీ విజేత విదర్భకు 360 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. శనివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌లో ఈ జట్టు 232 పరుగులకు ఆలౌటైంది. అనంతరం భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా ఆట ముగిసేసరికి 30/2 స్కోరుతో ఉంది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 342, రెస్టాఫ్ ఇండియా 214 రన్స్ చేశాయి.

వన్డేల్లోనూ గిల్ శకం

సారథ్య బాధ్యతలు అప్పగింత



నాయకుడిగా రోహిత్‌కు ఉద్వాసన

జట్టులో ఆటగాడిగా కొనసాగింపు

- కోహ్లీ కూడా వచ్చేశాడు
- వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్
- బుమ్రాకు విశ్రాంతి

ఆస్ట్రేలియా పర్యటనకు టీమిండియా



అహ్మదాబాద్: భారత క్రికెట్ జట్టులో ఇక నయా శకం ఆరంభం కాబోతోంది. వన్డే ఫార్మాట్‌కు కూడా కొత్త కెప్టెన్ వచ్చేశాడు. ఆస్ట్రేలియాలో పర్యటన కోసం శనివారం భారత వన్డే, టీ20 జట్లను సెలెక్టర్లు ప్రకటించారు. ఇందులో ఊహించని రీతిలో వన్డే జట్టు పగ్గాలు సైతం యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కే దక్కాయి దీంతో సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న వెటరన్ రోహిత్ శర్మ ఆటగాడిగా మాత్రమే కొనసాగనున్నాడు. వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేశారు. 2027లో వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు కెప్టెన్సీ మార్పు చేశారు. ఈ ఏడాదే రోహిత్ నుంచి గిల్ టెస్టు బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈనెల 19 నుంచి 25 వరకు సిడ్నీ, అడిలైడ్, మెల్‌బోర్న్‌లలో 3 వన్డేలు జరుగుతాయి. అయితే రోహిత్‌తోపాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా జట్టుతో కలువనున్నాడు. ఈ ద్వయం గత మార్చిలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో చివరిసారి ఆడారు. ఇప్పటివరకు 55 వన్డేలు ఆడిన గిల్.. 8 సెంచరీలతో 2,775 పరుగులు సాధించాడు. మరోవైపు సీనియర్ పేసర్ బుమ్రాకు వన్డేల్లో విశ్రాంతినిచ్చారు. కానీ అక్షర్, కుల్దీప్, సుందర్‌ల రూపంలో ముగ్గురు స్పిన్నర్లను ఎంపిక చేసిన సెలెక్టర్లు ఈసారి ఆల్‌రౌండర్ జడేజాపై వేటు వేశారు. జట్టు సమతూకంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు, ఇద్దరు ఎడమచేతి స్పిన్నర్లు అవసరం లేదని భావించినట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. వన్డే జట్టు ప్రణాళికల్లో మాత్రం జడ్డూ ఉంటాడని తేల్చాడు. పేస్ విభాగంలో సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, హర్షిత్ ఉన్నారు. ఇక టీ20ల్లో నిలకడ ప్రదర్శిస్తున్న జైస్వాల్‌కు వన్డేల్లో చోటు కల్పించారు. కెరీర్‌లో అతను ఒక్క వన్డేనే ఆడాడు.

హార్దిక్ స్థానంలో నితీశ్: ఆసియాకప్ టోర్నీలో భారత్‌ను విజేతగా నిలిపిన కెప్టెన్ సూర్యకుమార్‌కే టీ20 పగ్గాలు అప్పగించారు. బ్యాటర్‌గా అతను విఫలమైనా,సెలెక్టర్లు అతడి నాయకత్వ ప్రతిభపై నమ్మకముంచారు. ఆసీస్‌తో ఈనెల 29 నుంచి నవంబరు 8 వరకు ఐదు టీ20ల సిరీస్ జరుగుతుంది. దాదాపుగా ఆసియాకప్‌లో పాల్గొన్న జట్టునే ఆసీస్ పర్యటనకు ఎంపిక చేశారు. అయితే గాయంతో జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా స్థానంలో ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్‌ను తీసుకున్నారు. నితీశ్ అటు వన్డే జట్టులోనూ చోటు దక్కించుకోవడం విశేషం. ఇక అదనపు స్పిన్నర్‌గా వాషింగ్టన్ సుందర్ కూడా జట్టులోకి వచ్చాడు.

వన్డే జట్టు

గిల్ (కెప్టెన్), రోహిత్, కోహ్లీ, శ్రేయాస్ (వైస్ కెప్టెన్), జైస్వాల్, అక్షర్, రాహుల్, నితీశ్, సుందర్, కుల్దీప్, హర్షిత్, సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, జురెల్.

టీ20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, గిల్ (వైస్ కెప్టెన్), తిలక్, నితీశ్ కుమార్, దూబే, అక్షర్, జితేశ్, శాంసన్, వరుణ్, బుమ్రా, అర్ష్‌దీప్, కుల్దీప్, హర్షిత్, రింకూ సింగ్, సుందర్.



ఎందుకిలా..?

టెస్టు జట్టుతో పాటు వన్డే పగ్గాలు కూడా రోహిత్ నుంచి చేజారాయి. ఈ ఏడాది మార్చిలో అతని ఆధ్వర్యంలోనే జట్టు చాంపియన్స్ ట్రోఫీ నెగ్గింది. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌ను కూడా అందించాడు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో జట్టును ఫైనల్ చేర్చాడు. అయినా ఈ అనుభవశాలిని కాదని, వెస్టిండీస్‌పై తొలి టెస్టులో భారత్ గెలిచిన గంటలోపే వన్డే కొత్త కెప్టెన్ పేరును సెలెక్టర్లు ప్రకటించారు. రోహిత్ కెప్టెన్‌గా 56 వన్డేల్లో 42 మ్యాచ్‌ల్లో జట్టును గెలిపించాడు. సారథిగా అతడి విజయాలశాతం 76 కావడం విశేషం. కానీ ఇంగ్లండ్ పర్యటనలో గిల్ జట్టును నడిపించిన తీరు సెలెక్టర్లను ఆకట్టుకుంది. గిల్ సారథిగానే గాకుండా బ్యాటర్‌గానూ విజృంభించాడు. ఇప్పటికే రోహిత్ టెస్టు, టీ20లకు వీడ్కోలు పలికి వన్డేలకే పరిమితమయ్యాడు. ఇక, మూడు ఫార్మాట్లకు ముగ్గురు కెప్టెన్లను నియమించడం ఆచరణయోగ్యం కాదని బీసీసీఐ భావిస్తోందట. అందుకే 2027 వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈలోపు కెప్టెన్‌గా గిల్‌కు తగినంత సమయం ఇచ్చి విశ్వకప్‌నకు సిద్ధం చేయాలని బోర్డు అనుకుంటోంది. మరోవైపు నాయకత్వ మార్పు గురించి రోహిత్‌తో ముందుగానే చర్చించామని చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మూడ్రోజుల్లోనే ముగించారు

- తొలి టెస్టులో భారత్ ఇన్నింగ్స్ విజయం
- విండీస్ 146 ఆలౌట్
- తిప్పేసిన జడేజా



10

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాధించిన జడేజా.. అత్యధికంగా 10సార్లు ఈ అవార్డును అందుకొన్న కోహ్లీ, అశ్విన్, కుంబ్లే సరసన నిలిచాడు.

అహ్మదాబాద్: సొంతగడ్డపై టీమిండియా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. రవీంద్ర జడేజా (104 నాటౌట్, 4/54) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరో రెండు రోజుల ఆట మిగిలుండగానే నెగ్గిన భారత్ రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. రెండో, ఆఖరి టెస్ట్ ఈ నెల 10 నుంచి ఢిల్లీలో జరగనుంది. ఓవర్‌నైట్ స్కోరు 448/5 వద్ద భారత్ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. విండీస్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు (162)కు 286 రన్స్ ఆధిక్యాన్ని నమోదు చేసింది. ఆటకు మూడో రోజైన శనివారం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విండీస్ 146 పరుగులకే కుప్పకూలింది. అథనజె (38) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జడేజా 4, సిరాజ్ 3, కుల్దీప్ 2 వికెట్లు తీశారు.

పేకమేడలా..: తొలి సెషన్‌లో పిచ్ బౌలర్లకు సహకరిస్తున్న వేళ విండీస్ కనీస పోరాటం కూడా చేయలేదు. సిరాజ్ బౌలింగ్‌లో నితీశ్ అందుకొన్న క్యాచ్‌తో ఓపెనర్ చందర్‌పాల్ (8) పెవిలియన్ చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన అథనజె వికెట్‌ను అంటిపెట్టుకొన్నా.. మరో ఓపెనర్ క్యాంప్‌బెల్ (14), బ్రండన్ కింగ్ (5)ను జడ్డూ వెనక్కిపంపాడు. కెప్టెన్ ఛేజ్ (1)ను కుల్దీప్.. హోప్ (1)ను జడేజా అవుట్ చేయడంతో.. లంచ్ సమయానికి విండీస్ 66/5తో ఓటమి దిశగా సాగింది. తిరిగి వచ్చాక అథనజెను సుందర్.. గ్రీవ్స్ (25), వారికన్ (0)ను సిరాజ్ అవుట్ చేయడంతో విండీస్ ఓటమి ఖరారైంది. జోహాన్ (14)ను జడేజా.. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన సీల్స్ (22)ను కుల్దీప్ పెవిలియన్ చేర్చారు. దీంతో రెండు సెషన్లు కూడా పూర్తి కాకుండానే కరీబియన్ల కథ ముగిసింది.

స్కోరుబోర్డు

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్: 162 ఆలౌట్; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 448/5 డిక్లేర్డ్;

వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 14, చందర్‌పాల్ (సి) నితీశ్ (బి) సిరాజ్ 8, అథనజె (సి అండ్ బి) సుందర్ 38, కింగ్ (సి) రాహుల్ (బి) జడేజా 5, ఛేజ్ (బి) కుల్దీప్ 1, హోప్ (సి) జైస్వాల్ (బి) జడేజా 1, గ్రీవ్స్ (ఎల్బీ) సిరాజ్ 25, పియర్రీ (నాటౌట్) 13, వారికన్ (సి) గిల్ (బి) సిరాజ్ 0, లేన్ (సి) సిరాజ్ (బి) జడేజా 14, సీల్స్ (సి అండ్ బి) కుల్దీప్ 22, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 45.1 ఓవర్లలో 146 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-12, 2-24, 3-34, 4-35, 5-46, 6-92, 7-98, 8-98, 9-122, 10-146; **బౌలింగ్:** బుమ్రా 6-1-16-0, సిరాజ్ 11-2-31-3, జడేజా 13-3-54-4, కుల్దీప్ 8.1-3-23-2, సుందర్ 7-1-18-1.

లాభాలకు భరోసా

పసిడిలో పెట్టుబడి..



బులియన్ మార్కెట్ పరుగెడుతోంది. బంగారం, వెండి ధరలు చుక్కలంటుతున్నాయి. ఈ రెండులోహాల ధరలు ఇప్పటికే రికార్డుల మీద రికార్డులు బ్రేక్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం వీటిని ఎంచుకోవచ్చా...ఎంచుకుంటే ఎలా కొనాలి? పన్నుపోటు ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

బంగారం, వెండి ధరలు రేసుగుర్రాల్లా పరుగెడుతున్నాయి. ఈ రెండు లోహాల ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిలకు చేరాయి. ప్రస్తుతం పది గ్రాముల మేలిమి బంగారం రూ.1.2 లక్షలు, కిలో వెండి రూ.1.52 లక్షలకు చేరి జీవితకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు చూసినా ఈ రెండు లోహాల ధర 50 శాతానికి పైగా పెరిగింది. దీంతో ఆభరణాల తయారీ కంటే.. పెట్టుబడి లాభాల కోసం కొనే వారి సంఖ్య పెరిగిపోతోంది. సురక్షిత పెట్టుబడులుగా వీటికి ఉన్న పేరు మరింత మంది ఇన్వెస్టర్లను వాటి వైపు ఆకర్షిస్తోంది. చివరికి భారత్, చైనాతో పాటు అనేక దేశాల కేంద్ర బ్యాంకులు కూడా తమ ఫారెక్స్ నిల్వల నిర్వహణలో భాగంగా పెద్దఎత్తున పసిడి కొనుగోలు చేస్తున్నాయి.

దీర్ఘకాలిక రాబడులు

గత రెండు దశాబ్దాలుగా చూసినా బంగారం, వెండి పెట్టుబడులు మదుపరులకు మంచి లాభాలే పంచాయి. గత 20 సంవత్సరాల్లో పసిడి ధర ఏటా సగటున 14.9% చొప్పున పెరిగితే, వెండి ధర 13.01% చొప్పున పెరిగింది. ఇదే సమయంలో నిఫ్టీ-50 సూచీ 14.6%, రియల్ ఎస్టేట్ 7.7% చొప్పున పెరిగాయి. నిఫ్టీ-50 దీర్ఘకాలిక రాబడులు గత 20 ఏళ్లలో దాదాపుగా పసిడి, వెండి స్థాయిల్లోనే ఉన్నాయి. అయినా మదుపరులు ఈ కాలంలో అనేక ఆటుపోట్లు, ఆందోళన ఎదుర్కొన్నారు. కొవిడ్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలతో నెలకొన్న పరిస్థితులే ఇందుకు ఉదాహరణ. బులియన్ మార్కెట్ దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు మాత్రం దాదాపుగా ఈ టెన్షన్లు లేవనే చెప్పాలి.

పెట్టుబడి మార్గాలు

ప్రస్తుతం బంగారం, వెండిలో మదుపు చేయడానికి అనేక మార్గాలున్నాయి. అవేమిటంటే..

భౌతికంగా కొనుగోలు

ఇంట్లో భద్రతకు ఢోకా లేదనుకుంటే భౌతికంగా బంగారం కొని నగనట్రా లేదా నాణేలు, బార్స్ రూపంలో భద్రంగా దాచుకోవచ్చు. కాకపోతే ఇందులో రిస్క్ ఎక్కువ. ఎప్పుడు ఏ దొంగోడు కన్నమేసి దోచుకుపోతాడో తెలియదు. బీమా చేయించుకుని లేదా బ్యాంకు లాకర్లలో పెట్టి వీటిని కాపాడుకోవడం ఉత్తమం.

పన్ను పోటు

కొన్న బంగారం, వెండిని ఎంత కాలం ఉంచుకుని అమ్మాలనే విషయం ఆధారంగా పన్నుపోటు ఉంటుంది. రెండేళ్లలోపు అమ్మితే వచ్చే లాభాలను స్వల్పకాలిక మూలధన లాభాలుగా (ఎస్‌టీసీజీటీ) పరిగణిస్తారు. ఈ లాభాన్ని ఆయా వ్యక్తుల ఆదాయానికి జోడించి, వారి శ్లాబు ప్రకారం ఆదాయ పన్ను విధిస్తారు. అదే రెండేళ్ల తర్వాత అమ్మితే వచ్చే లాభాలను దీర్ఘకాలిక మూలధన లాభాలుగా (ఎల్‌టీసీజీటీ) పరిగణిస్తారు. గత ఏడాది జూలై 23 నుంచి ఈ లాభాలపై ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా 12.5% పన్ను విధిస్తున్నారు. గోల్డ్ డిపాజిట్ సర్టిఫికెట్లు, సావరిన్ గోల్డ్ బాండ్స్‌పై వచ్చే లాభాలపై మాత్రం ఎలాంటి పన్నుపోటు ఉండదు.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

ఇటీవల మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) నిర్వహించే గోల్డ్ ఈటీఎఫ్‌లకు మదుపరుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మదుపరుల నుంచి సేకరించే ఈ నిధులను ఎంఎఫ్‌లు 99.5% స్వచ్ఛత ఉండే బంగారంలో పెట్టుబడి పెడతాయి. మదుపరులు వీటి నెట్ అసెట్ వాల్యూను (ఎన్ఏవీ) ఎప్పటికప్పుడు షేర్ల ధరల్లా చెక్ చేసుకోవచ్చు. మార్కెట్ రేటుకు అనుగుణంగా వీటి ఎన్ఏవీ ఏ రోజుకు ఆ రోజు మారుతుంటుంది. భౌతిక బంగారాన్ని కొని ఇంట్లో దాచుకోవడం సమస్య అనుకునే మదుపరులకు గోల్డ్ ఈటీఎఫ్‌లు అత్యుత్తమ పెట్టుబడి సాధనం.

- క్రమానుగత పెట్టుబడి పద్ధతిలోనూ (సిప్) వీటిల్లో మదుపు చేయవచ్చు. కంపెనీల షేర్లలా ఎప్పుడు డబ్బులు అవసరమైతే అప్పుడు అమ్ముకుని నగదు చేసుకోవచ్చు.

సావరిన్ గోల్డ్ బాండ్స్

నిన్న మొన్నటి వరకు ఫిజికల్ గోల్డ్ వద్దనుకునే వారి కోసం గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ (జీఎంఎస్), సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) అందుబాటులో ఉండేవి. ఇటీవలే ప్రభుత్వం వీటిని నిలిపివేసింది. అయినా సెకండరీ మార్కెట్లో ఎస్‌జీబీలు ఇంకా దొరుకుతున్నాయి.

పెట్టుబడి ఎందుకంటే?

దీర్ఘకాలికంగా చూస్తే పసిడి, వెండి పెట్టుబడులు ఈక్విటీ మార్కెట్ లాభాలకు ప్రత్యామ్నాయం కాదు. బుల్ మార్కెట్లో బులియన్ మార్కెట్ నీరసిస్తే.. ఈక్విటీ మార్కెట్లు రేసుగుర్రాల్లా పరుగెడతాయి. అయినా ప్రతి మదుపరి తన పెట్టుబడుల్లో కనీసం 15 నుంచి 20 శాతమైనా బులియన్ మార్కెట్లో ఉంచుకోవడం మంచిది. ఆర్థిక ఆటుపోట్లు, అంతర్జాతీయ ఉద్రిక్తతల సమయంలో పెట్టుబడుల విలువ తగ్గిపోకుండా ఈ రెండూ అడ్డుకుంటాయి. ఏ మాత్రం రిస్క్ తీసుకోలేని మదుపరులైతే బ్యాంకు డిపాజిట్లు, రుణపత్రాల కంటే బంగారం లేదా వెండిని ఎంచుకోవడమే మంచిది. పెట్టుబడులకు పెద్దగా ఢోకా లేకుండానే ఈ రెండు లోహాలు దీర్ఘకాలంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రుణపత్రాల కంటే ఎక్కువ రాబడులు ఇస్తాయి. గత రెండు దశాబ్దాల అనుభవమూ ఇదే చెబుతోంది.

ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్

కొన్ని యాప్‌లు, సంస్థలు అందించే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ (ఈజీఆర్) పైనా మదుపరులు దృష్టి పెట్టవచ్చు. అయితే నమ్మకమైన, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి ఉన్న యాప్‌ల నుంచి మాత్రమే ఈ కొనుగోళ్లు చేయడం మంచిది. నగదు అవసరమనుకుంటే వీటిని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో టీ+1 పద్ధతిలో అమ్మి సొమ్ము చేసుకోవచ్చు.

స్వచ్ఛత

బంగారం లేదా వెండిలో పెట్టుబడి పెట్టేటపుడు వాటి స్వచ్ఛత అత్యంత ముఖ్యం. హాల్‌మార్కింగ్ వచ్చినా, ఇంకా చాలా మంది బులియన్ వ్యాపారులు తక్కువ స్వచ్ఛత ఉన్న బంగారం, వెండిని అత్యంత స్వచ్ఛమైనవిగా ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. పెద్దపెద్ద మాల్స్‌లో ఈ మోసాలు లేకపోయినా, చిన్న చిన్న నగల దుకాణాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. పెట్టుబడి లాభాల కోసమే కొనాలనుకుంటే హాల్‌మార్క్ ఉన్న 99.9 శాతం స్వచ్ఛత ఉండే బంగారం, వెండి మాత్రమే కొనుగోలు చేయటం మంచిది.

బిజినెస్ ప్లస్

రేపటి నుంచే టాటా క్యాపిటల్ ఐపీఓ

షేరు ధర శ్రేణి రూ.310-326

ముంబై: టాటా గ్రూప్‌లోని టాటా క్యాపిటల్ నుంచి సోమవారం అతి పెద్ద ఐపీఓ మార్కెట్‌కు వస్తోంది. ఈ ఇష్యూలో ఒక్కో షేరును రూ.310-326 ధర శ్రేణిలో విక్రయిస్తారు. దీని ద్వారా కంపెనీ రూ.15,512 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. మన దేశానికి చెందిన ఏ ఇతర ఎన్‌బీఎఫ్‌సీ ఇప్పటివరకు ఇంత పెద్ద ఐపీఓ జారీ చేయలేదు. యాంకర్ ఇన్వెస్టర్ల ద్వారా కంపెనీ ఇప్పటికే రూ.4,642 కోట్లు సమీకరించింది. గ్రేమార్కెట్‌లో ప్రస్తుతం టాటా క్యాపిటల్ షేర్లు ఎగువ ధర కన్నా రూ.24 నుంచి రూ.26 ప్రీమియంతో ట్రేడవుతున్నాయి.

రూ.1.98 లక్షల కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు ఔట్

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారీ మొత్తంలో నిధులు తరలించుకుపోతున్నారు. ఈ సంస్థలు సంవత్సరం ఇప్పటి వరకు రూ.1.98 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఇందులో గత నెల అమ్మకాలే రూ.27,163 కోట్ల వరకు ఉన్నాయి. గత 21 నెలలుగా చూసినా ఎఫ్‌పీఐలు స్టాక్ మార్కెట్ నుంచి రూ.3.19 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నట్టయింది. భారత కంపెనీల షేర్ల వాల్యుయేషన్లు ఎక్కువగా ఉండడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ సుంకాల పోటు, కేటాయింపుల ప్రాధాన్యత మారడం ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	520
వరంగల్	502	గోదావరి	520
చిత్తూరు	528	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	124
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	119
కర్నూలు	115	నెల్లూరు	124
విశాఖపట్నం	127	అనంతపురం	124
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,19,400 ▲	1,09,450 ▲	1,64,000 ▲
విజయవాడ	1,21,300 ▲	1,16,000 ▲	1,52,000 ▲
విశాఖపట్నం	1,21,100 ▲	1,09,500 ▲	1,65,000 ▲
రాజమండ్రి	1,19,400 ▲	1,09,450 ▲	1,51,000 ▲
ప్రొద్దుటూరు	1,22,300 ▲	1,12,520 ▲	1,54,000 ▲
ముంబై	1,16,954 ▼	1,07,130 ▼	1,45,610 ▲

రుణాలు, డిపాజిట్ల వృద్ధితో దూసుకెళ్తున్న బ్యాంకులు

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశీయ బ్యాంకింగ్ రంగం బలమైన వృద్ధిని ప్రదర్శిస్తోంది. ప్రైవేట్ రంగంలోని ఐడీబీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ రుణాలు, డిపాజిట్లలో గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. ఎల్ఐసీ నియంత్రణలో ఉన్న ఐడీబీఐ బ్యాంక్ రెండో త్రైమాసికం చివరి నాటికి, రుణాల పంపిణీలో 15 శాతం వృద్ధిని నమోదు చేసి, మొత్తం రూ. 2.3 లక్షల కోట్లు బట్వాడా చేసింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంకు రుణాలు రూ. 2 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం డిపాజిట్లు 9 శాతం పెరిగి రూ. 3.03 లక్షల కోట్లకు చేరగా, బ్యాంకు మొత్తం వ్యాపారం 12 శాతం వృద్ధితో రూ. 5.53 లక్షల కోట్లకు చేరింది. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (కాసా)డిపాజిట్లు 4 శాతం పెరిగి రూ.1.39 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మరోవైపు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 9 శాతం రుణ వృద్ధిని నమోదు చేసింది. బ్యాంక్ మొత్తం రుణాల విలువ రూ. 27.9 లక్షల కోట్లకు చేరుకుంది. డిపాజిట్లు 15.1 శాతం పెరిగి రూ.27.1 లక్షల కోట్లకు చేరాయి. కాసా డిపాజిట్ల సగటు రూ. 8.77 లక్షల కోట్లుంది. ఇది గత ఏడాది ఇదే కాలంలో పోలిస్తే 8.5 శాతం అధికం. రెండో త్రైమాసికంలో కోటక్ మహీంద్రా బ్యాంకు రుణాలు 15.8 శాతం పెరిగి రూ. 4.62 లక్షల కోట్లకు చేరగా, డిపాజిట్లు 14.6 శాతం పెరిగి రూ.5.28 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

యూకో బ్యాంక్ క్యూ2 వ్యాపారం రూ.5.37 లక్షల కోట్లు

కోల్‌కతా: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంకు సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో రూ.5.37 లక్షల కోట్ల వ్యాపారం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 13.29 శాతం ఎక్కువ. ఇదే సమయంలో బ్యాంకు రుణాలు 16.67 శాతం వృద్ధిరేటుతో రూ.2.31 లక్షల కోట్లకు, డిపాజిట్లు 10.87 శాతం వృద్ధిరేటుతో రూ.3.06 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం డిపాజిట్లలో కరెంట్ అకౌంట్, సేవింగ్ ఖాతాల (కాసా) డిపాజిట్ల వాటా కూడా 36.91 శాతం నుంచి 38.11 శాతానికి చేరినట్టు బ్యాంకు నియంత్రణ సంస్థలకు తెలిపింది.

బాండ్ల ద్వారా రూ.355 కోట్లు: శాంప్రి న్యూట్రిషన్స్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే శాంప్రి న్యూటిషన్స్ కంపెనీ ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ (ఎఫ్‌సీసీబీ) ద్వారా నాలుగు కోట్ల డాలర్లు (సుమారు రూ.355.06 కోట్లు) సమీకరించనుంది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఒక్కోటి లక్ష డాలర్ల ముఖ విలువ ఉండే 400 ఎఫ్‌సీసీబీలను జారీ చేయనుంది. ఈ నిధులను ఈజిప్ట్, లైబీరియాతో సహా ప్రపంచవ్యాప్తంగా వ్యాపార విస్తరణ కోసం వినియోగించనున్నట్టు కంపెనీ తెలిపింది.

మొబైల్ కాంగ్రెస్‌లో 6జీ అభివృద్ధిపై చర్చలు

ఐఎమ్‌సీ సీఈఓ పి. రామకృష్ణ

న్యూఢిల్లీ: ప్రపంచ టెలికాం రంగంలో, భారత్ తన సాంకేతిక ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి సిద్ధమవుతోంది. ఈ నెల 8 నుంచి 11 వరకు ఢిల్లీలో జరగనున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎమ్‌సీ)-2025 ఈ దిశగా కీలకమైన వేదికగా నిలవనుందని ఐఎమ్‌సీ సీఈఓ పి.రామకృష్ణ అన్నారు. ఈ సంవత్సరం ఐఎమ్‌సీ.. 6జీ ఎకోసిస్టమ్ అభివృద్ధి, భాగస్వామ్యాల విస్తరణ, సాంకేతిక సహకారం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. భారత్‌తో పాటు యూకే, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల సీనియర్ పరిశ్రమ నాయకులు, ప్రొఫెసర్లు, నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు.

ఎందుకు సీఎంను కలిసి కండువాలు కప్పుకున్నారు?

- కృష్ణమోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డిలకు బీఆర్ఎస్ న్యాయవాదుల క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఎందుకు కండువాలు కప్పుకున్నారని పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు) లను బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు ప్రశ్నించారని సమాచారం. వారిని శనివారం బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు శనివారం అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్ కుమార్ చాంబర్‌లో క్రాస్ ఎగ్జామిన్ చేశారు. తాము నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే కలిశామని కృష్ణమోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. మహిపాల్ రెడ్డిపై వేటు వేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిటిషన్లు వేశారు. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాలతో గత నెల 29వ తేదీ నుంచి విచారణ ప్రారంభమయింది. ఇప్పటివరకూ పలువురు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. మరో నలుగురిపై విచారణ ఈనెల 22వ తేదీ తర్వాత ప్రారంభం కానుంది. ఈనెల 6వ తేదీన విదేశీ పర్యటనకు వెళ్లనున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. తిరిగి 21వ తేదీన హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత వారి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.110 కోట్లు

హైదరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు భారీగా ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల నుంచి 50% అధికంగా ఛార్జీలు వసూలు చేయడంతో టీజీఎస్ఆర్టీసీ రూ.110 కోట్ల ఆదాయాన్ని గడించింది. రాష్ట్రవ్యాప్తంగా 5,300 ప్రత్యేక బస్సులు నడిపామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

డిసెంబరు 26న ఖమ్మంలో సీపీఐ శత జయంత్యుత్సవాల ముగింపు సభ

ఖమ్మం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సీపీఐ శత జయంత్యుత్సవాల ముగింపు సభను డిసెంబరు 26న ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నామని ఆపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బాగం హేమంతరావు వెల్లడించారు. ఖమ్మంలో సీపీఐ కార్యాలయలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శత జయంత్యుత్సవాల ముగింపు సభ ఎంతో చరిత్రాత్మకమని, ఈ సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతోపాటు దక్షిణాది రాష్ట్రాల సీపీఐ జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, బినోయ్ విశ్వం, కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకట్‌రెడ్డి, అజీజ్‌పాషా, చాడ వెంకటరెడ్డి, రామకృష్ణ తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.

21 నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు

- పత్తిని ప్రైవేటు మార్కెట్‌లో అమ్మొద్దు: కోదండరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారికంగా పత్తి పంటను కొనుగోలు చేస్తుందని, రైతులు పత్తిని తొందరపడి ప్రైవేటు మార్కెట్‌లో అమ్ముకోవద్దని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. పత్తిని కొనుగోలు కేంద్రాలకు సంచుల్లో కాకుండా నేరుగానే తీసుకురావాలని, తేమ 12శాతం వరకు అనుమతి ఉంటుందన్నారు. శనివారం ఆయన సీసీఐ ఉన్నతాధికారులతో పత్తి పంట కొనుగోళ్ల గురించి ఫోన్‌లో మాట్లాడారు. పత్తిని అమ్మే సమయంలో రైతులు.. దళారుల చేతుల్లో మోసపోతున్నారని వివరించారు. 6న సీసీఐ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

ఓటుచోరీపై విస్తృత స్థాయిలో సంతకాల సేకరణ

- పార్టీ శ్రేణులకు టీపీసీసీ పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 4(ఆంధ్రజ్యోతి): ఓటుచోరీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత స్థాయిలో సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, తదితరులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఓట్ చోరీపై అగ్రనేత రాహుల్ గాంధీ వివరించినప్పటికీ ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సోమవారం నుంచి సంతకాల సేకరణ వేగంగా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా ఓటుచోరీపై పోరాటం చేస్తున్నారని, నాయకులు గ్రామాలకు వెళ్లి సంతకాలసేకరణ చేపట్టాలని కోరారు.

ఔషధ విద్యలో ఏఐ

- మెషిన్ లర్నింగ్, రోబోటిక్స్.. ప్రత్యేక పాఠ్యాంశాలు
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి కొత్త సిలబస్
- రేపటి నుంచి ఎప్‌సెట్ ఫార్మసీ కౌన్సెలింగ్

హైదరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా రంగంలో ఏఐ మరింతగా విస్తరిస్తోంది.. ఇప్పటిదాకా ఇంజినీరింగ్ కోర్సుల వరకే పరిమితమైన కృత్రిమ మేధ ఔషధ విద్యలోనూ తప్పనిసరి కానుంది. నాలుగేళ్ల బీ-ఫార్మసీ, ఆరేళ్ల ఫార్మ్-డీ, రెండేళ్ల వ్యవధి గల ఎం-ఫార్మసీలో ఈ ఏడాది నుంచి కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆరేళ్ల అనంతరం మారిన కొత్త సిలబస్‌లో ఎమర్జింగ్ టెక్నాలజీ సబ్జెక్టులకు అత్యంత ప్రాధాన్యం కల్పించారు. ఇక సోమవారం ఎప్‌సెట్ ఫార్మసీ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 ఫార్మసీ కాలేజీలుండగా యూజీ, పీజీ విద్యలో దాదాపు 70వేల మంది అభ్యసిస్తున్నారు. ఇకనుంచి ఫార్మసీలో థియరీ, ప్రాక్టికల్ తరగతులకు విద్యార్థి, అధ్యాపకులు 20:1 నిష్పత్తిలో ఉండాలి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా యాజమాన్యాలు నియామకాలు చేపట్టాలి. అలాగే 60సీట్లున్న ఫార్మసీ కాలేజీల్లో బోధనా సిబ్బంది కనీసం 12మంది ఉండాలి. కొత్త సిలబస్‌లో ఏఐ, పైథాన్ కోడింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీ సబ్జెక్టులకు ప్రాధాన్యమిచ్చారు. ఇది ప్రథమ సంవత్సరం నుంచే అందుబాటులోకి రానుంది. కొత్త సాంకేతిక వినియోగం కోసం ఇప్పటివరకు ఇతర రంగాల నిపుణులు ఉండగా.. కొత్తగా ఫార్మసీ విద్యలో దీనిని ప్రవేశపెట్టారు. డేటా ఆధారిత అనుభవాల కోసం మెషిన్‌లర్నింగ్ మోడల్స్, రోగుల రికార్డుల గుర్తింపులో బ్లాక్‌చైన్, ఫార్మసీ ఆపరేషన్స్‌లో రోబోటిక్స్ టెక్నాలజీ వినియోగం కొత్త సిలబస్‌లో ప్రాధాన్యాంశంగా పొందుపరిచారు. యూజీ స్థాయిలో పరిశోధన ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌కు గతంలో తక్కువ ప్రాధాన్యం ఉండగా.. కొత్త సిలబస్‌లో దీనిని తప్పనిసరి విద్యగా పేర్కొన్నారు. ఫార్మసీ చివరి సంవత్సరంలో పరిశ్రమల్లో అనుభవం కోసం ప్రత్యేక విధానం ప్రకటించారు. ఫార్మసీలో ఇప్పటివరకున్న ఒకే సబ్జెక్టు విధానంలో ఇంటర్ డిసిప్లినరీ సబ్జెక్టులు అమలు కానున్నాయి. ఇందులో కంప్యుటేషనల్ డ్రగ్ డిస్కవరీ, డిజిటల్ హెల్త్ అనలిటిక్స్, ప్రిసీషన్ మెడిసన్, ఇంటెలిజెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ సిస్టం లాంటివి ఉన్నాయి. అలాగే ఫోరెన్సిక్, నానో టెక్నాలజీ, న్యాయ విద్య, మేనేజ్మెంట్ వంటి సబ్జెక్టులున్నాయి. ఫార్మసీ అన్ని యూజీ కోర్సులు సెమిస్టర్ విధానంలో ఉంటాయి. మొదటి 4 సెమిస్టర్లలో కోర్ సబ్జెక్టులతోపాటు ఏఐ, ఎంఎల్, పైథాన్ లాంటి డిజిటల్ సబ్జెక్టులు, తరువాతి సెమిస్టర్‌లలో స్పెషలైజేషన్ ఎంచుకోవాల్సి ఉంటుంది.

జాబ్ గ్యారంటీ!

అంతర్జాతీయ ఔషధ తయారీ కంపెనీలకు హైదరాబాద్ కేంద్రంగా మారడంతో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం కలిగిన మానవ వనరులు కంపెనీలకు తప్పనిసరిగా మారాయి. పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌లో కీలక మార్పులు చేశారు. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీ ప్రపంచాన్ని ఏలుతున్న నేపథ్యంలో.. ఫార్మసీలో ఏఐ సబ్జెక్టు కీలక పరిణామం. దీంతో ఫార్మ్-డీ తరహాలో బీ-ఫార్మసీ విద్యార్థులకూ ఉద్యోగ అవకాశాలు భారీగా పెరగనున్నాయి.

- జయపాల్‌రెడ్డి, ఇండియన్ ఫార్మాస్యుటికల్ కాంగ్రెస్ కౌన్సిల్ మెంబర్

ఉపకార వేతనాలు వచ్చే దాకా రావొద్దు!

విద్యార్థులను అనుమతించని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు

ఇదే తీరును కొనసాగించాలని అసోసియేషన్ నిర్ణయం

రూ.180 కోట్ల మేర బకాయిలు.. 30వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై ప్రభావం

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాలు విడుదలయ్యే వరకూ పాఠశాలలకు రావొద్దని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ విద్యార్థులకు తేల్చిచెప్పింది. దసరా సెలవుల తర్వాత శనివారం పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను కొన్ని పాఠశాలల నిర్వాహకులు వెనక్కి పంపడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి రాష్ట్రంలో సుమారుగా 238 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉండగా.. వాటిలో 23వేల మంది ఎస్సీ విద్యార్థులు, మరో 7వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. డే స్కాలర్స్‌కు రూ.28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.42వేల చొప్పున ఆయా పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే, 2023-24, 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకుగాను ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. మొత్తం రూ.180కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. రెండున్నరేళ్లుగా బకాయిలను చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని, పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫామ్స్ వంటివి సమకూర్చడం కష్టంగా మారిందని శనివారం జరిగిన బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల అసోసియేషన్ సమావేశంలోనూ పలువురు ఆవేదన వెలిబుచ్చారు. నిధులు విడుదల చేసే వరకూ ఇదే తీరును కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కొత్త అడ్మిషన్లు తీసుకోవడానికి తాము నిరాకరించామని, ఈ విషయాన్ని మంత్రులు భట్టి విక్రమార్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు కలెక్టర్లు, డీఈవోలకు వివరించామని గుర్తుచేశారు. జూన్ నాటికి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడం వల్లే పథకాన్ని కొనసాగించామని, అయినా.. ఇప్పటి వరకు ఒక్క పైసా విడుదల కాకపోవడం వల్ల సెలవుల తర్వాత విద్యార్థులను పాఠశాలలకు రానివ్వొద్దని సమష్టిగా నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ముందుగానే తల్లిదండ్రులకు లేఖల ద్వారా వివరించామని సంఘం నేతలు పేర్కొన్నారు. ఏదేమైనా పాఠశాలల నిర్ణయంతో బీఏఎస్ కింద చదువుతున్న 30వేల మంది విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

63,339 కోట్లతో విద్యుత్ సంస్కరణలు

దక్షిణ డిస్కమ్‌కు రూ.38,477 కోట్లు.. ఉత్తర డిస్కమ్‌కు రూ.24,862 కోట్లు

- డీపీఆర్‌లను పరిశీలించనున్న డీఆర్‌సీ
- అనంతరం క్యాబినెట్ ముందుకు
- ఆమోదిస్తే ఆర్డీఎస్ఎస్‌లో చేరిక



హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ రంగంలో సంస్కరణల దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం' (ఆర్డీఎస్ఎస్) అమలుకు రూ.63,339 కోట్లతో తెలంగాణ డిస్కమ్‌లు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లను సిద్ధం చేశాయి. ఇందులో దక్షిణ డిస్కమ్ కోసం రూ.38,477 కోట్లు, ఉత్తర డిస్కమ్ కోసం రూ.24,862 కోట్లు అవుతాయని లెక్కకట్టాయి. ఆర్డీఎస్ఎస్ పథకాన్ని కేంద్రప్రభుత్వం 2021 జూలై 29న ప్రారంభించింది. దేశవ్యాప్తంగా రూ.3,03,758 కోట్ల వ్యయంతో చేపడుతామని ప్రకటించింది. తొలి గడువు 2025-26 ఆర్థిక సంవత్సరానికే పూర్తికాగా.. 2028 మార్చి 31వ తేదీ దాకా పొడిగించారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం విద్యుత్ సంస్థల ఆర్థిక సుస్థిరతకు చర్యలు తీసుకోవడం, నాణ్యమైన విద్యుత్‌ను అందించడం, పంపిణీ/సరఫరా/వాణిజ్య నష్టాలను 12-15 శాతానికి తగ్గించడం, డిస్కమ్‌ల ఆదాయానికి, అవసరాలకు మధ్య అంతరం శూన్యస్థాయికి తీసుకెళ్లడం. ఈ నేపథ్యంలో తాజాగా తెలంగాణ డిస్కమ్‌లు డీపీఆర్‌లను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాయి. వీటిని మంత్రివర్గం ఆమోదించాల్సి ఉంటుంది. అప్పుడే డిస్కమ్‌లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదురుతుంది. ఆర్డీఎస్ఎస్ అమలులో భాగంగా రెండు డిస్కమ్‌ల పరిధిలో వ్యవసాయ కనెక్షన్లు కాకుండా ఇతర వినియోగదారులకు స్మార్ట్/ప్రీ పెయిడ్ మీటర్లు బిగించాల్సి ఉంటుంది. దీనికి రూ.17,924 కోట్ల వ్యయం అవుతుందని లెక్కకట్టారు. స్మార్ట్/ప్రీపెయిడ్ మీటర్లకు అయ్యే వ్యయంలో 15% లేదా మీటర్‌కు రూ.900లను కేంద్రం ఆర్థిక సహాయం కింద ఇవ్వనుంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్‌లో చేరడానికి సమ్మతి తెలుపకపోతే.. డిస్కమ్‌లు గనుక చేరితే.. ఈ పథకం అమలుకు అయ్యే వ్యయంలో 15% ఇవ్వడానికి కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ అంగీకారం తెలిపింది. నష్టాలు తగ్గించుకోవడం, డిస్కమ్‌ల ఆధునీకీకరణ, భూగర్భ కేబులింగ్, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.45,413 కోట్లు అవుతాయని అంచనాలు రూపొందించారు. ఇప్పటికే రాష్ట్ర సర్కారు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్కరణల కమిటీ(డీఆర్‌సీ)ని ఏర్పాటు చేసిన విషయం విదితమే ఈ కమిటీనే డీపీఆర్‌లకు తుదిరూపు ఇచ్చి.. వాటిని మంత్రివర్గం ఆమోదం కోసం పంపించనుంది. ఆమోదం తర్వాతే ఆర్డీఎస్ఎస్‌లో డిస్కమ్‌లు చేరేందుకు వీలవుతుంది. ఈ పథకం నిబంధనల అమలుకు అంగీకారం తెలుపుతూ డిస్కమ్‌లు, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం త్రైపాక్షిక ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకం అమలును బట్టి ఇచ్చే మార్కుల ఆధారంగా రుణాలు తీసుకోవడానికి వెసులుబాటు లభించనుంది. 50 మార్కులు లభిస్తే.. జీఎస్‌డీపీలో 0.25% రుణంగా డిస్కమ్‌ల కోసం తీసుకోవడానికి కేంద్రం వెసులుబాటు ఇవ్వనుంది. అదే 51-89 మార్కులు దక్కితే 0.25-0.50% మేర జీఎస్‌డీపీలో లోన్ తీసుకోవొచ్చు. 90 మార్కులు దాటితే 0.50% రుణం తీసుకొవొచ్చు. 100% స్మార్ట్ మీటర్లు పెడితే 10 మార్కులు, ఏటీ అండ్ సీ నష్టాలు గణనీయంగా తగ్గించుకుంటే 15 మార్కులు, క్రాస్ సబ్సిడీలను తగ్గించుకుంటే 5 మార్కులు, ఆదాయానికి, అవసరాలకు మధ్య అంతరం శూన్యస్థాయికి తీసుకెళితే 15 మార్కులు.. ఇలా ప్రతీదానికి మార్కులు కేటాయించారు. డిస్కమ్‌ల ప్రైవేటీకరణ లేదా కొత్త డిస్కమ్‌లకు లైసెన్సులు ఇస్తే 10 దాకా మార్కులు ఇస్తారు. రాష్ట్ర జీఎస్‌డీపీ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.16.12 లక్షల కోట్లుగా ఉండగా.. ఇందులో 0.5% అంటే అదనంగా రుణం రూ.8060 కోట్లు తీసుకోవడానికి రాష్ట్రాలకు వెసులుబాటు ఇవ్వనున్నారు. ఇక ఈ పథకం అమలు కోసం అయ్యే వ్యయాన్ని రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) నుంచి రుణం తీసుకోవడానికి వీలు కల్పించనున్నారు.

పథకంలో చేరితే చేయాల్సింది ఇదీ..

ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా.. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లు మినహా మిగిలిన వినియోగదారులందరికీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఇది తప్పనిసరి. డిస్కమ్‌ల ఆదాయం, వ్యయాలకు మధ్య అంతరాన్ని ఆర్‌డీఎస్ఎస్‌లో చేరిన నాటి నుంచి ఐదేళ్లలో శూన్యస్థాయికి చేర్చాలి. విద్యుత్ చౌర్యం నియంత్రణ కోసం ప్రత్యేకంగా డిస్కమ్‌లే పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఫీడర్లు/పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగించి.. వాటిని జాతీయ ఫీడర్ మానిటరింగ్ వ్యవస్థకు అనుసంధానించాలి. టారిఫ్‌ను హేతుబద్ధీకరించాలి. ఏటా నవంబరు 30వ తేదీ లోపు టారిఫ్ పిటిషన్లను విద్యుత్ నియంత్రణ మండళ్లలో దాఖలు చేయాలి. నష్టాలు వచ్చే ప్రాంతాలను ఫ్రాంఛైజీల కింద అప్పగించాలి (దీనికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు). విద్యుత్ సరఫరా కోసం కేబుళ్లు వేయాలి. 2.75 లక్షలకన్నా అధికంగా జనాభా ఉన్న నగరాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను 'సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డాటా అక్విజేషన్' (స్కాడా) పరిధిలోకి తీసుకురావాలి.

ప్రైవేటు చేతికి ఆర్టీసీ కార్గో సేవలు

- నిర్వహణ భారం కావడంతోనే ఈ నిర్ణయమన్న యాజమాన్యం
- ప్రైవేటు సంస్థ ఆర్టీసీకి నెలకు రూ.3 కోట్లు ఇచ్చేలా ఒప్పందం

హైదరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ యాజమాన్యం కార్గో (సరుకు రవాణా) సేవలను ప్రైవేటుపరం చేసింది. సంస్థను లాభాల బాటలో నడిపించేందుకంటూ 2020లో ఈ సేవలను ప్రారంభించారు. అనతికాలంలోనే ఆదరణ లభించగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు సుమారు రూ.100 కోట్ల ఆదాయం తెచ్చిపెట్టాయి. రూ.30 కోట్ల వరకు లాభం వచ్చింది. ప్రస్తుతం 300 వరకు కార్గో సర్వీసులను నడుపుతున్నారు. రూ.300 కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు 'ఇంటి నుంచే పికప్.. ఇంటి వద్దకే డెలివరీ' సేవలను ప్రారంభించారు. గత ఏడాది దసరా నుంచి హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో 30కేంద్రాల నుంచి ఈ సేవలను ప్రారంభించి.. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు నిర్ణయించారు. ఈ ప్రక్రియ ఒకవైపు నడుస్తుండగానే ఇప్పుడు కార్గో సేవలను ప్రైవేటుపరం చేశారు. ఇటీవలే టెండరు ప్రక్రియ పూర్తయింది. నిర్వహణ భారం కావడమే ఇందుకు కారణమని అధికారులు చెప్తున్నారు. అంతేకాదు కార్గో సర్వీసుల్లో విధులు నిర్వహించేందుకు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అంతగా ఆసక్తి కనబర్చడం లేదనేది వారి వాదన. ప్రైవేటు సంస్థకు అప్పగించడం వల్ల ఆర్టీసీకి ఎలాంటి ఖర్చు లేకుండా ఆదాయం వస్తుందని, అదే సమయంలో కార్గో బస్సుల డ్రైవర్లు, కండక్టర్లను రెగ్యులర్ బస్సులకు వినియోగించుకునేందుకు వీలుంటుందని చెబుతున్నారు. నెలకు రూ.3కోట్లు ఆర్టీసీకి చెల్లించేందుకు అంగీకరించిన బిడ్డర్‌కు కాంట్రాక్టును అప్పగించనున్నారు. ఇప్పుడొస్తున్న లాభం స్థాయిలోనే ప్రైవేటు సంస్థ ఇచ్చేందుకు ముందుకురావడంతో టెండరును ఖరారు చేశామని అధికారులు చెప్తున్నారు.కార్గో ద్వారా భవిష్యత్తులో మరింతగా లాభాలు ఆర్జించే అవకాశం ఉన్నా ప్రైవేటుకు ఇచ్చేశారన్న వ్యాఖ్యానాలూ ఉద్యోగుల నుంచి వస్తున్నాయి.

ప్రశాంత్ కిశోర్ పొలిటికల్ బ్రోకర్

- భ్రమల్లో బతికే విఫల రాజకీయ నేత
- సీఎం రేవంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు
- తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే
- ఆయన జేజమ్మ దిగివచ్చినా ఆపలేరు
- పీకేపై కాంగ్రెస్ నేతల మండిపాటు

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డిని ఓడించి తీరతానన్న మాజీ ఎన్నికల వ్యూహకర్త, జన్‌సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్‌పై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ప్రశాంత్ కిశోర్ ఒక పొలిటికల్ బ్రోకర్ అని, భ్రమల్లో బతికే విఫల రాజకీయ నాయకుడని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, మీడియా సెల్ ఛైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తనను మించిన తెలివి గలవారు దేశంలోనే లేరనే భ్రమతో పీకే రాజకీయ విశ్లేషణలు చేస్తారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని, ప్రశాంత్ కిశోర్ జేజమ్మ దిగివచ్చినా కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ప్రశాంత్ కిశోర్ ఇటీవల ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బిహార్ డీఎన్ఏ నాసిరకమంటూ బిహార్ ప్రజలను రేవంత్‌రెడ్డి అవమానించారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌తో పోల్చుకుంటూ రేవంత్‌రెడ్డి 2023లో ఈ వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కేసీఆర్‌ది బిహార్ డీఎన్ఏ అని, తనది తెలంగాణ డీఎన్ఏ అని, ముఖ్యమంత్రి పదవికి తానే అర్హుడినని చెబుతూ రేవంత్‌రెడ్డి బిహారీలను హేళన చేశారని పేర్కొన్నారు. అలాంటప్పుడు ఎన్నికల వ్యూహాల కోసం బిహారీనైన తన వద్దకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ఇందుకు రేవంత్‌ను ఈసారి ఓడించి తమ సత్తా చూపిస్తామని ప్రకటించారు. ప్రశాంత్ కిశోర్ చేసిన ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. ప్రశాంత్ కిశోర్ మహా నాయకుడిగా మారతానంటూ పార్టీ పెట్టారని, కానీ.. పార్టీ సిద్ధాంతాలతో బిహార్ ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. దీంతో ప్రజల దృష్టిని తనవైపు మళ్లించుకునేందుకు బిహార్ సెంటిమెంట్‌ను వాడుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణ చేస్తున్నారని తెలిపారు. ఎన్నిలకు ముందు బిహార్ ప్రజలను పోలరైజ్ చేయడానికి రేవంత్‌రెడ్డి పేరును వాడుతున్నారని తప్పుబట్టారు. పక్క రాష్ట్రాల సీఎంలనుద్దేశించి తప్పుగా మాట్లాడి బిహార్‌లో ఓట్లు సంపాదించాలనుకోవడం సరికాదన్నారు. ప్రశాంత్ కిశోర్‌కు తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి అనుభవం, అవగాహన లేవన్నారు. తెలంగాణ రాష్ట్రం తిరుగుబాటుకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఇక్కడి ప్రజలకు పొలిటికల్ బ్రోకర్ల అవసరం లేదని పేర్కొన్నారు. తన సొంత రాష్ట్రంలో ప్రజల విశ్వాసాన్ని పొందలేని వ్యక్తి.. ఇతర రాష్ట్రాల రాజకీయాలపై మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మరోవైపు 'సభ్యత లేని మాటలు మాట్లాడే వారిని సభ్యత లేనివారు అనే అంటారు' అని బిహార్‌కే చెందిన కాంగ్రెస్ నేత కన్హయ్యకుమార్ వ్యాఖ్యానించారు. ఎన్ఎస్‌యూఐకి ఏఐసీసీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కన్హయ్య.. ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఇలా జవాబిచ్చారు.

సిటీ బస్సుల్లో చార్జీల బాదుడు

గ్రేటర్ హైదరాబాద్‌లో తిరిగే సిటీ బస్సుల టికెట్ల ధరలు పెంపు.. స్టేజీల వారీగా రూ.5-10 మేర మోత

- ఆర్డినరీ, మెట్రో సహా అన్ని రకాల బస్సులకు వర్తింపు
- సిటీ ఆర్డినరీలో ఇకపై కనీస టికెట్ ధర రూ.15
- సోమవారం నుంచి అమలులోకి కొత్త చార్జీలు
- టీజీఎస్ఆర్టీసీ ప్రకటన



హైదరాబాద్ సిటీ, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో సిటీ బస్సుల టికెట్ చార్జీలు పెంచుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సహా అన్ని రకాల బస్సుల్లో టికెట్ ధరలను పెంచింది. బస్సు రూట్‌లోని స్టేజీల వారీగా రూ.5 నుంచి రూ.10 వరకు టికెట్ ధరను పెంచుతున్నట్లు వెల్లడించింది. పెంచిన ధరల ప్రకారం.. సిటీ ఆర్డినరీ, మెట్రోఎక్స్‌ప్రెస్, ఈ- ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజీల వరకు రూ.5, నాలుగో స్టేజీ నుంచి రూ.10 అదనపు చార్జీలను ప్రయాణికుల నుంచి వసూలు చేయనుంది. మెట్రో డీలక్స్, ఈ మెట్రో ఏసీ సర్వీసుల్లో ఒక్కో టికెట్‌పై మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు చార్జీని వసూలు చేయనున్నారు. పెంచిన చార్జీలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని ఆర్టీసీ వెల్లడించింది. ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయంతో సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఇన్నాళ్లూ రూ.10గా ఉన్న కనీస టికెట్ ధర రూ.15కు పెరగనుంది. కాగా, ఎలక్ట్రిక్ బస్సులు, వాటికి మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమయ్యే నిధుల కోసం సిటీ బస్సుల్లో చార్జీల పెంపునకు అనుమతినివ్వాలని టీజీఎస్ఆర్టీసీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం సెప్టెంబరు 23నే ఆమోదించినట్లు తెలిసింది.

చార్జీల పెంపుతో ప్రయాణికులపై భారం

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తిరిగే సిటీ బస్సుల్లో రోజుకు కనీసం 28 లక్షల మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇందులో 18లక్షల మంది మహిళలు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణాలు చేస్తున్నారు. మిగిలిన వారిలో 2 లక్షల మంది నెలవారీ బస్ పాస్‌లు, డే పాస్‌లతో ప్రయాణాలు చేస్తుండగా 8 లక్షల మంది టికెట్లు కొనుగోలు చేసి ప్రయాణాలు సాగిస్తున్నారు. చార్జీల పెంపుతో ఒక్కో ప్రయాణికుడిపై నెలకు రూ.300-500 వరకు అదనపు భారం పడే అవకాశం ఉంది. సిటీ ఆర్డినరీ బస్సుల్లో స్టాప్‌ల వారీగా మొదటి స్టాప్‌కు 10, 15, 25 చొప్పున చార్జీలు వసూలు చేస్తుండగా చార్జీల పెంపుతో రూ.15, 20, 30కి చేరనున్నాయి. ఆ తర్వాత నాలుగో స్టేజీ నుంచి రూ.30 టికెట్ రూ.40కి పెరగనుంది. మహాలక్ష్మితో ఉచిత ప్రయాణాలు అందిస్తున్న ఆర్టీసీ.. చార్జీలను ఈ స్థాయిలో పెంచడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

హైడ్రా కూల్చివేతలతో కొండాపూర్‌లో ఉద్రిక్తత

59వ సర్వేనంబర్‌లోని 36 ఎకరాల భూమి సర్కారుదని హైకోర్టు తీర్పు

- భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు
- భూమి విలువ సుమారు రూ.3600 కోట్లని అంచనా



సర్వేనంబర్ 59లో నిర్మాణాలు కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

రాయదుర్గం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పుతోపాటు రెవెన్యూ శాఖ అధికారుల విజ్ఞప్తి మేరకు కొండాపూర్‌లోని 59వ సర్వే నంబర్‌లోని 36 ఎకరాల సర్కారు భూమిలో గల ఆక్రమణలను శనివారం హైడ్రా తొలగించింది. నోటీసులివ్వకుండా కూల్చివేయడంతో తాము రోడ్డున పడతామని బాధితులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఆ ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగించిన హైడ్రా అధికారులు, సిబ్బంది.. ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించారు. 24 ఏళ్లుగా వివాదంలో ఉన్న భూమి విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ఇది ప్రభుత్వ భూమి అని రెవెన్యూశాఖ వాదిస్తే.. 12 మంది వ్యక్తులు తాము ఒక్కొక్కరూ ప్రభుత్వ వేలంలో 3 ఎకరాలు కొనుగోలు చేసి.. 30 ఏళ్లుగా వ్యవసాయం సాగు చేస్తున్నట్లు 1997లో రంగారెడ్డి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన జిల్లా న్యాయస్థానం.. ఆ భూమి కబ్జాలో ఉన్న వారిదేనని 2002లో ఇచ్చిన తీర్పును.. రెవెన్యూశాఖ 2003లో హైకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సమగ్రంగా విచారించిన హైకోర్టు.. అది సర్కారు భూమి అని గత నెల 3వ తేదీన తీర్పునిచ్చిందని శేరిలింగంపల్లి తహశీల్దార్ వెంకారెడ్డి పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు, రెవెన్యూ శాఖ విజ్ఞప్తి మేరకు శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికారుల బృందాలు.. అనుమతి లేని నిర్మాణాలు, షెడ్లు, బోర్లు తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని బాధితులు వాపోయారు. తాము పైసా పైసా కూడబెట్టిన డబ్బుతో నిర్మించుకున్నామని, ఉన్నపళంగా వచ్చి ఎలా కూల్చేస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. హైకోర్టు ఆదేశాలతోపాటు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, రెవెన్యూశాఖ విజ్ఞప్తి మేరకు తమ సంస్థ పని చేసిందని హైడ్రా వెల్లడించింది.

30 లక్షల సామగ్రి పాడైంది

'మేం నాలుగు షాపులతో నిర్మించిన షెడ్డును నెల క్రితమే అద్దెకు తీసుకున్నాం. రూ.30 లక్షలు అప్పు చేసి, వంట సామాన్లు, ఇతర సామగ్రి తెచ్చుకుని టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాం. తెల్లవారు జామునే వచ్చిన హైడ్రా అధికారులు.. మా సామాన్లు తీసుకునే అవకాశమూ ఇవ్వకుండా టిఫిన్ సెంటర్ షెడ్లను కూల్చేశారు. ఇంజనీరింగ్ చదివినా ఉద్యోగం లేక అప్పులు చేసి ఏర్పాటు చేసుకున్న టిఫిన్ సెంటర్‌ను కూల్చేశారు. సామాన్లు తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు.

- టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలు లక్ష్మి

బిహార్‌కు కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులుగా మంత్రి పొంగులేటి

న్యూఢిల్లీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం ఎన్నికల పరిశీలకులను నియమించింది. వీరిలో తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఉన్నారు. మొత్తం 41 మంది పార్టీ నేతలను జిల్లాల ఎన్నికల పరిశీలకులుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ పరిశీలకులుగా రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్, సీనియర్ నేత అధిర్ రంజన్ చౌదరి నియామకమయ్యారు.

లిడ్‌క్యాప్ భూములు మాదిగల అభివృద్ధికి ఉపయోగిస్తాం

- లెదర్ హబ్ ఏర్పాటుకు కృషి
- మందకృష్ణ మాదిగకు మంత్రి అడ్లూరి హామీ

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): లిడ్‌క్యాప్ భూములను మాదిగల అభివృద్ధి కోసం ఉపయోగిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఐటీ హబ్, చేనేత హబ్‌ల మాదిరిగా లెదర్ హబ్ ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ శనివారం మంత్రి అడ్లూరిని కలిసి లిడ్‌క్యాప్ భూములను పరిరక్షించాలని వినతి పత్రం అందజేశారు. ఆ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి మాట్లాడుతూ.. గతంలో పెట్రోల్ బంక్ కోసం కేటాయించిన 3.21 ఎకరాల భూమి లీజును ఆపేసినట్లు తెలిపారు. త్వరలో జీవో ఆర్టీ నెం.137ను రద్దు చేయిస్తానని చెప్పారు. మాదిగల అభివృద్ధికి లెదర్ హబ్, లిడ్‌క్యాప్‌కు చెందిన మరో 5.16 ఎకరాల యూనిట్ మాల్ భూమి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మాదిగ జాతి ఆర్థిక అభివృద్ధి, గురుకులాల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తానన్నారు.

మేడారం దేవస్థానం విస్తరణ పనులు ప్రారంభం

తాడ్వాయి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మేడారం సమ్మక్క- సారలమ్మ దేవస్థానం విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ పరిసరాల్లో అడ్డుగా ఉన్న భారీ వృక్షాలను పొక్లెయిన్ల సహాయంతో అధికారులు తొలగించారు. గద్దెల వద్ద ఉన్న క్యూలైన్లను తొలగించి పక్కన ఏర్పాటుచేశారు. దేవస్థానం విస్తరణలో భాగంగా ముందుగా ప్రాకారం పనులు పూర్తి చేస్తామని, దర్శనాలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సెప్టెంబరు 23న మేడారం దేవస్థాన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్‌రెడ్డి వందరోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

నలుగురు తెలుగు విద్యార్థులకు ప్రధాని మోదీ సత్కారం

- 45 మంది ఐటీఐ టాపర్లకు సర్టిఫికెట్ల ప్రదానం



న్యూఢిల్లీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ పరీక్షల్లో వివిధ ట్రేడ్లలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ప్రధాని నరేంద్ర మోదీ సత్కరించి, సర్టిఫికెట్లు అందచేశారు. వారిలో నలుగురు (ముగ్గురు ఏపీ, ఒకరు తెలంగాణ) తెలుగు రాష్ట్రాల విద్యార్థులున్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శనివారం జరిగిన కౌశల్ దీక్షాంత్ సమారోహ్ కార్యక్రమంలో 45 మంది ఐటీఐ విద్యార్థులను ఆయన సత్కరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచిన ఖమ్మం (రూరల్ మండలం) జిల్లా ఆరెంపుల గ్రామ వాసి తాళ్లూరు పల్లవి, ఏపీకి చెందిన పి.మధులత (ఆర్ అండ్ ఏసీ టెక్నీషియన్), డి.వందన (పెయింటర్ జనరల్), ఎస్. యామిని వరలక్ష్మి(వుడ్‌వర్క్ టెక్నీషియన్)లకు ప్రధాని మోదీ సర్టిఫికెట్లు అందజేశారు.



గవర్నర్ జిష్ణుదేవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న జైన్ సామాజికవర్గ సభ్యులు

మార్వాడీలకు అండగా ఉంటాం: కిషన్‌రెడ్డి

- గవర్నర్‌తో కలిసి గోశాల, వెటర్నరీ ఆస్పత్రి ప్రారంభం

తిరుమలగిరి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కొంతమంది పనికట్టుకుని మార్వాడీ గోబ్యాక్ అంటూ గొడవలు చేయడం మంచి పద్ధతి కాదని, మార్వాడీలకు బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బొల్లారం తుర్కపల్లిలోని కంటోన్మెంట్ బోర్డు స్థలంలో గురు గౌతమ్‌ముని జైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గోశాల, వెటర్నరీ ఆస్పత్రిని శనివారం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. జైన్ సామాజికవర్గ సభ్యులు గోసేవకు ప్రాధాన్యం ఇచ్చి గోశాల ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. జైనులందరూ సనాతన ధర్మాన్ని, అహింసను పాటిస్తూ సంఘసేవ చేస్తున్నారని, భారతదేశంలో 24 శాతం మంది వ్యాపారులు జైన్ కమ్యూనిటీకి చెందిన వారేనని తెలిపారు. భారతీయ సంస్కృతిలో గోవుకు ప్రత్యేక స్థానం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు.



ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ఉబర్, ఓలాలకు దీటుగా సర్కారీ క్యాబ్ యాప్

- 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభించిన ఏపీ సీఎం
- 2,90,669 మందికి రూ.436 కోట్ల ఆర్థిక సహాయం జమ

విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటోడ్రైవర్లకు బిజినెస్ ఇచ్చి, వారిని ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ఆన్‌లైన్ యాప్స్‌ను తీసివేయలేం. కానీ ఆటోవాలాలు, క్యాబ్‌వాలాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా 'సర్కారీ క్యాబ్ బుకింగ్ యాప్‌'ను రూపొందిస్తాం. ఈ యాప్ ఆర్థికంగా ఊరటను కలిగిస్తుంది. ఆటోస్టాండ్ల వద్ద రోజంతా పడిగాపులు పడాల్సిన అవసరం ఇకపై ఉండదు. ఈ యాప్ నిర్వహణ కోసం కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేస్తాం. అందులో ఆటో, క్యాబ్ డ్రైవర్లే సభ్యులుగా ఉంటారు" అని సీఎం తెలిపారు. విజయవాడలో 'ఆటో డ్రైవర్ల సేవలో...' పథకాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,90,669 మంది లబ్ధిదారులకు రూ.436 కోట్ల నిధుల చెక్‌ను అందించారు.

జో....ష్!

(మొదటిపేజీ తరువాయి)



మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో దసరా పండుగ సందర్భంగా వంట సరుకులు పంపిణీ చేస్తున్న స్థానిక ఎన్నికల ఆశావహులు

ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ రాత్రి సమావేశాలు మొదలయ్యాయి. వీటిలో ఖర్చే ప్రధానంగా చర్చకు వస్తోందని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలానికి చెందిన ఓ పార్టీ నాయకుడు చెప్పారు. ఉత్తర తెలంగాణలో కొన్నిచోట్ల ఖర్చులు మొదలుపెట్టగా, దక్షిణ తెలంగాణలో మోస్తారుగానే ఉంది. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో మధ్యస్థంగా ఉంది. మరి కొన్నిచోట్ల ఏకగ్రీవాల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పార్టీలవారీగా అభ్యర్థుల జాబితాలు

స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార, విపక్షాలు అభ్యర్థుల జాబితాల రూపకల్పనలో నిమగ్నమయ్యాయి. ఆయా స్థానాలవారీగా 5 వరకు పేర్లను పంపాలని డీసీసీలకు పీసీసీ సూచించింది. బీఆర్ఎస్ కూడా క్షేత్రస్థాయిలో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తోంది. గతంలో పార్టీ కోసం పని చేసిన వారు, బలంగా ఉన్నవారి కోసం చూస్తోంది. బలమైన అభ్యర్థులను బరిలోకి దించాలని బీజేపీ భావిస్తోంది. అవసరమైన కసరత్తును ప్రారంభించింది. ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొన్నా.. వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదనే ఉద్దేశంతో జాబితాల్లో తమ పేరు ఉండేలా కొంతమంది ప్రయత్నాలు చేసుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లోని ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలన్నీ ఆశావహులతో నిండిపోతున్నాయి. మరోవైపు పొత్తుల కోసం కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆ జోష్ లేదు.. జెండాల ఆర్డర్లు లేవు

స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ వచ్చిందంటే ఆ ఉత్సాహం, జోష్ చెప్పలేని స్థాయిలో ఉండేదని, ఈసారి అది కనిపించడం లేదని ఖమ్మంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్ యజమాని చెప్పారు. షెడ్యూల్ వచ్చినప్పటి నుంచే కరపత్రాలు, ఫ్లెక్సీలు, జెండాలు, కండువాల కోసం నాయకులు వచ్చేవారని, ఆర్డర్లు రావడంతో తమకు ఊపిరి సలపనంత పని ఉండేదని, ఈసారి ఊహించిన స్థాయిలో ఆర్డర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సర్పంచ్ ఇస్తే రూ.30 లక్షలు ఓ ఔత్సాహిక నేత బంపర్ ఆఫర్

నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం మండలం ఊట్లపల్లి గ్రామంలో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే ఓ ఆశావహుడు బంపర్ ఆఫర్ ఇచ్చారు. గ్రామంలో మద్యరహిత, గ్రామాభివృద్ధికి రూ.30 లక్షలు ఇస్తానని వాట్సాప్ వేదికగా గ్రామంలో ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం ఇది చర్చల దశలో ఉంది.

8న జడ్పీటీసీ అభ్యర్థుల ప్రకటన

ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున పేర్లను.. పంపాలని జిల్లా కమిటీలకు పీసీసీ ఆదేశం

- నేడు సాయంత్రం అందనున్న జాబితాలు
- రేపు పరిశీలన.. 7న రేవంత్‌తో భేటీ



హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ పార్టీ.. తమ జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను ఈ నెల 8న ప్రకటించనుంది. ఈ అభ్యర్థులను రాష్ట్ర స్థాయిలో పీసీసీ ఖరారు చేయనుంది. ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థుల పేర్లను డీసీసీల స్థాయిలోనే పరిశీలించి ప్రకటించనున్నారు. కాగా, జడ్పీటీసీ సభ్యులుగా పోటీ చేసేందుకు అర్హులను గుర్తించి ఒక్కో స్థానం నుంచి ముగ్గురి పేర్లతో జాబితాను ఆదివారం (ఈ నెల 5) సాయంత్రానికి పంపాలని ఆయా జిల్లా పార్టీ కమిటీలను పీసీసీ ఆదేశించింది. ఈ విషయంలో ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, జిల్లా మంత్రులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితర సీనియర్ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. స్థానికంగా మంచిపేరు, అందరినీ సమన్వయం చేసుకునే నేర్పు కలిగి, పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావంతో పనిచేసే నాయకుల పేర్లను సూచించాలని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా.. ఆయా ప్రాంతాల్లో బీసీల నాయకత్వాన్ని బలపరిచేలా ఈ జాబితాలు ఉండాలని తెలిపింది. కాగా, ఆయా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రుల నేతృత్వంలో జరిగిన పార్టీ ముఖ్యుల సమావేశాల్లో ఏకాభిప్రాయంతో ఆమోదించిన పేర్లతో రూపొందించిన జాబితాలు ఇప్పటికే పీసీసీకి చేరినట్లు తెలిసింది. ఇక ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల కు సంబంధించి ఎమ్మెల్యేలు, మండల స్థాయి కమిటీల అభిప్రాయాల మేరకు మూడేసి పేర్లను డీసీసీలకు పంపేలా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ నేతలను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం వరకు ఆయా జిల్లాల నుంచి అందిన జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాలను సోమవారం రాష్ట్ర స్థాయిలో పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో సవరించనున్నట్లు తెలిసింది. అనంతరం ఈ నెల 7న పీసీసీ చీఫ్‌తోపాటు ఎన్నికల కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై ఆయా జిల్లాల నుంచి వచ్చిన జాబితాలను పరిశీలించి జాబితాపై నిర్ణయం తీసుకుంటారని పీసీసీ వర్గాలు పేర్కొన్నాయి.

పోటీ తీవ్రంగా ఉంటే సంప్రదింపులతో..!

జడ్పీటీసీ అభ్యర్థిత్వాలకు పోటీ పడే అభ్యర్థుల మధ్య తీవ్రత ఉన్నట్టు గుర్తించిన స్థానాల నుంచి అవసరమైన పక్షంలో జాబితాలో పేర్లున్న వారిని సంప్రదించి ఖరారు చేయనున్నట్టు తెలిసింది. మొత్తంగా ఈ నెల 8వ తేదీ నాటికి జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసి ప్రకటించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఒకవేళ ఏ స్థానాల్లకైనా ఏకాభిప్రాయం కుదరకపోతే.. వాటిని పెండింగ్‌లో పెట్టి నామినేషన్ల ఉపసంహరణ గడువు నాటికి సంప్రదింపులు కొనసాగించి అభ్యర్థులను ఖరారు చేయాలని టీపీసీసీ యోచిస్తున్నట్టు తెలిసింది. ఇక ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులకు అభ్యర్థులను సంబంధిత మండల స్థాయి కమిటీల సమన్వయంతో డీసీసీ స్థాయిలోనే ఖరారు చేసి ప్రకటించాలని పీసీసీ సూచించింది. ఇదిలా ఉండగా శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు కోట నీలిమ, ఆత్రం సుగుణ, ప్రధాన కార్యదర్శి అంబటి రాజేశ్వర్‌ల ఆధ్వర్యంలో తెలంగాణ శక్తి అభియాన్ కమిటీ సమావేశమై స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి అవలంబించాల్సిన వ్యూహంపై చర్చించింది.

రిజర్వేషన్ల వివరాలు ఇవ్వండి...

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపుల సమగ్ర వివరాల జాబితాను అందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను టీపీసీసీ ఎన్నికల విభాగం కన్వీనర్ పి.రాజేశ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి శనివారం లేఖ రాశారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందుగానే ఆయా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ఏర్పాట్లపై అభిప్రాయాలు తీసుకోవడం సంప్రదాయమని ఆయన గుర్తు చేశారు. ప్రధానంగా దశలవారీగా నిర్వహించనున్న స్థానిక ఎన్నికల తేదీల వివరాలు, ఏయే తేదీల్లో ఏయే స్థానాలకు ఎన్నికలు జరుగుతాయో, నామినేషన్లు, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీల వివరాలను తమకు అందించాలని విజ్ఞప్తి చేశారు. సానిక ఎన్నికలపై రాజకీయ పార్టీలకు పలు సందేహాలున్నాయని, నివృత్తి చేయడానికి తక్షణం గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని కోరారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు చెల్లవు

- అలా చేస్తే మొత్తం 50% దాటుతాయి
- ఇది సుప్రీంకోర్టు గత తీర్పులకు విరుద్ధం
- జీవో 9ని కొట్టేయండి
- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కేటాయించడం చెల్లదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ను కొట్టివేయాలని వంగా గోపాల్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు రానుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల్లో మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరకుంటాయని, ఇది సుప్రీంకోర్టు గత తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించరాదని ఇందిరా సహాని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలో స్థానిక రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న నిబంధనను తొలగిస్తూ రాష్ట్ర శాసనసభ చేసిన చట్ట సవరణ ఇంకా గవర్నర్ ఆమోదం పొందలేదని పిటిషనర్ పేర్కొన్నారు. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై మాధవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 8న తెలంగాణ హైకోర్టు తిరిగి విచారణ చేపట్టనుంది. మరోవైపు, తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించింది. మొత్తం 5దశల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

క్షేత్రస్థాయి సర్వే తర్వాతే అభ్యర్థుల ఎంపిక

- స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించిన తర్వాతే స్థానిక సంస్థల అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జిలతో ఆయన సమావేశమై సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికపై ఎమ్మెల్యేలు, ఇంచార్జిల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని, తుది నిర్ణయం మాత్రం పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలతో మంత్రి దామోదర భేటీ

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకే స్థానిక సంస్థల టికెట్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో ఆయన శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. నాయకుల మధ్య సమన్వయ లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఎన్నికలపై సందేహాల నివృత్తికి కాల్‌సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రజలకు కలిగే సందేహాలను నివృత్తి చేసేందుకు, ఎన్నికలకు సంబంధించిన సమాచారం అందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక కేంద్రీకృత కాల్‌సెంటర్ (9240021456)ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పౌరులు, సంబంధిత అధికారుల మధ్య నిరంతర సమాచార బదిలీ, ప్రజలకు సులభంగా సమాచారాన్ని అందించడం కోసం ఈ కాల్‌సెంటర్‌ను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

'స్థానికం'పై నేడు కమలదళం భేటీ

- ఎక్కువస్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళిక
- జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం త్రిసభ్య కమిటీ
- మెజారిటీ జిల్లా పరిషత్‌లు మావే: రాంచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల సమరానికి కమలదళం సమాయత్తమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఆ పార్టీ నాయకత్వం ఆదివారం కీలక సమావేశం నిర్వహించనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరగనున్న పదాధికారుల సమావేశానికి అందుబాటులో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. స్థానిక ఎన్నికల సన్నద్ధత, జూబ్లీహిల్ ఉప ఎన్నిక అభ్యర్థిత్వం, కార్యాచరణ ప్రణాళికపై చర్చించనున్నారు. అనంతరం ఈనెల 8న జరగనున్న మరో కీలక సమావేశానికి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఖరారుకు సంబంధించి త్రిసభ్య కమిటీలు వేసే అంశంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. జడ్పీటీసీ అభ్యర్థులకు సంబంధించి జిల్లా పార్టీ ఇన్‌చార్జి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పార్టీ పరిశీలకుడితో కమిటీ ఏర్పాటు చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే అభ్యర్థులకు బీ ఫాంలు అందజేయనున్నారు. ఇక, మండల పార్టీ అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి, జిల్లా పరిశీలకుడితో ఏర్పాటు చేసే కమిటీ ఎంపీటీసీ అభ్యర్థులను ఖరారు చేయనుంది. మరోవైపు.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. సరైన అభ్యర్థిని ఎంపిక చేసేందుకు మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, సీనియర్ నాయకుడు కోమల ఆంజనేయులు సభ్యులుగా ఓ కమిటీని రాంచందర్‌రావు నియమించారు. అభ్యర్థి ఎంపికపై పార్టీ నాయకుల అభిప్రాయాలను ఈ కమిటీ సేకరించనుంది. కాగా, ఉప ఎన్నికలో తానే బీజేపీ అభ్యర్థినంటూ సోషల్ మీడియాలో ఓ నేత ప్రచారం చేసుకోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ విషయం పార్టీ నాయకత్వం దృష్టికి వెళ్లగా.. సదరు నేతపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్:

స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ జిల్లా పరిషత్‌లను బీజేపీ కైవసం చేసుకోబోతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర నిధులను సైతం దారి మళ్లించి పంచాయతీలను ఆర్థికంగా దెబ్బతీసిన పాపం బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. తాజా మాజీ సర్పంచ్‌లు, మహిళలు, వృద్ధులు, రైతులు, యువతే బీజేపీ బ్రాండ్ అంబాసిడర్లు అని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఆయా వర్గాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ అమలు చేయలేదని విమర్శించారు. ఆ పార్టీ చేసిన మోసాలపై ప్రచారం చేస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ పంటలతో నూనె అవసరాలను తీర్చుకోవచ్చు

- ప్రస్తుతం రూ.లక్షన్నర కోట్ల విలువైన నూనె దిగుమతి
- ఆయిల్‌పామ్‌లో అంతర పంటలూ వేసుకోవచ్చు: తుమ్మల



మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న ఆయిల్‌పామ్ రైతులు

అశ్వారావుపేట/హైదరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): "దేశంలో నూనె ఉత్పత్తుల కొరత ఉంది. విదేశాల నుంచి ఏటా లక్షన్నర కోట్ల విలువైన నూనెలను దిగుమతి చేసుకుంటున్నాం. ఇది దేశీయ అవసరాల్లో 70శాతంగా ఉంది. దేశంలో నూనె అవసరాలను ఆయిల్ పామ్ పంటల సాగు ద్వారా తీర్చవచ్చు" అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లింగాలపల్లిలో టీఎస్ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 13 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలుంటే.. ఇందులో తెలుగు రాష్ట్రాల్లోనే 10లక్షల ఎకరాలు ఉండటం గర్వకారణమన్నారు. వచ్చే మూడేళ్లలో మరో 10 లక్షల ఎకరాల్లో ఈ తోటలను విస్తరించి దేశంలోనే నెం.1 స్థాయికి చేరాలనే కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రస్తుతం మన దేశంలో ఉత్పత్తి అవుతున్న నూనె దేశీయ అవసరాల్లో 30శాతంగానే ఉందని 70% నూనె ఉత్పత్తులు విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. దేశీయ నూనె అవసరాలను తీర్చేందుకు ఆయిల్‌పామ్ తోటల విస్తరణ ఒక్కటే మార్గమని, అందులో భాగంగానే తెలంగాణలోని 31 జిల్లాల్లో తోటలను విస్తరించేందుకు కేంద్రం అనుమతులు పొందామని పేర్కొన్నారు. రైతులు ఆయిల్‌పామ్ తోటలతో పాటు వక్క, జాజి, అవకాడ, మెకాడమియా లాంటి అంతర పంటలు, ఇతర ఉద్యాన పంటలను వేసుకోవడం ద్వారా అత్యధిక అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఆయన వివరించారు. అనంతరం టీఎస్ ఆయిల్ పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా దమ్మపేటకు చెందిన ఆలపాటి రామచంద్ర ప్రసాద్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

వచ్చే వారంలో హౌసింగ్ బోర్డు భూముల విక్రయాలు

- చింతల్, నిజాంపేట, బాచుపల్లిలో బహిరంగ వేలం ద్వారా విక్రయాలు
- కేపీహెచ్‌బీ, రావిర్యాలలోని భూములకు ఈ-వేలం

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో అక్టోబరు 6వ తేదీ నుంచి జీహెచ్ఎంసీ పరిధిలో అలాగే పలు పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్ల విక్రయాలు జరగనున్నాయి. సోమవారం నగరంలోని చింతల్, నిజాంపేట, బాచుపల్లి ప్రాంతాల్లో ఉన్న 22 రెసిడెన్షియల్ ప్లాట్లు, ఫ్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గత నెల 15వ తేదీన జారీ చేశారు. ఇటీవల కేపీహెచబీ కాలనీ ప్రాంతంలో హౌసింగ్ బోర్డు పలు దఫాలుగా నిర్వహించిన భూముల విక్రయంలో ఎకరా భూమి సుమారు రూ.70 కోట్లకు ఇ-వేలం ద్వారా అమ్మిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేపీహెచ్‌బీ కాలనీలో నాలుగు కమర్షియల్ ప్లాట్లను అక్టోబరు 7, 8 తేదీల్లో ఇ-వేలం ప్రక్రియ ద్వారా విక్రయించనున్నారు. అలాగే నాంపల్లి ప్రాంతంలోని 1,148 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్‌ను కూడా 8వ తేదీన ఇ-వేలం ద్వారానే విక్రయిస్తున్నట్టు హౌసింగ్ బోర్డు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు అక్టోబరు 9, 10 తేదీల్లో చింతల్ లోని 10,890 చదరపు గజాల కమర్షియల్ భూమి, మహేశ్వరం మండలం రావిర్యాల ప్రాంతంలోని భూములను కూడా ఇ-వేలం ద్వారా విక్రయించనున్నారు. ఇవే కాకుండా వచ్చే పది రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయానికి కూడా నోటిఫికేషన్ ఇచ్చారు. వీటిలో సంగారెడ్డి, సదాశివపేటలోని ప్లాట్లు, జోగులాంబ గద్వాల, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భూములు ఉన్నాయి.

యువతలో నైపుణ్యాభివృద్ధికి 'పీఎం-సేతు'

- కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- 1,000 ప్రభుత్వ ఐటీఐలను ఆధునికీకరించాలని యోచన

న్యూఢిల్లీ, అక్టోబరు 4: ప్రధాని మోదీ శనివారం రూ.62 వేల కోట్లకు పైగా విలువైన పలు యువత కేంద్రీకృత కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడితో కేంద్ర ప్రాయోజిత పథకమైన పీఎం-సేతు (ఆధునికీకరించిన ఐటీఐల ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పరివర్తన)ను ప్రధాని ప్రారంభించారు. ఈ స్కీమ్ కింద 1,000 ప్రభుత్వ ఐటీఐలను 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో 200 హబ్ ఐటీఐలు, 800 స్పోక్ ఐటీఐలుగా ఆధునికీకరించనున్నారు. పథకం అమలు మొదటి దశలో బిహార్‌లో పాట్నా, దర్భంగాల్లోని ఐటీఐలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అదేవిధంగా బిహార్‌లో పునరుద్ధరించిన 'ముఖ్యమంత్రి నిశ్చయ్ స్వయం సహాయత భట్టా యోజన' పథకాన్ని కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ స్కీమ్ కింద దాదాపు 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు నెలకు రూ.వెయ్యి చొప్పున రెండేళ్ల పాటు భత్యం ఇవ్వనున్నారు. దీంతో పాటుగా వారికి ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నారు. ఇంకా రీడిజైన్ చేసిన 'బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డు స్కీమ్'ను కూడా ప్రధాని ప్రారంభించారు. దీని కింద ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆర్థిక భారం పడకుండా వడ్డీ రహితంగా రూ.4 లక్షల వరకు విద్యా రుణాలు అందించనున్నారు. ఈ స్కీమ్ కింద ఇప్పటికే 3.92 లక్షల మంది రూ.7,880 కోట్ల రుణాలు పొందారు. ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా శ్రామిక శక్తిని తయారు చేసేందుకు పరిశ్రమ ఆధారిత కోర్సులు, వృత్తి విద్యను ప్రోత్సహించేందుకు జన్‌నాయక్ కర్పూరీ ఠాకూర్ స్కిల్ వర్సిటీని ప్రధాని ఆవిష్కరించారు.

ప్రిలిమ్స్ పూర్తయిన వెంటనే 'కీ'ని ప్రచురిస్తాం

- సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో యూపీఎస్సీ

న్యూఢిల్లీ, అక్టోబరు 4: సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ముగిసిన వెంటనే తాత్కాలిక జవాబులతో 'కీ'ని ప్రచురించడానికి యూపీఎస్సీ సంసిద్ధత వ్యక్తం చేసింది. దానిపై అభ్యర్థులు తమ అభ్యంతరాలను దాఖలు చేసుకోవడానికి అంగీకరించింది. ఈ మేరకు జస్టిస్ పీఎస్ నరసింహ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు అఫిడవిట్ దాఖలు చేసింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించే విషయమై సమగ్రంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రిలిమ్స్ ప్రశ్నపత్రంలో దొర్లిన తప్పులను సవాలు చేయడానికి కమిషన్ తమకు అవకాశం ఇవ్వడం లేదని సివిల్స్ ఆశావహులు ఏళ్ల తరబడి ఆరోపిస్తున్నారు. మొత్తం పరీక్ష ప్రక్రియ ముగిసిన తర్వాత కీని విడుదల చేసే ప్రస్తుత పద్ధతికి బదులుగా వాటిని తక్షణమే ప్రచురించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ధర్మాసనం విచారిస్తోంది.

పిల్లల ఆధార్ అప్‌డేట్ రుసుముల రద్దు

న్యూఢిల్లీ, అక్టోబరు 4: పిల్లల ఆధార్ బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేసేందుకు రుసుములను రద్దు చేసినట్టు విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) శనివారం ప్రకటించింది. ఈ మాఫీ ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని, ఏడాది పాటు కొనసాగుతుందని తెలిపింది. అయిదేళ్ల లోపు పిల్లలకు ఫొటో, పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి వివరాలతో ఆధార్ కార్డు ఇస్తారు. ఆ సందర్భంగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. వారి వేలి ముద్రలు, ఐరిస్‌ను మాత్రం తీసుకోరు. 5-7 ఏళ్ల మధ్యలో వేలిముద్రలు, ఐరిస్ ఇచ్చి తప్పనిసరిగా ఫొటోను, బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. 15-17 ఏళ్ల మధ్య మరోసారి ఫొటోను, ఇతర సమాచారాన్ని అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. 17 ఏళ్లలోపు పిల్లల బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ)కు ఎలాంటి రుసులు తీసుకోవడం లేదని ఉడాయ్ తెలిపింది.

పీవోకే ఆందోళనకారులతో పాక్ ఒప్పందం

న్యూఢిల్లీ, అక్టోబరు 4: ఒత్తిళ్లకు తలొగ్గిన పాకిస్థాన్ ప్రభుత్వం శనివారం పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ఆందోళనకారులతో ఒప్పందం కుదుర్చుకొంది. ఆందోళనకారులు 38 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచగా వాటిలో 25 పాయింట్లను ఆమోదించింది. దీనిని శాంతికి లభించిన విజయంగా అభివర్ణించింది. ఐదు రోజుల పాటు సాగిన ఉద్యమంలో ముగ్గురు పోలీసులు సహా 12 మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. ఉద్యమంలో మరణించినవారి కుటుంబాలకు పరిహారం చెల్లించడం ఇందులో ప్రధానమైనది. విధ్వంస చర్యలకు పాల్పడినవారిపై ఉగ్రవాద చట్టాల కింది కేసులు నమోదు చేయడం మరో ముఖ్య అంశం. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో విద్యుత్తు వ్యవస్థ మెరుగుకు వేయి కోట్ల పాకిస్థానీ రూపాయలు కేటాయించడం, ముజఫరాబాద్, పూంఛ్ డివిజన్‌లలో విద్యా బోర్డులు నెలకొల్పడం ఇతర కీలకమైన అంశాలు. ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి కమిటీని వేయాలని కూడా ఇరు పక్షాలు అంగీకరించాయి.

దగ్గు మందు సహా 19 ఔషధాలపై తనిఖీలు

న్యూఢిల్లీ, అక్టోబరు 4: దగ్గు మందు, యాంటి బయాటిక్స్‌తోపాటు 19 రకాల ఔషధాల పని తీరుపై కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ - కేంద్ర ఔషధాల ప్రామాణిక నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) తనిఖీలు చేపట్టింది. 6 రాష్ట్రాల్లోని ఆయా ఔషధాల తయారీ యూనిట్లలో ఈ తనిఖీలు చేపట్టినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ శనివారం తెలిపింది. మధ్యప్రదేశ్‌లో కలుషిత దగ్గు మందు తాగిన బాలలు మృతి చెందిన నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు సీడీఎస్‌సీవో పేర్కొంది. శుక్రవారం నుంచి చేపట్టిన తనిఖీల్లో సీడీఎస్‌సీవోతోపాటు జాతీయ వైరాలజీ సంస్థ, ఐసీఎంఆర్, జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ, ఎయిమ్స్-నాగ్‌పూర్ తదితర సంస్థలు పాల్గొంటున్నాయి.

ప్యాసింజర్ రైలుపై రష్యా బాంబులు!

కీవ్/మాస్కో, అక్టోబరు 4: ఉక్రెయిన్‌లోని సుమీ రీజియన్‌లో ఉన్న షోస్ట్క రైల్వే స్టేషన్ లక్ష్యంగా రష్యా డ్రోన్ దాడులు జరిపింది. కీవ్‌కు వెళ్లే ప్యాసింజర్ రైలుపై బాంబులు పడటంతో పలు బోగీలు దగ్ధమయ్యాయి. 30 మందికి పైగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వీడియోను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సాధారణ ప్రజలను లక్ష్యంగా చేసుకుని రష్యా క్రూరమైన దాడికి పాల్పడిందన్నారు. మరోవైపు ఉక్రెయిన్‌లోని పవర్ గ్రిడ్లు, గ్యాస్ కేంద్రాలే లక్ష్యంగా రష్యా డ్రోన్, క్షిపణి దాడులు ముమ్మరం చేసింది.

సీనియర్ జర్నలిస్ట్ టీజేఎస్ జార్జ్ కన్నుమూత



బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్ టీజేఎస్ జార్జ్ బెంగళూరులో శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న జార్జ్(97) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బెంగళూరులో ఆదివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమార్తె శిబా తెలిపారు. 1938, మే 7న కేరళలో జన్మించిన జార్జ్.. 1950లో ఫ్రీ ప్రెస్ జర్నల్ ద్వారా బొంబాయిలో పాత్రికేయ వృత్తిలో ప్రవేశించారు. సుదీర్ఘకాలం ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కొనసాగారు. సుమారు రెండున్నర దశాబ్దాలపాటు 'పాయింట్ ఆఫ్ వ్యూ' పేరిట కాలమ్స్ రాశారు. 2007లో కన్నడ రాజ్యోత్సవ పురస్కారం, 2011లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు.

గాజాలో శాంతి వైపు అడుగులు!

ట్రంప్ శాంతి ప్రణాళికను కొన్ని షరతులతో అంగీకరించిన హమాస్.. బందీల అప్పగింతకు సిద్ధమని ప్రకటన

- గాజాలో దాడులు వెంటనే ఆపాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచన

దేర్ అల్ బలా (గాజా), అక్టోబరు 4: గాజాలో శాంతి స్థాపన వైపు అడుగులు పడుతున్నాయి. శాంతి ఒప్పందానికి ముందుకు రావాలని, లేకుంటే నరకం చూపిస్తామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలతో హమాస్ కాస్త దిగొచ్చింది. ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల ప్రణాళికలో బందీల విడుదల సహా కొన్ని అంశాలకు అంగీకారం తెలిపింది. దీనిపై ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. శాశ్వత శాంతికి వారు సిద్ధంగా ఉన్నారని నమ్ముతున్నానని 'ట్రూత్' సోషల్‌లో పోస్టు పెట్టారు. గాజాలో బాంబు దాడులను వెంటనే ఆపేయాలని, అలాగైతేనే బందీలను సురక్షితంగా, వేగంగా విడుదల చేయించుకోగలమని ఇజ్రాయెల్‌కు సూచించారు. ట్రంప్ స్పందనపై హమాస్ హర్షం వ్యక్తం చేసింది. "ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచనలు శాంతికి మార్గం వేసేలా ఉన్నాయి. బందీల పరస్పర మార్పిడి, గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం ఉప సంహరణ, యుద్ధం ముగింపుపై వెంటనే చర్చలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని హమాస్ రాజకీయ విభాగం మీడియా సలహాదారు తాహిర్ అల్ నౌనూ ప్రకటించారు. ఇక ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకారం మొదటి దశ అమలు కోసం తాము సిద్ధమవుతున్నట్టు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. కానీ ఉన్నట్టుండి గాజా సిటీ, ఖాన్ యూనిస్‌లోని పలు ప్రాంతాలపై వైమానిక, డ్రోన్ దాడులు చేసింది. ఇందులో ఆరుగురు పౌరులు మృతి చెందారు. మరోవైపు, గాజాలో శాంతి కోసం ట్రంప్ నాయకత్వంలో నిర్ణయాత్మక ముందడుగు పడిందని ప్రధాని మోదీ 'ఎక్స్'లో ప్రశంసించారు. బందీల విడుదలకు హమాస్ అంగీకరించడం శాంతి స్థాపనలో కీలక పరిణామమన్నారు. కాగా, శాంతి ప్రణాళికపై హమాస్ వేగంగా చర్యలు చేపట్టాలని, ఏమాత్రం ఆలస్యమైనా దారుణ పరిస్థితులు తప్పవని ట్రంప్ మరోసారి హెచ్చరించారు.



రెండేళ్ల మారణ హోమం..

2023 అక్టోబరు 7న హమాస్ వేలాది రాకెట్లతో చేసిన మెరుపుదాడిలో 1,200 మంది ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. మరో 251 మందిని హమాస్ బందీలుగా తీసుకెళ్లింది. దీనితో తీవ్రంగా ఆగ్రహించిన ఇజ్రాయెల్.. గాజాపై భీకరదాడులకు దిగింది. ఇజ్రాయెల్ దాడులతో గత రెండేళ్లలో గాజాలో 67 వేల మందికిపైగా మరణించారని హమాస్ ఆరోగ్య విభాగం ప్రకటించింది.

హమాస్ చేస్తున్న డిమాండ్లు ఏమిటి?

గాజా రాజకీయ భవిష్యత్తు, పాలస్తీనా హక్కులపై పూర్తి స్పష్టత రావాలని.. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని హమాస్ కోరుతోంది. గాజా నుంచి ఇజ్రాయెల్ దళాలు సంపూర్ణంగా తొలగిపోవాలని డిమాండ్ చేస్తోంది. గాజా పరిపాలనను నిపుణులతో కూడిన స్వతంత్ర పాలస్తీనా సంస్థకు అప్పగించేందుకు సిద్ధమని.. అయితే అమెరికా చెప్పినట్టుగా కాకుండా అరబ్, ఇస్లామిక్ దేశాలు, పాలస్తీనావాసుల ఉమ్మడి అంగీకారంతో ఈ ఏర్పాటు జరగాలని కోరుతోంది. అయితే 20సూత్రాల ప్రణాళికలో కీలకమైన ఆయుధాలు వదిలేయాలన్న అంశంపై హమాస్ ఎలాంటి స్పందన వెల్లడించలేదు. హమాస్ ఇంకా 48 మంది బందీలను అప్పగించాల్సి ఉంది. అందులో 20 మందే జీవించి ఉన్నట్టు అంచనా. మరోవైపు ఇజ్రాయెల్ వద్ద బందీలుగా ఉన్న సుమారు 250 మంది పాలస్తీనీయులను విడుదల చేసే అవకాశం ఉంది.

శాంతికి అడ్డంకులు మరెన్నో..

ట్రంప్ 20 సూత్రాల శాంతి ప్రణాళికలో పాలస్తీనా దేశం ఏర్పాటు అంశం కూడా ఉంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ దీనికి తాము సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. ఒప్పందంలో ఈ అంశం లేదని, పాలస్తీనా దేశం ఏర్పాటుకు తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. మరోవైపు ఆయుధాలు వదిలేసేందుకు హమాస్ సిద్ధంగా లేదు. ప్రస్తుతం పాలనను స్వతంత్ర పాలస్తీనా సంస్థకు అప్పగించేందుకు సిద్ధమని హమాస్ చెప్పినా.. అధికారంలో భాగస్వామ్యం కావొద్దన్న నిబంధననూ అంగీకరించడం లేదు. అంతేకాదు కీలక మధ్యవర్తులైన ఈజిప్ట్, ఖతార్ మాత్రం ట్రంప్ 20సూత్రాల ప్రణాళికలోని కొన్ని అంశాలపై లోతుగా చర్చించి, స్పష్టతకు రావాల్సి ఉందని ప్రకటించాయి.

పుట్టుకతో సంక్రమించే పౌరసత్వాన్ని రద్దుచేయలేరు

ట్రంప్ సర్కారుకు తేల్చి చెప్పిన ఫెడరల్ అప్పీళ్ల కోర్టు

బోస్టన్/సియాటెల్, అక్టోబరు 4: దేశంలో అక్రమంగా ఉంటున్న, లేదా తాత్కాలికంగా నివసిస్తున్న ప్రజలకు జన్మించే పిల్లలకు పుట్టుకతో సంక్రమించే పౌరసత్వాన్ని రద్దు చేయలేరని బోస్టన్‌లోని ఒక ఫెడరల్ అప్పీళ్ల కోర్టు ట్రంప్ సర్కారుకు తేల్చి చెప్పింది. ఫస్ట్ యూఎస్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌కు చెందిన ముగ్గురు జడ్జీల ప్యానెల్ శుక్రవారం ఈ మేరకు రూలింగ్ ఇచ్చింది. ట్రంప్ ఆదేశాన్ని నిలిపివేస్తూ, అలాగే ఆ ఆదేశాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు అనుమతిస్తూ కింది కోర్టు జారీ చేసిన ప్రిలిమినరీ ఇంజక్షన్ ఆర్డర్‌ను జడ్జీల ప్యానెల్ సమర్థించింది. దీంతో ఈ అంశంపై ట్రంప్ జారీ చేసిన ఆదేశాలకు చట్టపరంగా అవరోధాలు పెరిగినట్టైంది. ఈ అంశంపై ట్రంప్ ఆదేశాలను అడ్డుకున్న 5వ ఫెడరల్ కోర్టు ఇది. జనవరిలో ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రోజే ఈ వివాదాస్పద ఆదేశంపై సంతకం చేశారు. అమెరికాలో అక్రమంగా, లేదా తాత్కాలికంగా నివసిస్తున్న ప్రజలకు జన్మించే పిల్లలకు ఆటోమేటిక్‌గా సంక్రమించే పౌరసత్వ హక్కును నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

హెచ్1బీ వీసా ఫీజు పెంపును అడ్డుకోండి..

హెచ్1బీ వీసా ఫీజును రూ.88 లక్షలకు పెంచాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ కోర్టులో తాజాగా పిటిషన్ దాఖలైంది. ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకోవాలని కోరుతూ వైద్య సిబ్బంది, మత సంస్థల నాయకులు, ప్రొఫెసర్లు సంయుక్తంగా శుక్రవారం శాన్‌ఫ్రాన్సిస్కోలోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. 'ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకోకపోతే ఆస్పత్రులు వైద్య సిబ్బందిని, తరగతి గదులు టీచర్లను కోల్పోతాయి. దేశవ్యాప్తంగా పరిశ్రమలు కీలక ఆవిష్కర్తలను కోల్పోయే ముప్పు పొంచి ఉంది' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

చెల్లుబాటు కాని ఫాస్టాగ్ వాహనదారులకు ఊరట

- యూపీఐతో చెల్లిస్తే 1.25 రెట్ల టోల్ చార్జీనే
- నవంబరు 15 నుంచి అమలు

న్యూఢిల్లీ, అక్టోబరు 4: జాతీయ రహదారులపై ఉండే టోల్ ప్లాజాల వద్ద నగదు లావాదేవీలను తగ్గించి డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చెల్లుబాటు కానీ, పనిచేయని ఫాస్టాగ్‌తో టోల్ ప్లాజాలోకి వాహనాలు ప్రవేశించినప్పుడు సాధారణ టోల్ మొత్తంకన్నా రెండు రెట్లు అధికంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ మొత్తాన్ని నగదు రూపంలో కాకుండా యూపీఐని వాడి వాహనదారులు చెల్లింపులు చేస్తే మాత్రం 1.25 రెట్లు మాత్రమే వసూలు చేయనున్నారు. దీంతో ఆయా వాహనదారులకు కాస్త ఊరట లభించనుంది. తాజా నిబంధనను నవంబరు 15 నుంచి అమలు చేయనున్నారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఫీ (రేట్ల నిర్ణయం, వసూలు) నిబంధనలు, 2008ను కేంద్ర ప్రభుత్వం సవరించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది.

'మీ డబ్బు, మీ హక్కు'

- క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లపై క్యాంపెయిన్

అహ్మదాబాద్, అక్టోబరు 4: బ్యాంకులు, రెగ్యులేటరీల వద్ద క్లెయిమ్ చేయని (అన్‌క్లెయిమ్డ్) ఫైనాన్షియల్ ఆస్తులైన బీమా పాలసీ క్లెయిమ్‌లు, బ్యాంకు డిపాజిట్లు, డివిడెండ్‌లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన మొత్తం క్రమంగా పెరుగుతోంది. దీనిని హక్కుదారులు తిరిగి పొందడానికి సహకరించే లక్ష్యంతో 'మీ డబ్బు, మీ హక్కు' పేరుతో దేశవ్యాప్త క్యాంపెయిన్ శనివారం ప్రారంభమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఈ క్యాంపెయిన్‌ను గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ప్రారంభించారు. ఈ నెల నుంచి డిసెంబరు వరకు ఇది కొనసాగుతుంది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రజలు తమ అన్‌క్లెయిమ్డ్ ఆస్తులను ఏవిధంగా వెదకాలి, వాటిని ఏవిధంగా క్లెయిమ్ చేసుకోవాలన్న దానిపై స్పష్టమైన సమాచారం ఇవ్వనున్నారు. వ్యక్తులు తమ రికార్డులు అప్‌డేట్ చేసుకోవడానికి, క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేయడానికి సహకరిస్తారు. ఈ క్యాంపెయిన్ ప్రారంభం సందర్భంగా నిర్మల మాట్లాడుతూ..బ్యాంకులు, రెగ్యులేటరీల వద్ద రూ.1.84లక్షల కోట్ల విలువైన అన్‌క్లెయిమ్డ్ ఫైనాన్షియల్ ఆస్తులున్నట్టు పేర్కొన్నారు.

అ..శాంతిలో ట్రంప్!

- నోబెల్ బహుమతి కోసం ఆరాటం
- తనను కాదంటే అమెరికాను అవమానించినట్టేనని వింత వాదన

వాషింగ్టన్, అక్టోబరు 4 : 'నాకు శాంతి నోబెల్ ఇవ్వాల్సిందే' అంటూ హూంకరింపు... 'అయినా, నాకెందుకు ఇస్తారులే..' అంటూ నిష్ఠూరాలు.. 'ఇన్ని యుద్ధాలు ఆపిన మరో మొనగాడు లేడు' అంటూ ప్రగల్భాలు.. 'కానీ, ఆ బహుమతి ఎప్పటికీ నాకివ్వరు' అంటూ నిరాశ పలుకులు.. ఇదీ కొన్ని నెలలుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వరస.. ప్రపంచంలో శాంతిని సాధించిన వారి కోసం ఏర్పాటుచేసిన శాంతి నోబెల్ విజేతను ఈ నెల 10వ తేదీన ప్రకటిస్తారు. ఆ టెన్షన్‌తో ట్రంప్ మరింత అశాంతితో రగిలిపోతున్నారు. ఏమైనా ఈసారి దానిని దక్కించుకోవాలని ఆరాటపడిపోతున్నారు. తాజాగా ట్రంప్ రూపొందించిన శాంతి ప్రణాళికకు ఇజ్రాయెల్, హమాస్ పాక్షికంగా తలూపడంతో ఆయనకు ఇక పట్టపగ్గాలు లేకుండాపోయాయి. 'శాంతి నోబెల్'పై ప్రకటనల్లో దూకుడు పెంచేశారు. "నాకు శాంతినోబెల్ ఇవ్వాల్సిందే. లేదంటే అమెరికాను ఘోరంగా అవమానించినట్టే"నని తాజాగా ట్రంప్ సెలవిచ్చారు. గాజా కూడా కొలిక్కి వస్తే, మొత్తం ఎనిమిది యుద్ధాలను తాను ఆపినట్టు అవుతుందని తెలిపారు. వర్జీనియాలోని క్వాంటికోలో సైనికాధికారులతో ట్రంప్ తాజా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతి నోబెల్ ప్రస్తావన వచ్చింది. "గాజాలో శాంతి సాధించాం. అక్కడ వివాదం పరిష్కారమైయినట్టే" అని ట్రంప్ అభిప్రాయపడ్డారు. హమాస్, ఇజ్రాయెల్, అరబ్ రాజ్యాలు, ముస్లిం దేశాలు.. అన్నీ తన శాంతి ప్రతిపాదనకు అంగీకరించాయని తెలిపారు. ఒకవేళ హమాస్ తోక జాడిస్తే అదే ఆసంస్థకు ఆఖరిరోజు అవుతుందని చెప్పి దారికి తెచ్చానని పేర్కొన్నారు. 'ఇది అద్భుతం.. అమోఘం' అంటూ తన జబ్బ తానే చరుసుకున్నారు. అంతలోనే ఆయన దిగాలుపడిపోయారు. "ఇంత చేశాం. గతంలో ఎవరూ ఇన్ని యుద్ధాలు ఆపలేదు. నేను ఇంత గొప్ప పని చేశాను. మరి.. నాకు శాంతినోబెల్ వస్తుందా అంటే.. కచ్చితంగా రాదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలాంటి చరిత్ర ఏదీ లేని ఎవరో అనామకుడికి, లేదంటే.. ఇన్ని యుద్ధాలు ఆపిన ట్రంప్ మెదడు పనితీరుపై పరిశోధన చేసే రచయితలకు శాంతి నోబెల్ ఇస్తారంటూ నిష్ఠూరాలాడారు. అయినా, చూద్దాం, ఏం జరుగుతుందో నంటూ ఒకింత ఆశాభావం కూడా ఈ భేటీలో ఆయన కనపరిచారు. "నా కోసం శాంతి నోబెల్ కోరడం లేదు. నాకు అవసరం లేదు కూడా. కానీ, అమెరికాకు ఈ గౌరవం దక్కాలి' అన్నారు. ఎనిమిదో యుద్ధం ఆగిపోతే సహజంగానే ఆ గౌరవానికి అర్హత పొందినట్టేనని ధీమా వ్యక్తంచేశారు. "నావి వట్టి నోటి మాటలు కాదు. ఇలాంటి వ్యవహారాలు ఎలా ముడిపడతాయనేది, జీవితమంతా వాటితోనే గడిపిన నాకే బాగా తెలుస్తుంది" అని ట్రంప్ సెలవిచ్చారు.



2018 నుంచే ట్రంప్ పోరాటం..

ప్రతిష్ఠాత్మకంగా భావించే నోబెల్ బహుమతుల ప్రదానోత్సవానికి వేళయింది. సాహిత్యం.. అర్థికశాస్త్రం.. భౌతిక శాస్త్రం.. రసాయన శాస్త్రం.. వైద్యశాస్త్రం.. శాంతి.. ఇలా ఆరు విభాగాల్లో అవార్డులను ప్రకటించే కార్యక్రమం వచ్చే వారం నుంచి మొదలుకానుంది. ప్రముఖ శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ నుంచి విశ్వమాత మదర్ థెరెసా వరకు.. గౌరవించి ఈ అవార్డులు తమ గౌరవం పెంచుకున్నాయి. ట్రంప్ 2018లో తొలిసారి అధ్యక్షుడు అయినప్పటినుంచీ శాంతి నోబెల్ కోసం ఆయన పేరును పలువురు అమెరికన్లు, విదేశీ నేతలు ప్రతిపాదిస్తూ వస్తున్నారు. చివరిగా గత డిసెంబరులో ఓ రిపబ్లికన్ సభ్యురాలు ఆయన పేరును ఈ అవార్డుకు సూచించారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య సంబంధాలను సులభతరంచేస్తూ..అబ్రహాం ఒప్పందాలను కుదర్చడంతో ఆయన కృషిని అవార్డు కమిటీ గుర్తించాలని ఆమె కోరారు. నోబెల్ అవార్డు నిబంధనల ప్రకారం.. ట్రంప్ శాంతి నోబెల్ కోసం తన పేరును నామినేట్ చేసుకోవడానికి వీలు ఉండదు. ఆయన పేరును ఎన్నిసార్లు అయినా ఇతరులు నామినేట్ చేయొచ్చు. గత ఏడాది కాలంలో జరిపిన శాంతి కృషిని మాత్రమే అవార్డు కమిటీ పరిగణనలోకి తీసుకుంటుంది. శాంతి అవార్డును నార్వేలోని ఓస్లోలో ప్రదానం చేస్తారు. సైన్స్ అవార్డులను స్టాక్‌హోమ్‌లో అందిస్తారు.

లద్ధాఖ్‌కు చైనా ముప్పు!?

- పూర్తిస్థాయి రాష్ట్ర హోదాతో సమస్యలు
- ఆరో షెడ్యూల్‌లో చేరిస్తే మణిపూర్ వంటి ప్రాంతాల నుంచీ డిమాండ్లు



న్యూఢిల్లీ, అక్టోబరు 4: లద్ధాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇస్తే సరిహద్దుల్లో ఉన్న చైనా, పాకిస్థాన్ నుంచి సమస్యలు వస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందా!? లద్ధాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేరిస్తే.. మిగిలిన ప్రాంతాల నుంచీ ఇటువంటి డిమాండ్లే వస్తాయని అనుమానిస్తోందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఈ కారణంగానే చర్చల పేరిట కేంద్ర హోం శాఖ కాలయాపన చేస్తోందని ఆరోపిస్తున్నారు. నిజానికి, 2019 వరకూ లద్ధాఖ్‌కు పరిమితి స్వయం ప్రతిపత్తి మాత్రమే ఉంది. స్వయం ప్రతిపత్తి కలిగిన రెండు మండళ్ల ద్వారా ఇక్కడ పాలన సాగేది. అయితే, 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్ము కశ్మీరును కేంద్ర పాలిత ప్రాంతంగా.. లద్ధాఖ్‌ను శాసన సభ లేని కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడంతో ఈ మండళ్లు బలహీనమయ్యాయి. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అప్పుడు సామాజిక, రాజకీయ, మతపరమైన వ్యక్తులతో లే అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ) ఏర్పడ్డాయి. లద్ధాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వాలని, ఈ ప్రాంతాన్ని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని ఉద్యమం ప్రారంభించాయి. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర హోం శాఖ 2023 జనవరిలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కానీ, దాని పనితీరు నత్తను మరిపిస్తోంది. కమిటీ సమావేశం ఈనెల ఆరో తేదీన అంటే, సోమవారం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే, లద్ధాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న శాంతియుత ర్యాలీ కాస్తా హింసాత్మకంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో సోమవారంనాటి జరుగుతుందా లేదా అనేదీ అనుమానమే. దీనికితోడు, లద్ధాఖ్‌లో పూర్తిస్థాయి శాంతి నెలకొనే వరకూ చర్చలకు దూరంగా ఉంటామని ఎల్ఏబీ, కేడీఏ ప్రకటించాయి. ఈ నేపథ్యంలో.. ఇటు చైనా, అటు పాకిస్థాన్ సరిహద్దుల్లో వ్యూహాత్మక ప్రాంతంలో లద్ధాఖ్ ఉండడంతో దానికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వడం లేదా ఆరో షెడ్యూల్‌లో చేర్చడంపై మోదీ ప్రభుత్వం తర్జనభర్జనలు పడుతోందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.